www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సంక్రాంతి శుభాకాంక్షలు

గురువారం | 15-1-2026 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 310 | గుంటూరు సిటీ

శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం, తిథి: ద్వాదశి రా.8:17 తదుపరి త్రయోదశి, నక్షత్రం: జ్యేష్ఠ తె.5:48 తదుపరి మూల, వర్జ్యం: ఉ.9:18-11:05, దుర్ముహూర్తం: ఉ.10:33-11:18, మ.2:59-3:43, అమృతఘడియలు: రా.7:59-9:46, రాహుకాలం: మ.1:30-3:00, సూర్యోదయం: 6:52, సూర్యాస్తమయం: 5:56

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,43,620	1,31,650	3,00,000
విజయవాడ	1,46,000	1,36,000	2,90,000
విశాఖపట్నం	1,46,463	1,31,650	3,07,000
రాజమండ్రి	1,43,620	1,31,650	2,76,000
ప్రొద్దుటూరు	1,43,300	1,31,840	2,78,000
ముంబై	1,42,020	1,30,090	2,77,510

వెండి కిలో 3,00,000



హైదరాబాద్‌లో కొత్త రికార్డు, విశాఖలో రూ.3.07 లక్షలు

ఢిల్లీ మార్కెట్లో 4 సెషన్లలో రూ.42,500 వృద్ధి

న్యూఢిల్లీ: కొత్త ఏడాదిలో బులియన్ మార్కెట్ రేసు గుర్రంలా పరిగెడుతోంది. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి తొలిసారిగా రూ.3 లక్షలు నమోదు చేసింది. మంగళవారంనాటి ధర రూ.2.92 లక్షలతో పోల్చితే రూ.8,000 పెరిగింది. విశాఖలో కూడా ధర అదే స్థాయిలో పెరిగి రూ.3.07 లక్షలు పలికింది. ఇక ఢిల్లీ స్పాట్ మార్కెట్‌లో అయితే బుధవారం ఒక్క రోజే ధర రూ.15,000 పెరిగి (5.5%) రూ.2.86 లక్షల రికార్డు స్థాయికి చేరింది. పది గ్రాముల మేలిమి (24 కేరట్స్) బంగారం ధర సైతం రూ.1,500 పెరిగి రూ.1,46,500కు చేరి మరో ఆల్‌టైమ్ రికార్డు నమోదు చేసింది. గత నాలుగు సెషన్స్‌లోనే ఢిల్లీ మార్కెట్లో కిలో వెండి ధర రూ.42,500 (17.45%), 10 గ్రాముల మేలిమి పసిడి ధర రూ.6,000 (4.3%) పెరిగాయి. ఈ ఏడాది ప్రారంభం నుంచి చూస్తే 14 రోజుల్లో కిలో వెండి ధర 20% (రూ.47,000), 10 గ్రాముల బంగారం ధర 6.4% (రూ.8,800) పెరిగాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరగడంతో పాటు కల్లోలిత వాతావరణంలో సురక్షిత పెట్టుబడి సాధనంగా వెండి, బంగారాలకు గల ప్రసిద్ధి ఇన్వెస్టర్లను కొనుగోళ్ల దిశగా పరుగులు తీయించింది. దీనికి తోడు ప్రధాన కరెన్సీలతో డాలర్ బలహీనత, కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు, పారిశ్రామిక వినియోగంలో వృద్ధి ఈ బుల్‌రన్‌కు కారణమని విశ్లేషకులంటున్నారు.

అంతర్జాతీయ మార్కెట్: అంతర్జాతీయ స్పాట్ మార్కెట్‌లోనూ బంగారం, వెండి ధరలు సెగలు కక్కుతున్నాయి. బుధవారం ఒక దశలో ఔన్స్ (31.10 గ్రాములు) మేలిమి బంగారం 4,640.13 డాలర్లకు చేరి కొత్త రికార్డు నమోదు చేసింది. ఔన్స్ వెండి ధర 91.86 డాలర్లకు చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.

ర్యాలీకి కారణాలు

- ప్రధాన కరెన్సీలతో డాలర్ మారకం రేటు క్షీణించడం.
- అమెరికా ఫెడ్ రిజర్వు వడ్డీ రేట్లు తగ్గిస్తుందనే అంచనాలు.
- ఫారెక్స్ నిల్వల వికేంద్రీకరణలో భాగంగా కేంద్ర బ్యాంకుల కొనుగోళ్లు.
- వెండి ఎగుమతులపై చైనా విధించిన ఆంక్షలు.
- డాలర్‌తో క్షీణిస్తున్న రూపాయి మారకం రేటు.

ఈ ఏడాది వృద్ధి 7.2%

● అంచనా భారీగా పెంచిన ప్రపంచ బ్యాంక్

న్యూఢిల్లీ: ప్రపంచ బ్యాంకు భారత వృద్ధిరేటును గణనీయంగా పెంచింది. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో భారత్ 7.2% వృద్ధిని నమోదు చేస్తుందని తాజాగా అంచనా వేసింది. జూన్‌లో ప్రకటించిన అంచనాల కన్నా ఇది 0.9% అధికం. పన్ను సంస్కరణలు, భారీగా పెరిగిన వస్తుసేవల డిమాండు ఇందుకు ఊతం ఇస్తాయని తాజా నివేదికలో తెలిపింది. కాని 2026-27 ఆర్థిక సంవత్సరంలో మాత్రం వృద్ధి 6.5 శాతానికి మందగిస్తుందని అంచనా వేసింది. అయినా కూడా ప్రపంచంలో వేగంగా వృద్ధి సాధిస్తున్న ఆర్థిక వ్యవస్థగా భారత్ తన స్థానాన్ని కాపాడు కోగలుగుతుందని పేర్కొంది. అమెరికా ప్రతికూల సుంకాల ప్రభావాన్ని బలమైన దేశీయ డిమాండు, ఎగుమతుల రంగం స్థితి స్థాపకత తటస్థం చేయ వచ్చునని తెలిపింది. పన్ను సంస్కరణల ప్రభావంతో దేశంలో వస్తుసేవల డిమాండు బలంగా ఉన్నదని, గ్రామీణ గృహస్థుల వాస్తవిక ఆదాయాలు మెరుగు పడ్డాయని పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

15వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	575
వరంగల్	542	గోదావరి	550
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	156	విజయవాడ	157
వరంగల్	156	గుంటూరు	164
కరీంనగర్	156	ఒంగోలు	164
మహబూబ్‌నగర్	156	చిత్తూరు	164
కర్నూలు	156	నెల్లూరు	169
విశాఖపట్నం	145	అనంతపురం	169
గోదావరి	157		

ఇన్ఫీ లాభం రూ.6,654 కోట్లు

క్యూ3లో 2.2% తగ్గుదల.. కొత్త లేబర్ కోడ్ అమలు ప్రభావం


న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో ఇన్ఫోసిస్ ఏకీకృత నికర లాభం వార్షిక ప్రాతిపదికన 2.2% తగ్గి రూ.6,654 కోట్లకు పరిమితమైంది. గత ఆర్థిక సంవత్సరంలో ఇదే కాలానికి కంపెనీ లాభం రూ.6,806 కోట్లుగా నమోదైంది. ఈ క్యూ3లో ఇన్ఫోసిస్ ఆదాయం 8.89% వృద్ధితో రూ.45,479 కోట్లకు చేరుకుంది. 2024-25లో ఇదే కాలానికి రాబడి రూ.41,764 కోట్లుగా ఉంది. ఈ ఆర్థిక సంవత్సరంలోనే సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే, క్యూ3లో సంస్థ లాభం 9.6% తగ్గగా.. ఆదాయం 2.2% పెరిగింది.

● కొత్త కార్మిక చట్టాల అమలులో భాగంగా సిబ్బందికి గ్రాట్యుటీ, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ బకాయిల చెల్లింపుల కోసం క్యు3లో రూ.1,289 కోట్లు కేటాయించడం ఇన్ఫోసిస్ లాభంపై ప్రభావం చూపింది.

● ఈ ఆర్థిక సంవత్సరానికి ఇన్ఫీ ఆదాయ వృద్ధి అంచనా మెరుగైంది. స్థిర కరెన్సీ ఆధారిత ఆదాయ వృద్ధి అంచనాను కంపెనీ గతంలో ప్రకటించిన 2-3% నుంచి 3-3.5 శాతానికి పెంచింది. నిర్వహణ లాభాల మార్జిన్‌ను 20-22 శాతంగా అంచనా వేసింది.

● గడిచిన మూడు నెలల్లో ఇన్ఫోసిస్ 480 కోట్ల డాలర్ల విలువైన బడా కాంట్రాక్టులను దక్కించుకుంది. అందులో 57 శాతం కొత్తవే. బడా డీల్స్ ఈ క్యూ1లో 380 కోట్ల డాలర్లుగా, క్యూ2లో 310 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.

● గడిచిన త్రైమాసికంలో కంపెనీ రూ.18,000 కోట్ల షేర్ల బైబ్యాక్‌తో పాటు మధ్యంతర డివిడెండ్ చెల్లింపులను కూడా విజయవంతంగా పూర్తి చేసింది.



డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కంపెనీ బలమైన పనితీరు కనబరిచింది. నైపుణ్యం, ఆవిష్కరణల సామర్థ్యాలు, బలమైన డెలివరీ యోగ్యతను ప్రదర్శిస్తున్న కృత్రిమ మేధ (ఏఐ) భాగస్వామిగా ఇన్ఫోసిస్‌ను క్లయింట్లు చూస్తున్నారు. ఇది వారి వ్యాపార సామర్థ్యం, విలువను పెంచుకునేందుకు దోహదపడింది. ఏఐ ప్రపంచంలో విజయ సాధించేందుకు మా సిబ్బంది పరివర్తనం, సాధికారత కోసం నైపుణ్య శిక్షణలో కంపెనీ నిబద్ధత ఈ ప్రయాణంలో ప్రధానంగా మారింది.

- సలీల్ పరేఖ్, ఇన్ఫోసిస్ సీఈఓ, ఎండీ

● 2025 డిసెంబరు 31తో ముగిసిన మూడు నెలల్లో కంపెనీ ఉద్యోగుల సంఖ్య నికరంగా 5,043 పెరుగుదలతో 3,37,034కు చేరుకుంది.

మేడ్ ఇన్ ఇండియా జీఎల్ఎస్ మేబ్యాక్

ధర రూ.2.75 కోట్లు.. స్థానికంగా తయారీతో రూ.40 లక్షలు తగ్గిన రేటు

పుణె: మెర్సిడెస్ బెంజ్ కంపెనీ భారత్‌లో తయారుచేసిన అల్ట్రా లగ్జరీ కారు 'జీఎల్ఎస్ మేబ్యాక్‌'ను బుధవారం మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.2.75 కోట్లు. కంపెనీ గతంలో ఈ కారును భారత్‌లోకి దిగుమతి చేసుకుని విక్రయించేంది. అప్పుడు ధర రూ.3.17 కోట్లుండగా.. పుణె ప్లాంట్‌లో ఈ కారు అసెంబ్లింగ్‌ను ప్రారంభించడంతో రేటు రూ.42 లక్షల మేర తగ్గింది. కాగా, అమెరికా వెలుపల ఈ కారు తయారీకి మెర్సిడెస్ బెంజ్ భారత మార్కెట్‌నే ఎంచుకోవడం విశేషం. అంతేకాదు, మెర్సిడెస్ మేబ్యాక్ మార్కెట్లలో భారత్ తొలిసారిగా టాప్-5లోకి చేరింది.



రెండో రోజూ మార్కెట్ డౌన్

ముంబై: ఈక్విటీ మార్కెట్ వరుసగా రెండో రోజు కూడా నష్టాలతోనే ముగిసింది. సెన్సెక్స్ 244.98 పాయింట్ల నష్టంతో 83,382.71 వద్ద ముగియగా నిఫ్టీ 66.70 పాయింట్లు నష్టపోయి 25,665.60 వద్ద ముగిసింది. మెటల్స్, కమోడిటీస్, ఎనర్జీ షేర్లలో కొనుగోళ్లు సూచీల నష్టాలను పరిమితం చేశాయి.

షాడోఫ్యాక్స్ ఇష్యూ ధర శ్రేణి రూ.118-124

లాజిస్టిక్ సేవలందించే షాడోఫ్యాక్స్ వచ్చే మంగళవారం నుంచి ప్రారంభం కానున్న తమ ఐపిఓలో షేర్ల ధర శ్రేణిని ప్రకటించింది. ఒక్కో షేరు ధర శ్రేణి రూ.118-124గా నిర్ణయించింది. గరిష్ఠ ధరలో కంపెనీ విలువ రూ.7,100 ఉంటుంది. ఈ ఇష్యూ 20న ప్రారంభమై 22వ తేదీన ముగుస్తుంది.

యూబీఐ లాభంలో 9.7% వృద్ధి

ముంబై: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) 2025 డిసెంబరుతో ముగిసిన మూడో త్రైమాసికంలో రూ.5,073 కోట్ల ఏకీకృత నికర లాభం ప్రకటించింది. వార్షిక ప్రాతిపదికన లాభం 9.7% వృద్ధి చెందింది. కేటాయింపులు తగ్గడం ఇందుకు దోహదపడినట్టు బ్యాంక్ తెలిపింది. గడిచిన మూడు నెలలకు బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) 0.95% పెరిగి రూ.9,328 కోట్లుగా నమోదు కాగా.. నికర వడ్డీ మార్జిన్ (ఎన్ఐఎం) 2.76 శాతానికి తగ్గింది. బ్యాంక్ రుణ వృద్ధి 7.13 శాతంగా, డిపాజిట్ల వృద్ధి 3.36 శాతంగా నమోదైంది. వడ్డీయేతర ఆదాయం 2.28% పెరిగి రూ.4,541 కోట్లకు చేరింది. గడిచిన త్రైమాసికంలో రూ.1,820 కోట్ల రుణాలు మొండిబాకీలుగా మారాయని, స్థూల మొండి బాకీలు మాత్రం 3.06 శాతానికి తగ్గాయని బ్యాంక్ వెల్లడించింది. మొండి బకాయిలతోపాటు ఇతర అవసరాల కోసం కేటాయింపులు 322.23 కోట్లకు తగ్గాయి.



బీవీఆర్ మోహన్‌రెడ్డికి లివింగ్ లెజెండ్ అవార్డు

హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా పని చేస్తున్న ఇంటెలిజెంట్ ఇంజనీరింగ్ సొల్యూషన్ల కంపెనీ సైయెంట్ వ్యవస్థాపకుడు డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డికి జియో స్పేషియల్ వరల్డ్ సంస్థ నుంచి అరుదైన పురస్కారం లభించింది. జియో స్పేషియల్ పరిశ్రమకు దేశంలోను, ప్రపంచంలోనూ ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా ఆయనకు "లివింగ్ లెజెండ్" అవార్డును జియో స్మార్ట్ ఇండియా 25వ సదస్సులో అందించింది.

'బీ న్యూ' స్టోర్లలో సంక్రాంతి ఆఫర్లు



హైదరాబాద్: మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలు, గృహోపయోగ వస్తువులు విక్రయించే 'బీ న్యూ' సంక్రాంతి ప్రత్యేక ఆఫర్లు ప్రకటించింది. ప్రతి మొబైల్ ఫోన్ కొనుగోలుపై కచ్చితమైన బహుమతి ఉంటుందని కంపెనీ సీఈఓ సాయి నిఖిలేష్ చెప్పారు. దీనికి తోడు ఎస్‌బీఐ కార్డ్స్‌తో కొనే సరికొత్త సాంసంగ్, వివో, ఒప్పో, రియల్‌మీ, ఐఫోన్లు, ఎంఐ స్మార్ట్ ఫోన్లపై 10% క్యాష్‌బాక్ కూడా ఉంటుందన్నారు. యాక్సెసరీలపై అయితే 80% వరకు ఇన్‌స్టాంట్ డిస్కౌంట్ ఉంటుందని చెప్పారు. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ ఉపకరణాలతో పాటు బీ న్యూ స్టోర్లలో కొత్తగా ఏసీలు, కూలర్లు, స్మార్ట్ టీవీలు, వాషింగ్ మెషిన్ల అమ్మకాలు కూడా ప్రారంభించారు. హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, బజాజ్ ఫిన్‌సర్వ్ కార్డులతో చేసే చెల్లింపులపైనా ప్రత్యేక ఆఫర్లుంటాయని బీ న్యూ సీఎండీ బాలాజీ చౌదరి చెప్పారు. తమకు చెందిన 150 స్టోర్లలో ఈ ప్రత్యేక ఆఫర్లు ఉపయోగించుకోవచ్చన్నారు.

స్పోర్ట్స్

మిచెల్ భారత్‌లో ఆడిన చివరి నాలుగు వన్డేల్లో 3 శతకాలు, ఓ హాఫ్ సెంచరీ ఉండడం విశేషం. భారత్‌లో భారత్‌పై అత్యధిక సెంచరీలు (3) చేసిన తొలి కివీస్ బ్యాటర్ మిచెల్. **1**

భారత గడ్డపై కివీస్‌కిదే అత్యధిక ఛేదన (285).

సమం చేశారు



రెండో వన్డేలో భారత్‌పై కివీస్ విజయం

డారిల్ మిచెల్ సూపర్ సెంచరీ

రాహుల్ అజేయ శతకం వృథా

రాజ్‌కోట్: మూడు వన్డేల సిరీస్‌లో సజీవంగా ఉండాలంటే కచ్చితంగా గెలవాల్సిన పోరులో న్యూజిలాండ్ అదరగొట్టింది. బౌలర్ల ప్రతిభకు తోడు, అద్భుత ఫామ్‌లో ఉన్న డారిల్ మిచెల్ (117 బంతుల్లో 11 ఫోర్లు, 2 సిక్సర్లతో 131 నాటౌట్) అజేయ శతకంతో వహ్వా.. అనిపించాడు. దీంతో బుధవారం భారత్‌తో జరిగిన రెండో వన్డేలో కివీస్ 7 వికెట్లతో ఘనవిజయం సాధించింది. సిరీస్‌ను 1-1తో సమం చేసింది. నిర్ణాయక ఆఖరి వన్డే ఆదివారం ఇండోర్‌లో జరుగుతుంది. కాగా.. 2017 తర్వాత భారత్‌లో కివీస్ గెలవడం ఇదే తొలిసారి. ముందుగా భారత్ 50 ఓవర్లలో 7 వికెట్లకు 284 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (92 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 112 నాటౌట్) అజేయ సెంచరీతో సత్తా చాటగా, కెప్టెన్ గిల్ (53 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్‌తో 56) అర్ధశతకం చేశాడు. క్రిస్టియన్ క్లార్క్‌కు 3 వికెట్లు దక్కాయి. ఛేదనలో కివీస్ 47.3 ఓవర్లలో 286/3 స్కోరు చేసి నెగ్గింది. విల్ యంగ్ (98 బంతుల్లో 7 ఫోర్లతో 87), గ్లెన్ ఫిలిప్స్ (32 నాటౌట్) సహకరించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా డారిల్ మిచెల్ నిలిచాడు.

డారిల్-యంగ్ శతక భాగస్వామ్యం: ఓ మాదిరి ఛేదనలో కివీస్ చివరి వరకు నిలకడగా రాణించింది. ఆరంభంలో పేసర్ల జోరుకు ఓపెనర్లు కాన్వే (16), నికోల్స్ (10) తక్కువ స్కోర్లకే వెనుదిరిగారు. అటు పవర్‌ప్లేలో జట్టు చేసింది 34 పరుగులే. అయితేనేం.. ఫామ్‌లో ఉన్న డారిల్ మిచెల్ మరోసారి చక్కటి స్వీప్ షాట్లతో ఆకట్టుకున్నాడు. అతడికి యంగ్ తోడవ్వడంతో భారత బౌలర్లు వికెట్ తీసేందుకు చెమటోడ్చారు. 13వ ఓవర్‌లో జత కట్టిన ఈ జోడీ సమన్వయ ఆటతీరుతో పాతిక ఓవర్ల పాటు ఆధిపత్యం చూపారు. కుల్దీప్ ఓవర్లలో మిచెల్ భారీషాట్లకు దిగాడు. మిచెల్ 80 పరుగుల వద్ద ఉన్నప్పుడు సులువైన క్యాచ్‌ను ప్రసిద్ధ్ వదిలేశాడు. శతకం వైపు సాగుతున్న యంగ్‌ను కుల్దీప్ అవుట్ చేయడంతో మూడో వికెట్‌కు 162 పరుగుల భారీ భాగస్వామ్యానికి చెక్ పడింది. తర్వాత మిచెల్ 96 బంతుల్లో శతకం పూర్తి చేసుకోగా.. ఫిలిప్స్ సహకారంతో 15 బంతులుండగానే ఫోర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.

ఆదుకున్న రాహుల్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ ఇన్నింగ్స్ ఆచితూచి సాగినా.. ఓపెనర్లు రోహిత్ (24), గిల్ శుభారంభం అందించారు. పేసర్ జేమిసన్ తన పదునైన బంతులతో తొలి రెండు ఓవర్లను మెయిడిన్‌గా వేశాడు. కానీ తొలి ఐదు ఓవర్లలో 10 పరుగులే రాగా, ఆ తర్వాత రోహిత్-గిల్ బౌండరీలతో విరుచుకుపడ్డారు. దీంతో పవర్‌ప్లేలో జట్టు 57 రన్స్‌తో నిలిచింది. అనంతరం రోహిత్‌ను క్లార్క్ అవుట్ చేయడంతో తొలి వికెట్‌కు 70 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. కాసేపటికే వరుసగా రెండో ఫిఫ్టీ పూర్తి చేసిన గిల్‌ను జేమిసన్ దెబ్బతీశాడు. ఆ తర్వాత పిచ్ నెమ్మదించడంతో పాటు కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బంతులు వేశారు. ఫలితంగా పది ఓవర్ల పాటు కనీసం బౌండరీ కూడా రాలేదు. దీనికి తోడు శ్రేయాస్ (8), విరాట్ కోహ్లీ (23)లను క్లార్క్ పెవిలియన్ చేర్చడంతో జట్టు 99/1 నుంచి ఒక్కసారిగా 118/4 స్కోరుతో కష్టాల్లో పడింది. ఈ దశలో రాహుల్-జడేజా (27) ఇన్నింగ్స్ చక్కదిద్దే బాధ్యత తీసుకున్నారు. రిస్కీ షాట్లకు వెళ్లకుండా సింగిల్స్‌పై దృష్టి సారించారు. ఆ తర్వాత రాహుల్ అడపాదడపా బౌండరీలతో 41వ ఓవర్‌లో జట్టు స్కోరు 200కి చేరింది. అయితే జడేజాను బ్రేస్‌వెల్ వెనక్కి పంపడంతో ఐదో వికెట్‌కు 73 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. బంతికో పరుగు చొప్పున సాధించిన నితీశ్ (20), హర్షిత్ (2) వరుస ఓవర్లలో అవుట వగా.. చివరి రెండు ఓవర్లలో రాహుల్ 26 రన్స్ అందించడంతో పాటు 87 బంతుల్లో శతకాన్ని పూర్తి చేశాడు.

డారిల్ మిచెల్ (131 నాటౌట్)

న్యూజిలాండ్‌పై భారత్ తరఫున ఎక్కువ పరుగులు (1773) చేసిన బ్యాటర్‌గా విరాట్. సచిన్ (1750)ను అధిగమించాడు. ఓవరాల్‌గా పాంటింగ్ (1971) ముందున్నాడు. **1**



కేఎల్ రాహుల్ (112 నాటౌట్)

8 రాహుల్, మిచెల్‌లకు ఇది ఎనిమిదో వన్డే సెంచరీ.

స్కోరుబోర్డు

భారత్: రోహిత్ (సి) యంగ్ (బి) క్లార్క్ 24, గిల్ (సి) మిచెల్ (బి) జేమిసన్ 56, కోహ్లీ (బి) క్లార్క్ 23, శ్రేయాస్ (సి) బ్రేస్‌వెల్ (బి) క్లార్క్ 8, రాహుల్ (నాటౌట్) 112, జడేజా (సి అండ్ బి) బ్రేస్‌వెల్ 27, నితీశ్ (సి) ఫిలిప్స్ (బి) ఫౌక్స్ 20, హర్షిత్ (సి) బ్రేస్‌వెల్ (బి) లెనాక్స్ 2, సిరాజ్ (నాటౌట్) 2, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 50 ఓవర్లలో 284/7; వికెట్ల పతనం:** 1-70, 2-99, 3-115, 4-118, 5-191, 6-248, 7-256; **బౌలింగ్:** జేమిసన్ 10-2-70-1, ఫౌక్స్ 9-0-67-1, క్లార్క్ 8-0-56-3, లెనాక్స్ 10-0-42-1, బ్రేస్‌వెల్ 10-1-34-1, ఫిలిప్స్ 3-0-13-0.

న్యూజిలాండ్: కాన్వే (బి) హర్షిత్ 16, నికోల్స్ (బి) ప్రసిద్ధ్ 10, విల్ యంగ్ (సి) నితీశ్ (బి) కుల్దీప్ 87, డారిల్ మిచెల్ (నాటౌట్) 131, గ్లెన్ ఫిలిప్స్ (నాటౌట్) 32, **ఎక్స్‌ట్రాలు: 10; మొత్తం: 47.3 ఓవర్లలో 286/3; వికెట్ల పతనం:** 1-22, 2-46, 3-208; **బౌలింగ్:** సిరాజ్ 9-0-41-0, హర్షిత్ రాణా 9.3-1-52-1, ప్రసిద్ధ్ 9-0-49-1, నితీశ్ 2-0-13-0, జడేజా 8-0-44-0, కుల్దీప్ 10-0-82-1.

పార్థు, చేతనకు కాంస్యాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ కెనోయి స్లాలోం చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రెండు కాంస్యాలు లభించాయి. బుధవారం మధ్యప్రదేశ్‌లోని సహస్త్రధార ఘాట్‌లో జరిగిన ఈ పోటీల్లో జూనియర్ పురుషుల విభాగంలో పార్థు లక్ష్మీశ్రీనివాస్, జూనియర్ మహిళల కేటగిరీలో చేతన భగవతి కాంస్య పతకాలు సాధించారు. రాష్ట్ర కెనోయింగ్-కయాకింగ్ సంఘం అధ్యక్షుడు బలరాం నాయుడు వీరిని అభినందించారు.

నేటినుంచే ప్రొ రెజ్లింగ్ లీగ్

యూపీ డామినేటర్స్ X పంజాబ్ రాయల్స్

(రాత్రి 8 గంటలకు సోనీ నెట్‌వర్క్‌లో)



మ. 1 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

కుర్రాళ్లు 'సిక్సర్' కొడతారా!

- ఆరో టైటిల్‌పై కన్నేసిన భారత్
- తొలి పోరులో యూఎస్‌ఏతో ఢీ
- నేటినుంచే అండర్-19 వరల్డ్ కప్

బులవాయో: ఐసీసీ అండర్-19 పురుషుల వన్డే వరల్డ్ కప్ గురువారం ఇక్కడ ప్రారంభం కానుంది. తమ ప్రతిభా పాటవాలకు పరీక్షగా నిలిచే ఈ టోర్నీలో ఆరోసారి టైటిల్ గెలిచి రికార్డు సృష్టించాలని భారత జట్టు పట్టుదలగా ఉంది. ఈ క్రమంలో తొలిరోజు జరిగే గ్రూప్ 'ఏ' తొలి మ్యాచ్‌లో అమెరికా జట్టును యువ భారత్ ఢీకొననుంది. ఇప్పటిదాకా 16సార్లు టోర్నీ జరిగితే ఐదుసార్లు (2000, 2008, 2012, 2018, 2022) విజేతగా నిలవడం ద్వారా భారత్ తన ఆధిపత్యాన్ని చాటి చెప్పింది. చివరిగా 2024లో ఆస్ట్రేలియా చేతిలో ఓడి భారత్ రన్నరప్‌గా నిలిచింది. ఈసారి ఆయుష్ మాత్రే సారథ్యంలో భారత్ బరిలో దిగుతోంది. ఇక..14 ఏళ్ల బ్యాటింగ్ సంచలనం వైభవ్ సూర్యవంశీపై అందరి దృష్టి నిలిచింది. తొలి రోజు ఇతర మ్యాచ్‌ల్లో జింబాబ్వే-స్కాట్లాండ్, టాంజానియా-వెస్టిండీస్ తలపడనున్నాయి.

ఇదీ టోర్నీ ఫార్మాట్: 16 జట్లు 4 గ్రూపులుగా విడిపోయి పోటీపడుతున్నాయి. సింగిల్ రౌండ్ రాబిన్ లీగ్‌లో ప్రతి గ్రూపులో తొలి మూడు స్థానాల్లో నిలిచే జట్లు సూపర్ సిక్స్‌కు అర్హత సాధిస్తాయి. సూపర్ సిక్స్‌లో 12 జట్లను 2 గ్రూపులుగా విభజిస్తారు. ఈ గ్రూప్‌లో తొలి రెండు స్థానాలు పొందే జట్లు సెమీస్ చేరతాయి. ఫిబ్రవరి 6న ఫైనల్ జరుగుతుంది.



విరాట్.. నెం 1

వన్డే ర్యాంకింగ్స్

దుబాయ్: ఇటీవల సూపర్‌ఫామ్‌తో చెలరేగుతున్న టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్నాడు. బుధవారం ప్రకటించిన తాజా ర్యాంకింగ్స్ బ్యాటర్ల జాబితాలో ఓ స్థానం ఎగబాకిన కోహ్లీ 785 పాయింట్లతో నెంబర్‌వన్‌గా నిలిచాడు. 37 ఏళ్ల విరాట్ టాప్‌ర్యాంక్‌కు రావడం దాదాపు ఐదేళ్ల తర్వాత ఇదే తొలిసారి కావడం విశేషం. చివరిగా అతను 2021 జులైలో అగ్రస్థానం దక్కించుకున్నాడు. ఇప్పటిదాకా టాప్‌లో ఉన్న రోహిత్ శర్మ (775) ఏకంగా మూడో స్థానానికి పడిపోయాడు. ఇక, న్యూజిలాండ్ స్టార్ డారిల్ మిచెల్ (784) ఓ స్థానం మెరుగై రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. విరాట్, మిచెల్‌కు ఒక్క పాయింటే తేడా ఉండడం గమనార్హం. గిల్ 5వ, శ్రేయాస్ 10వ ర్యాంక్‌లను నిలబెట్టుకోగా.. కేఎల్ రాహుల్ ఒక స్థానం మెరుగై 11వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. బౌలర్ల జాబితాలో సిరాజ్ ఐదు స్థానాలు ఎగబాకి 15వ ర్యాంక్‌కు చేరుకోగా, కుల్‌దీప్ మూడో స్థానంలో కొనసాగుతున్నాడు.

ఢిల్లీ బోణీ

మూడో మ్యాచ్‌లోనూ యూపీకి నిరాశ



లిజెల్లీ లీ (67), షఫాలీ (36)

నవీ ముంబై: రెండు జట్లు తొలి రెండు మ్యాచ్‌ల్లో ఓడాయి. దాంతో ఈ మ్యాచ్ ఇరు జట్లకు కీలకమైంది. ఎలాగైనా గెలవాలనే పట్టుదలతో బరిలో దిగాయి. దాంతో చివరి బంతి వరకు ఉత్కంఠ రేపిన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) మ్యాచ్‌లో చివరకు యూపీ వారియర్స్‌పై 7 వికెట్లతో ఢిల్లీ క్యాపిటల్స్ గెలిచింది. పాయింట్ల ఖాతా తెరిచింది. బుధవారం జరిగిన మ్యాచ్‌లో తొలుత యూపీ 20 ఓవర్లలో 154/8 స్కోరు చేసింది. మెగ్‌లానింగ్ (54) హాఫ్ సెంచరీ చేయగా, హర్లీన్ డియోల్ (36 బంతుల్లో 7 ఫోర్లతో 47) రిటైర్డ్ అవుట్‌గా వెనుదిరిగింది. లిచ్‌ఫీల్డ్ (27) మోస్తరుగా ఆడింది. షఫాలీ, కాప్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం ఢిల్లీ 20 ఓవర్లలో 158/3 స్కోరుతో గెలిచి ఊపిరి పీల్చుకుంది. లిజెల్లీ లీ (67), షఫాలీ (36), వోల్వార్ట్ (25 నాటౌట్) రాణించారు. దీప్తీశర్మ 2 వికెట్లు తీసింది.

హర్లీన్ అసంతృప్తి: స్కోరులో వేగం పెంచేందుకు 17వ ఓవర్ పూర్తి కాగానే యూపీ కోచ్ అభిషేక్ నాయర్.. హర్లీన్‌ను రిటైర్డ్ అవుట్‌గా రావాలంటూ డగౌట్ నుంచి సంజ్ఞ చేశాడు. అప్పటికి బాగానే ఆడుతున్న హర్లీన్ ఫిఫ్టీకి 3 పరుగుల దూరంలో ఉంది. ఈ దశలో కోచ్ తనను రిటైర్డ్ అవుట్‌గా రావాలని కోరడంతో హర్లీన్ అసంతృప్తి ప్రకటిస్తూ వెనుదిరిగింది. ఆ తర్వాత చివరి 18 బంతుల్లో జట్టు 4 వికెట్లు కోల్పోయి 13 రన్సే చేసింది.

డబ్ల్యూపీఎల్ షెడ్యూల్

నేడు	ముంబై X యూపీ (రా. 7.30)
రేపు	గుజరాత్ X బెంగళూరు (రా. 7.30)

సంక్షిప్తస్కోర్లు

యూపీ: 20 ఓవర్లలో 154/8 (లానింగ్ 54, హర్లీన్ రిటైర్డ్ హర్ట్ 47, లిచ్‌ఫీల్డ్ 27, షఫాలీ 2/16, కాప్ 2/24).

ఢిల్లీ: 20 ఓవర్లలో 158/3 (లిజెల్లీ లీ 67, షఫాలీ 36, వోల్వార్ట్ 25 నాటౌట్, జెమీమా 21, దీప్తీశర్మ 2/26).



ఇండియా ఓపెన్

సింధు అవుట్

● శ్రీకాంత్, ప్రణయ్ ముందంజ

న్యూఢిల్లీ: సొంతగడ్డపై టైటిల్‌తో సత్తా చాటుతుందనుకున్న రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీలో అనూహ్యంగా ఆరంభంలోనే వెనుదిరిగింది. బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో సింధు 22-20, 12-21, 15-21తో వియత్నాం షట్లర్ తుయ్ లిన్ గుయెన్ చేతిలో ఓటమిపాలైంది. మరో భారత అమ్మాయి మాళవిక 21-18, 21-19తో పాయ్ యు పొపై నెగ్గగా, తన్వి 20-22, 21-18, 13-21తో వరల్డ్ నెం.2 వాంగ్ జి చేతిలో ఓటమిపాలైంది. పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ 15-21, 21-6, 21-19తో సహచర షట్లర్ తరుణ్‌పై, ప్రణయ్ 22-20, 21-18తో లీ చుక్ యుపై గెలిచారు. డబుల్స్‌లో ప్రత్యర్థి జంట వాకోవర్ ఇవ్వడంతో స్టార్ జోడీ సాత్విక్/చిరాగ్ నేరుగా రెండోరౌండ్ చేరింది.

వైదొలగిన ఆంటోన్సెన్: ఢిల్లీలో విపరీత వాయు కాలుష్యం కారణంగా డెన్మార్క్‌కు చెందిన ప్రపంచ మూడో ర్యాంకర్ ఆండెర్స్ ఆంటోన్సెన్ ఇండియా ఓపెన్ నుంచి వైదొలిగాడు. డెన్మార్క్‌కే చెందిన మహిళా షట్లర్ మియా బ్లిచ్‌ఫీల్డ్ ఇప్పటికే టోర్నీ ఏర్పాట్లపై అసంతృప్తి వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.



www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సంక్రాంతి శుభాకాంక్షలు





ఇరాన్‌లో రోడ్డుపై మంటలేసి నిరసన తెలుపుతున్న ఆందోళనకారులు

ఇరాన్‌ను వెంటనే వీడండి

వెనక్కి వచ్చేయాలని తమ పౌరులకు భారత్ సహా పలు దేశాల హెచ్చరికలు

ఉద్రిక్తతల నివారణకు రంగంలోకి ఖతార్.. ఇరాన్‌తో చర్చలు

2

'లిన్'తో మద్యం అక్రమాలకు చెక్

ప్రతి మద్యం సీసాకు ఓ గుర్తింపు నంబరు



స్టేట్‌కు, బ్రాండ్‌కు ప్రత్యేక కోడ్

20కు పైగా అంకెలతో లిన్

సీసా లేబుల్‌పైనే నంబరు ముద్రణ

అది చించేస్తే బ్రాండ్ పేరూ పోతుంది

బెల్టులు, నకిలీ అడ్డుకట్టకు

ఎక్సైజ్ గట్టి చర్యలు

12



బుధవారం ఉదయం బెజవాడలో కమ్మేసిన పొగమంచు

పెరిగిన చలి

మంచులో వాహనాల రాకపోకలకు అంతరాయం

తిరుపతిలో పలు విమానాలు ఆలస్యం

8



పాఠకులు, ప్రకటనకర్తలు, ఏజెంట్లు, శ్రేయోభిలాషులకు 'ఆంధ్రజ్యోతి' సంక్రాంతి శుభాకాంక్షలు

సెలవు

సంక్రాంతి సందర్భంగా గురువారం మా కార్యాలయాలకు సెలవు. కావున 'ఆంధ్రజ్యోతి' శుక్రవారం (16-1-2026) సంచిక వెలువడదు. పునర్దర్శనం శనివారం. - మేనేజింగ్ డైరెక్టర్



ఏలూరు జిల్లా మీర్జాపురంలో ఫ్లడ్‌లైట్ల వెలుగులో భారీ బరి.. పెద్ద సంఖ్యలో పందేలకు తరలివచ్చిన జనం

కో..అంటే కోట్లు



బెజవాడలో హోరాహోరీ తలపడుతున్న పుంజులు

తొలిరోజే రూ.300 కోట్లకుపైగా పందేలు

హైటెక్ బరులు.. పందెంరాయుళ్ల కోలాహలం

యథేచ్ఛగా పేకాట, గుండాట, మూడు ముక్కలాట

ఎటు చూసినా జిగేల్.. కార్పొరేట్ లుక్కు

సంక్రాంతి తొలిరోజున జూదక్రీడల జాతర

నూజివీడులో కారవాన్‌లో క్యాసినో క్రీడలు

పెద అమిరంలో రూ.కోటితో ముసుగు పందెం

కాకినాడలో 'తెలంగాణ' సందడి.. 80 కోట్ల పందేలు

ఇన్నోవా కారు, బుల్లెట్ బహుమతులతో జోష్

బుల్లెట్ గెలుచుకున్న బాపట్ల ఎమ్మెల్యే నరేంద్రవర్మ

13

ఉద్యోగులకు పండగొచ్చె..

ఉద్యోగులు, పోలీసుల ఖాతాల్లో పెండింగ్ డీఏ, డీఆర్ ఎరియర్లు

ఒక్కొక్కరికి రూ.70 వేల నుంచి 80 వేల లబ్ధి

5.70 లక్షల మంది ఖాతాల్లో నిధులు జమ చేసిన ఆర్థిక శాఖ



అమరావతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ వేళ ఉద్యోగుల కుటుంబాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఆనందాన్ని నింపింది. ఉద్యోగులు, పోలీసులకు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డీఏ, డీఆర్ ఎరియర్లు, సరెండర్ లీవుల మొత్తం వారి ఖాతాల్లో జమ అవుతున్నాయి. అదే విధంగా కాంట్రాక్టర్లకు పెండింగులో ఉన్న బిల్లుల మొత్తాన్ని కూడా జమ చేస్తున్నారు. భోగి పండగ రోజు ఈ మొత్తాలు జమ అవుతుండటంతో ఉద్యోగులు, పోలీసులు,

మిగతా 12వ పేజీలో...




నితిన్ నబీన్‌కే బీజేపీ పగ్గాలు!

కొత్త అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొనే అవకాశం

అమిత్‌షా, రాజ్‌నాథ్ వంటి సీనియర్ల ప్రతిపాదన!

19న నామినేషన్లు.. 20న ఎన్నిక

2



వైద్య సేవల విస్తరణకు

పీపీపీయే మేలు!

రాష్ట్రానికి కేంద్రం సూచన.. ఆరోగ్య కార్యదర్శికి కేంద్ర సంయుక్త కార్యదర్శి లేఖ

మధ్య, చిన్నస్థాయి నగరాల్లో ఆరోగ్య సేవలు తక్కువ

పీపీపీ విధానంలో వీటిని విస్తరించాలి

27 పేజీలతో మార్గదర్శకాలు జారీ

14



సంక్రాంతి సంబరాల్లో భాగంగా వచ్చిన గంగిరెద్దు, కోడెలతో సీఎం చంద్రబాబు దంపతులు

12

నారావారిపల్లెకు

పండుగ కళ

స్వగ్రామంలో భోగి వేడుకల్లో సీఎం

అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్



3.25 లక్షల కోట్లతో రాఫెల్స్ కొనుగోలు



114 యుద్ధ విమానాల కోసం డీల్

భారత్‌లోనే తయారు చేసేలా ప్రణాళికలు

రక్షణ శాఖ పరిశీలనలో ప్రతిపాదిత ఒప్పందం

ఈ వారాంతంలో నిర్ణయం తీసుకునే అవకాశం

2

సున్నా మార్కులొచ్చినా నీట్ పీజీ సీటు!

» 18 వేల సీట్లు మిగిలిపోవడంతో కటాఫ్ తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 14: నీట్-2025 పీజీ వైద్య విద్యలో ప్రవేశాలకు అర్హత శాతాలను నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బీఈఎంఎస్) సవరించింది. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు 40శాతం నుంచి సున్నా శాతానికి, జనరల్ కేటగిరీకి 50శాతం నుంచి 7శాతానికి తగ్గించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. దేశ వ్యాప్తంగా 18వేలకు పైగా మెడికల్ పీజీ సీట్లు ఖాళీగా ఉండటంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. రెండు రౌండ్ల కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం ఎన్‌బీఈఎంఎస్ ఈ నిర్ణయం తీసుకుంది. దేశంలో శిక్షణ పొందిన వైద్య నిపుణుల సంఖ్యను భారీగా పెంచడంతో పాటు అందుబాటులో ఉన్న సీట్లను గరిష్ఠంగా ఉపయోగించుకొనే లక్ష్యంతోనే ఈ సవరణ చేపట్టినట్లు అధికారులు వెల్లడించారు.

కదులుతున్న రైలుపై కూలిన క్రేన్..31మంది మృతి

» థాయ్‌లాండ్‌లో ఘోర ప్రమాదం

బ్యాంకాక్, జనవరి 14: థాయ్‌లాండ్‌లో ఘోర రైలు ప్రమాదం చోటుచేసుకుంది. రైల్వే వంతెన నిర్మాణంలో ఉపయోగిస్తున్న భారీ క్రేన్.. అటుగా వెళ్తున్న ప్యాసింజర్ ట్రైన్‌పై కుప్పకూలడంతో 31మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 64మంది తీవ్రంగా గాయపడ్డారు. చైనాను దక్షిణాసియాలోని ప్రధాన దేశాలతో అనుసంధానించే ప్రతిష్ఠాత్మక హైస్పీడ్ రైల్వే ప్రాజెక్టు జరుగుతున్న ప్రాంతంలో బుధవారం ఉదయం ఈ ప్రమాదం జరిగింది. రైల్వే నిర్మాణ పనుల్లో భాగంగా ఉన్న ఓ భారీ క్రేన్.. బ్యాంకాక్ నుంచి ఉబోన్ రాచథాని ప్రావిన్సుకు వెళ్తున్న రైలుపై అకస్మాత్తుగా కుప్పకూలింది. ప్రమాద సమయంలో రైలులో 195 మంది ఉన్నారు.

ఉత్తరాదిలో అమ్మాయిలను వంటగదికే పరిమితం చేస్తున్నారు: దయానిధి

చెన్నై, జనవరి 14(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో అమ్మాయిల్ని చదువుకోవాలని చెబుతుండగా, ఉత్తరాదిలో మాత్రం వారిని వంటగదికి పరిమితమై, పిల్లల్ని కంటే చాలని చెబుతున్నారని డీఎంకే సీనియర్ నేత, లోక్‌సభ సభ్యుడు దయానిధి మారన్ వ్యాఖ్యానించారు. బుధవారం చెన్నైలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి నేతృత్వంలో జరిగిన ఓ కార్యక్రమంలో దయానిధి మాట్లాడుతూ.. 'తమిళనాడులో మేం యువతులను చదుకోవాలని చెబుతున్నాం. కానీ, ఉత్తర భారతంలో ఏం చెబుతున్నారు? అమ్మాయిలు ఉద్యోగాలకు వెళ్లరాదు. ఇంట్లోనే ఉండాలి. వంటగదిలో ఉండాలి. పిల్లల్ని కనాలి. ఇదే మీ పని అని చెబుతున్నారు. ఇది తమిళనాడు, ఇది ద్రావిడనాడు. డీఎంకే వ్యవస్థాపకులు అన్నాదురై, డీఎంకే పితామహుడు కరుణానిధి, సీఎం స్టాలిన్‌ల గడ్డ. ఇక్కడ మీ(మహిళల) ప్రగతే తమిళనాడు ప్రగతి' అన్నారు.

శబరిమలలో మకర జ్యోతి దర్శనం

శబరిమల(కేరళ), జనవరి 14: శబరిమలలో బుధవారం సాయంత్రం మకర జ్యోతి దర్శనమిచ్చింది. మకర జ్యోతిని తిలకించేందుకు వేలాది మంది భక్తులు తరలిరాగా.. అయ్యప్ప నామస్మరణతో శబరిగిరులు మార్మోగాయి. అయ్యప్ప స్వామి సంక్రాంతి పండుగ రోజున శబరిమలలోని పంచగిరులపై మకర జ్యోతి రూపంలో దర్శనమిస్తారని భక్తుల విశ్వాసం. అయితే, ఈసారి బుధవారం మధ్యాహ్నం 3.13 గంటల నుంచి మకర సంక్రాంతి కాలం ప్రారంభమైంది.

బంగ్లాదేశ్‌లో సంక్రాంతి వేడుకలపై ఉక్కుపాదం

ఢాకా, జనవరి 14: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో సంక్రాంతి వేడుకలపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వేడుకలు నిర్వహించుకుంటున్న ఇళ్లకు వెళ్లి సౌండ్ బాక్సులను, టపాసులను స్వాధీనం చేసుకుంటున్నారు. టపాసులతో అగ్నిప్రమాదాలు జరిగే ప్రమాదం ఉందని, సౌండ్ బాక్సులతో శబ్దకాలుష్యం జరుగుతోందని సాకులు చెప్తున్నారు. వాస్తవానికి బంగ్లాదేశ్‌లో సంక్రాంతి(సంక్రేన్ అని పిలుస్తారు) పండుగకు మతభేదం లేదు. అందరూ పతంగులు ఎగురవేస్తారు. ఇది బెంగాలీ సంప్రదాయమని, మొగలుల కాలం నుంచి కొనసాగుతోందని స్థానికులు చెప్తున్నారు. అయితే, ఏడాదికాలంగా బంగ్లాదేశ్‌లో కొనసాగుతున్న అస్థిరమైన పరిణామాలు, హిందువులపై పెరుగుతున్న ద్వేషం నేపథ్యంలో ముస్లింవాదులు ఈ పండుగను తప్పుపడుతున్నారు. తమకు ఇబ్బందిగా ఉందని పోలీసులకు ఫిర్యాదులు చేస్తున్నారు.

75 దేశాలకు వీసా ప్రక్రియను నిలిపివేసిన అమెరికా

న్యూఢిల్లీ, జనవరి 14: అమెరికాలోకి వలసలను నియంత్రించేందుకు ట్రంప్ సర్కారు కఠిన నిర్ణయాలు తీసుకుంటోంది. 75 దేశాల పౌరులకు వీసా జారీ ప్రక్రియను నిరవధికంగా నిలిపివేస్తున్నట్లు అమెరికా మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ జాబితాలో సోమాలియా, రష్యా, అఫ్ఘానిస్థాన్, ఇరాన్, ఇరాక్, ఈజిప్ట్, నైజీరియా, థాయ్‌లాండ్, యెమెన్, బ్రెజిల్ వంటి దేశాలు ఉన్నాయి. ఈ నెల 21 నుంచి ఆయా దేశాల పౌరులకు వీసాల జారీ ప్రక్రియను తాత్కాలికంగా నిలిపివేసి, వీసా స్క్రీనింగ్, వెట్టింగ్ విధానాలపై సమగ్ర పునఃసమీక్ష చేయనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆధారపడే అవకాశం ఉన్న వారిని దేశంలోకి అనుమతించకూడదనే ఉద్దేశంతోనే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నాయి. కాగా ఈ నిలిపివేతలకు సంబంధించి అధికారిక ఉత్తర్వులు ఇంకా జారీ కాలేదు.

కేంద్ర ఉద్యోగులకు సమగ్ర వేతన ప్యాకేజీ ఖాతా!

» బ్యాంకింగ్, బీమా, కార్డుల సేవలన్నీ ఈ అకౌంట్‌తోనే..

న్యూఢిల్లీ, జనవరి 14: కేంద్ర ప్రభుత్వం తన ఉద్యోగులకు సమగ్ర వేతన ప్యాకేజీ ఖాతాను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆర్థిక సేవల విభాగం బుధవారం ఈ ప్రత్యేక ఖాతాను ప్రారంభించింది. దీనివల్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఒకే ఖాతా ద్వారా బ్యాంకింగ్, బీమా, కార్డుల సేవలు సమగ్రంగా అందుతాయని తెలిపింది. ఈ ప్యాకేజీ ద్వారా కేంద్ర ఉద్యోగులకు ఆర్థిక, సామాజిక భద్రత మెరుగుపడుతుందని ఆర్థిక సేవల శాఖ కార్యదర్శి ఎం.నాగరాజు తెలిపారు. అన్ని క్యాడర్ల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు గరిష్ఠ కవరేజీ, ఏకరూపత, విస్తృత సౌకర్యాలు కల్పించేందుకు గాను బ్యాంకులతో సంప్రదింపులు జరిపి చాలా జాగ్రత్తగా ప్యాకేజీలను రూపొందించినట్లు వెల్లడించారు. రూ.1.50 కోట్ల వరకు వ్యక్తిగత ప్రమాద బీమా, రూ.2 కోట్ల దాకా గగనతల ప్రమాద బీమా, మెరుగుపరిచిన సౌకర్యాలతో కూడిన జీరో బ్యాలెన్స్ వేతన ఖాతా, గృహ, విద్య, వాహన, వ్యక్తిగత రుణాలకు తక్కువ వడ్డీ, కార్డులకు సంబంధించి ఎయిర్‌పోర్ట్ లాంజ్ యాక్సెస్, రివార్డ్ ప్రోగ్రామ్‌లు, క్యాష్‌బ్యాక్ ఆఫర్లు, అపరిమిత లావాదేవీలు, నిర్వహణ చార్జీలు లేకపోవడం వంటి సౌకర్యాలు ఉంటాయని వివరించారు. ఆయా సదుపాయాలపై ప్రభుత్వరంగ బ్యాంకులు విస్తృతంగా ప్రచారం చేయాలని, ఉద్యోగులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఉద్యోగుల అనుమతితో ప్రస్తుత ఖాతాల నుంచి కొత్త ప్యాకేజీకి మారేందుకు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

సీజీహెచ్‌ఎస్ లబ్ధిదారులకు 'పరిపూర్ణ మెడిక్లెయిమ్ ఆయుష్ బీమా'

న్యూఢిల్లీ, జనవరి 14 : కేంద్ర ప్రభుత్వ ఆరోగ్య పథకం(సీజీహెచ్‌ఎస్) లబ్ధిదారుల కోసం 'పరిపూర్ణ మెడిక్లెయిమ్ ఆయుష్ బీమా'ను కేంద్ర ఆర్థిక శాఖ బుధవారం ప్రారంభించింది. టాప్ అప్ స్కీమ్‌గా అందుబాటులోకి తెచ్చిన ఈ బీమాను లబ్ధిదారులు తమ ఇష్టప్రకారం కొనుగోలు చేయవచ్చు. ఈ బీమా పథకం కింద దేశ వ్యాప్తంగా ఇన్‌పేషంట్ ఆస్పత్రి చికిత్సలకు రూ.10 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు బీమా కవరేజి ఉంటుంది. ఈ పాలసీలో కో-పేమెంట్ విధానం కూడా అందుబాటులో ఉంది. అంటే, బీమా కంపెనీ, లబ్ధిదారు 70:30 లేదా 50:50 శాతం ప్రీమియం వాటాతో పాలసీ తీసుకోవచ్చు. 70:30 వాటాతో పాలసీ తీసుకునే లబ్ధిదారులకు ప్రీమియం సొమ్ములో 28 శాతం, 50 :50 వాటాతో కొనుగోలు చేసే వారికి 42 శాతం రాయితీ లభిస్తుంది. అంతేకాక, క్లెయిమ్‌లు లేకుంటే బీమా మొత్తంపై ఏడాదికి 10 శాతం బోనస్‌గా దక్కుతుంది. ఆస్పత్రిలో చేరడానికి 30 రోజులు ముందు, డిశ్చార్జి తర్వాత 60 రోజులు దాకా కవరేజీ లభిస్తుంది. సీజీహెచ్‌ఎస్ లబ్ధిదారులు న్యూ ఇండియా ఎస్యూరెన్స్ సంస్థ ద్వారా ఈ బీమా పాలసీని కొనుగోలు చేయవచ్చు.

ఇరాన్‌ను వెంటనే వీడండి

వెనక్కి వచ్చేయాలని తమ పౌరులకు భారత్ సహా పలు దేశాల హెచ్చరికలు

» ఉద్రిక్తతల నివారణకు రంగంలోకి ఖతార్.. ఇరాన్‌తో చర్చలు



ఇరాన్‌లో ఖమేనీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు

న్యూఢిల్లీ/దోహా, జనవరి 14: ఇరాన్‌లో ఆందోళనలు ఉధృతమవడం, అమెరికా దాడి చేసే అవకాశం ఉందనే ప్రచారం నేపథ్యంలో.. వెంటనే వెనక్కి వచ్చేయాలని భారత్ సహా పలుదేశాలు ఇరాన్‌లోని తమ పౌరులను హెచ్చరించాయి. "ప్రస్తుతం ఇరాన్‌లో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో అక్కడున్న భారత విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తలు, భారత సంతతి అప్రమత్తంగా ఉండాలి. నిరసనలు, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల నుంచి దూరంగా ఉండాలి. స్థానిక పరిస్థితులను మీడియా ద్వారా గమనిస్తూ ఉండాలి. అందుబాటులో ఉన్న ఏదో ఒక ప్రయాణ మార్గంలో వెంటనే ఇరాన్‌ను వీడాలి. భారత దౌత్యకార్యాలయంతో టచ్‌లో ఉండాలి" అని ఇరాన్‌లోని భారత ఎంబసీ సూచించింది. ఇక భారతీయులెవరూ కూడా ప్రస్తుతం ఇరాన్‌కు వెళ్లకపోవడం మంచిదని భారత విదేశాంగ శాఖ కూడా స్పష్టం చేసింది. మరోవైపు కెనడా, ఆస్ట్రేలియా సహా మరికొన్ని దేశాలు కూడా తమ పౌరులు వెంటనే ఇరాన్‌ను వీడాలని, కొత్తగా ఎవరూ వెళ్లకూడదని హెచ్చరికలు జారీ చేశాయి. మరోవైపు తమ పౌరులు, విద్యార్థులు సరిహద్దుల ద్వారా స్వదేశంలోకి తిరిగి వస్తున్నారని పాకిస్థాన్ ప్రకటించింది.

కాస్తంత మానవత్వం చూపండి: ట్రంప్

ఇరాన్‌లో పరిస్థితులపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం జాతీయ భద్రతా బృందంతో సమీక్షించారు. ఆందోళనకారుల పట్ల ఇరాన్ దారుణంగా వ్యవహరిస్తోందని ఈ సందర్భంగా ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ప్రభుత్వం సొంత పౌరులపై కాస్తంతైనా మానవత్వం చూపాలన్నారు. కాగా, ఇరాన్‌లో దాడులు చేసేందుకు 50 కీలక మిలిటరీ, రక్షణ స్థావరాలను అమెరికాకు చెందిన 'యునైటెడ్ ఎగైనెస్ట్ న్యూక్లియర్ ఇరాన్' గ్రూపు గుర్తించినట్లు డైలీ మెయిల్ వెబ్‌సైట్ తెలిపింది. ట్రంప్ సమీక్షకు ముందే ఆ జాబితాను, వివరాలను వైట్‌హౌజ్‌కు పంపిందని పేర్కొంది. మరోవైపు ఇరాన్‌లో మృతుల సంఖ్య 2,571కిపైగానే ఉందని అమెరికాకు చెందిన హ్యూమన్ రైట్స్ యాక్టివిస్ట్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది. అందులో 2,403 మంది ఆందోళనకారులేనని, 147 మంది భద్రతా దళాల సిబ్బంది అని పేర్కొంది. ఆందోళనలతో సంబంధంలేని పౌరులు, పిల్లలు మరో 21 మంది మరణించినట్లు తెలిపింది. ప్రభుత్వం 18వేల మంది ఆందోళనకారులను అరెస్టు చేసిందని పేర్కొంది.

ఇరాన్‌తో ఖతార్ చర్చలు!

ఇరాన్‌లో ఆందోళనలు, సైనిక చర్యకు సిద్ధమని అమెరికా ప్రకటించడం నేపథ్యంలో మరోసారి మధ్యవర్తిత్వానికి ఖతార్ సిద్ధమైంది. గత ఏడాది జూన్‌లో ఇరాన్, ఇజ్రాయెల్ పరస్పర దాడులకు దిగినప్పుడు.. ఖతార్ మధ్యవర్తిత్వం, అమెరికా జోక్యంతోనే కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. తాజాగా ఇరాన్‌లో పరిణామాలు ఉద్రిక్తతలు రేపుతుండటంతో.. ఆ దేశ అధికారులతో ఖతార్ చర్చలు మొదలుపెట్టింది. ఇరాన్ అత్యున్నత భద్రతా మండలి కార్యదర్శి అలీ లారిజని, ఖతార్ ప్రధాని షేక్ మహమ్మద్ బిన్ అల్ థానీ ఫోన్‌లో చర్చలు జరిపారు. మరోవైపు అమెరికా, ఇరాన్ ఇరు దేశాలూ తమ మధ్య దౌత్య సంబంధాలను పూర్తిగా తెంచుకుంటున్నట్టు బుధవారం ప్రకటించాయి.

మస్క్ 'స్టార్ లింక్' ఇంటర్నెట్ ఒక్కటే దిక్కు!

ఇరాన్‌లో ప్రభుత్వం ఇంటర్నెట్, మొబైల్ సర్వీసులను పూర్తిగా నిలిపివేయడంతో.. అక్కడి ప్రజలకు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఇరాన్‌లో ఏం జరుగుతోందన్నది తెలియకుండా పోయింది. ఈ క్రమంలో ఆందోళనకారులు రహస్యంగా ఇరాన్‌లోకి తీసుకెళ్లిన ఎలాన్ మస్క్ శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ 'స్టార్ లింక్' కిట్లు కీలకంగా మారాయి. వాటి సాయంతోనే కొంతవరకు సమాచారం, వీడియోలు బయటికి వస్తున్నాయి. ఇరాన్‌లోని స్టార్‌లింక్ కిట్లకు ఆ సంస్థ ఉచితంగా సర్వీసు అందిస్తోందని అమెరికాలోని యాక్టివిస్టు మెహ్దీ యహ్యానెజాద్ బుధవారం వెల్లడించారు. మరోవైపు స్టార్ లింక్ కిట్లను గుర్తించి, స్వాధీనం చేసుకోవడంపై ఇరాన్ ప్రభుత్వం దృష్టిపెట్టింది. మంగళవారమే కొన్ని కిట్లను పట్టుకుంది.

అమెరికా దాడి చేస్తే ఎదుర్కొనేందుకు ఇరాన్ ఏర్పాట్లు

తమపై అమెరికా దాడి చేస్తే ఎదుర్కొనేందుకు ఇరాన్ ఏర్పాట్లు చేసుకుంటోంది. ఇరాన్ భద్రతా దళం 'ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్' పూర్తి సంసిద్ధతతో ఉన్నట్టు మంగళవారమే ప్రకటించింది. జూన్‌లో ఇజ్రాయెల్‌తో జరిగిన యుద్ధం అనంతరం భారీ స్థాయిలో క్షిపణులను సిద్ధం చేసుకున్నామని వైమానిక దళం కమాండర్ మాజిద్ మౌసావి పేర్కొన్నట్టు రాయిటర్స్ వార్తాసంస్థ బుధవారం వెల్లడించింది. మరోవైపు తమపై దాడి చేస్తే.. సమీపంలోని సౌదీ అరేబియా, యూఏఈ, టర్కీ, ఖతార్‌లలో ఉన్న అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులకు దిగుతామని ఇరాన్ రక్షణశాఖ ఉన్నతాధికారి ఒకరు పేర్కొన్నారు. అమెరికా తమపై దాడికి దిగకుండా అడ్డుకునేలా ఆయా దేశాలపై ఇరాన్ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్నట్టు వెల్లడించారు.



114 రాఫెల్స్ కోసం 3.25 లక్షల కోట్ల భారీ డీల్

» భారత్‌లోనే తయారు చేసేలా ప్రణాళికలు

» రక్షణ శాఖ పరిశీలనలో ప్రతిపాదిత డీల్

న్యూఢిల్లీ, జనవరి 14: దేశ రక్షణ రంగంలోనే భారీ రాఫెల్ డీల్‌కు రంగం సిద్ధమవుతోంది. భారత వైమానిక దళం (ఐఏఎఫ్) కోసం ఫ్రాన్స్ నుంచి 114 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు నిమిత్తం ప్రతిపాదిత రూ.3.25 లక్షల కోట్ల ఒప్పందాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ పరిశీలించనుంది. ఈ వారాంతంలో జరిగే ఉన్నత స్థాయి సమావేశంలో దీనిపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఫ్రాన్స్‌తో ఒప్పందంలో భాగంగా ప్రారంభ దశలో 30 శాతం స్వదేశీ భాగాలతో ఈ విమానాలను భారత్‌లోనే తయారు చేసేలా ప్రణాళికలు రూపొందించారు. ముందుగా డెలివరీకి సిద్ధంగా ఉన్న 12 నుంచి 18 రాఫెల్ యుద్ధ విమానాలను కొనుగోలు చేయడం ఈ ఒప్పందంలో భాగమని రక్షణ శాఖకు చెందిన అగ్రశ్రేణి వర్గాలు తెలిపాయి. మిగిలిన విమానాలను భారత్‌లోనే తయారు చేయనున్నారు. కాగా, రాఫెల్ ప్లాట్‌ఫామ్స్‌పై స్వదేశీ ఆయుధాలు, దేశీయంగా అభివృద్ధి చేసిన ఇతర వ్యవస్థలను ఏర్పాటు చేయడానికి ఫ్రాన్స్ ఆమోదాన్ని కూడా భారత్ కోరనుంది. అయితే.. యుద్ధ విమానాల్లో కీలకమైన మిషన్ వ్యవస్థల సోర్స్ కోడ్‌లు మాత్రం ఫ్రాన్స్ వద్దే ఉంటాయి. ఈ ఒప్పందం ఆమోదం పొందితే రాఫెల్ డీల్ భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద రక్షణ కాంట్రాక్టుగా నిలవనుంది. అలాగే ఈ 114 ఫైటర్ జెట్ల చేరికతో భారత్ వద్దనున్న రాఫెల్స్ సంఖ్య 176కు పెరగనుంది. ఐఏఎఫ్ ఇప్పటికే 36 రాఫెల్ జెట్లను నడుపుతుండగా, భారత నావికా దళం గతేడాది ఐఎన్‌ఎస్ విక్రాంత్‌పై మోహరించడానికి 26 జెట్ల కోసం ఆర్డర్ చేసింది. తమకు 114 రాఫెల్ జెట్లు కావాలని వైమానిక దళం కొన్ని నెలల క్రితం రక్షణ శాఖకు ప్రతిపాదనలు పంపింది.

ఇరాన్‌లో రెజాపహ్లవి నామస్మరణ



రెజాపహ్లావికి మద్దతుగా ప్లకార్డుతో నిరసన ప్రదర్శన

టెహ్రాన్, జనవరి 14: ఇరాన్‌లో ఇస్లామిక్ మతపెద్ద పాలనకు వ్యతిరేకంగా సాగుతున్న తీవ్రమైన ప్రజా తిరుగుబాటులో మాజీ యువరాజు రెజాపహ్లవి కేంద్ర బిందువుగా మారుతున్నారు. 17 ఏళ్ల వయసులో అమెరికా వెళ్లి, అప్పటి నుంచి అక్కడే ఉంటున్న 65 ఏళ్ల రెజాపహ్లవి.. సొంత దేశంలో ప్రజా తిరుగుబాటును మరింత ఎగదోస్తున్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను కూలదోస్తే.. దేశానికి ప్రత్యామ్నాయ రాజకీయ దిశను చూపేందుకు సిద్ధమని ప్రకటించారు. విప్లవకారుల్లో కూడా ఆయనకు మద్దతు పెరుగుతోంది. రెజాపహ్లవి 1960 అక్టోబర్ 31న టెహ్రాన్‌లో జన్మించారు. ఏడేళ్ల వయసులో ఆయనను యువరాజుగా ప్రకటించారు. 17 ఏళ్ల వయసులో ఫైటర్ పైలట్ శిక్షణ కోసం ఆయన అమెరికా వెళ్లారు. టెక్సాస్‌లోని రీస్ ఎయిర్‌ఫోర్స్ బేస్‌లో శిక్షణ తీసుకుంటున్న సమయంలోనే ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం వచ్చి ఆయన తండ్రి, ఇరాన్ రాజు మొహమ్మద్ రెజాపహ్లవి పదవీచ్యుతై దేశం వీడాల్సి వచ్చింది. దీంతో రెజాపహ్లవి తిరిగి స్వదేశం రాలేకపోయారు. అయితే, ఇప్పుడు ఖమేనీ పాలనను వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష వర్గం రెజాపహ్లవి తిరిగి స్వదేశం రావాలని చాలాకాలంగా కోరుతోంది. ఆయన కూడా అందుకు సుముఖత వ్యక్తం చేశారు. గత 12 నెలల్లో ఆయన పొలిటికో వార్తా సంస్థకు ఇచ్చిన మూడు ఇంటర్వ్యూల్లో ఖమేనీ పాలనను ఎలా కూలదోయవచ్చో వివరించారు. తాజా ప్రజా తిరుగుబాటుకు ఆ ఇంటర్వ్యూలు కూడా కొంత కారణమని విశ్లేషకులు చెబుతున్నారు.

నితిన్ నబీన్‌కే బీజేపీ పగ్గాలు!

» కొత్త జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకొనే అవకాశం

» అమిత్‌షా, రాజ్‌నాథ్ వంటి సీనియర్ల ప్రతిపాదన!

» 19న నామినేషన్లు.. 20న ఎన్నిక



హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): భారతీయ జనతాపార్టీ (బీజేపీ) కొత్త జాతీయ అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియ ఊపందుకుంది. ఈ నెల 19వ తేదీన ఈ ఎన్నిక కోసం నామినేషన్ల ప్రక్రియ, 20న ఎన్నిక నిర్వహించనున్నారు. ఇటీవల పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన నితిన్ నబీన్‌నే కొత్త అధ్యక్షుడి గా ఎన్నుకోవటం దాదాపు ఖాయమైందని అంటున్నారు. బీజేపీ సంస్థాగత నియమావళి ప్రకారం అధ్యక్షుడిగా పార్టీ నేతలు ఎవరైనా పోటీ చేయవచ్చు. అయితే, అధ్యక్ష పదవికి నామినేషన్ వేయాలంటే కనీసం ఐదు రాష్ట్రాల నుంచి మద్దతు ప్రతిపాదనలు అందాలి. ఒక్కో రాష్ట్రం నుంచి కనీసం 20 మంది ఫలానా నాయకుడిని జాతీయ అధ్యక్షుడిగా ప్రతిపాదిస్తున్నామని పత్రాలు సమర్పించాలి. ఆ 20 మంది కూడా పార్టీలో కనీసం 15 ఏళ్ల నుంచి ఉంటున్నవారై ఉండాలి. కాగా, నితిన్ నబీన్‌కు మద్దతుగా కేంద్రమంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ వంటి సీనియర్లు పత్రాలు సమర్పించనున్నట్లు తెలిసింది. నితిన్‌ను జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. 20వ తేదీన బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యులు, ముఖ్య నేతల సమక్షంలో ప్రధాని నరేంద్రమోదీ కొత్త అధ్యక్షుడి పేరును ప్రకటించనున్నారని సమాచారం. బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలు, అన్ని రాష్ట్రాల బీజేపీ శాఖల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జాతీయ కార్యవర్గ సభ్యులు, సీనియర్ నేతలు దాదాపు 3,000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని పార్టీ వర్గాలు తెలిపాయి. వారికి ఇప్పటికే ఢిల్లీకి రావాలని పిలుపు అందింది.

రాజ్యసభకు పోటీ చేయను: దిగ్విజయ్

కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాజ్యసభలో తన ప్రస్తుత పదవీ కాలం ముగిసిన తర్వాత, మరోసారి ఎగువ సభకు వెళ్లే ఉద్దేశం తనకు లేదని ఆయన స్పష్టం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ సంస్థాగత బలంపై ఆయన చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపిన కొన్ని వారాలకే ఈ ప్రకటన రావడం గమనార్హం.

'ఐ ప్యాక్' పంచాయితీ సుప్రీంకు..

» మమత, ఈడీ పిటిషన్లు కొట్టేసిన కలకత్తా హైకోర్టు

» నేటి నుంచి ఈడీ పిటిషన్‌పై అత్యున్నత న్యాయస్థానంలో విచారణ



కోల్‌కతా, జనవరి 14 : 'ఐ ప్యాక్' అధిపతి ఇంట తనిఖీల వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ), అధికార తృణమూల్ కాంగ్రెస్ పోటాపోటీగా దాఖలు చేసిన పిటిషన్లను కలకత్తా హైకోర్టు కొట్టివేసింది. దీంతో ఈ పంచాయితీ చివరకు సుప్రీంకోర్టుకు చేరింది. తనిఖీలు జరుపుతుండగానే, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ...ఐ ప్యాక్ అధిపతి ప్రతీక్ జైన్ ఇంటికి చేరుకుని, ల్యాప్‌టాప్, ఫోన్, పత్రాలను తన వెంట తీసుకెళ్లారని హైకోర్టుకు ఈడీ ఫిర్యాదు చేసింది. దీనిపై మమత తరపున ఆమె పార్టీ కౌంటరు పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్లపై బుధవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సువ్రా ఘోష్ నేతృత్వంలోని ఏకసభ్య బెంచ్ విచారణ జరిపింది. తమ పార్టీకి సంబంధించిన ఎన్నికల వ్యూహాలు, ఇతర ముఖ్యమైన సమాచారం ఉన్న పత్రాలను ఈడీ అధికారులు తీసుకెళ్లారని తృణమూల్ తరపు న్యాయవాది మేనకా గురుస్వామి ఆరోపించారు. ఈడీ బెదిరింపులకు గురిచేస్తోందని, దాడి పద్ధతిలో తనిఖీలు చేపడుతోందని విమర్శించారు. "మేం ఈడీ దర్యాప్తును అడ్డుకోవడం లేదు. సుప్రీంకోర్టులోని పిటిషన్‌తో మాకు సంబంధం లేదు. మా పార్టీకి సంబంధించిన పత్రాలను ఈడీ తనిఖీ చేసింది. ఆ పత్రాలు వేరేవారి చేతికి చేరకుండా చూడాలని, వాటిని తిరిగి మాకు అప్పగించాలని మాత్రమే అభ్యర్థిస్తున్నాం." అని గురుస్వామి వాదించారు. తమ పిటిషన్ సుప్రీంకోర్టు పరిశీలనలో ఉన్నందున విచారణను వాయిదా వేయాలని ఈడీ అభ్యర్థించింది. 'మేం ఎక్కడకూ పారిపోవడం లేదు. సుప్రీంకోర్టులో పిటిషన్ ఉన్నప్పుడు దిగువ కోర్టులు విచారణ జరపరాదనే న్యాయ సూత్రాన్ని పరిగణించండి. విచారణను ఒక వారం వాయిదా వేస్తే వచ్చిన నష్టం ఏమీ ఉండదు" అని వివరించింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి, ఇరువురి పిటిషన్లను కొట్టివేస్తున్నట్టు ప్రకటించారు. ఇప్పటికే ఈడీ వేసిన పిటిషన్‌పై గురువారం నుంచి సుప్రీంకోర్టులో విచారణ ప్రారంభం కానుంది. తనిఖీల్లో పాల్గొన్న అధికారులపై బెంగాల్ పోలీసులు చొరబాటు, నేరపూరిత ఉద్దేశం తదితర సెక్షన్ల కింద దాఖలుచేసిన నాలుగు కేసులను కొట్టివేయాలని, బెంగాల్ సీఎం, డీజీపీలపై సీబీఐ విచారణకు ఆదేశించాలని తన పిటిషన్‌లో ఈడీ కోరింది.

'మెలియోయిడోసిస్'లో జన్యు మార్పులు!

» బ్యాక్టీరియాలోని జెనెటిక్ కోడ్ మారినట్లు గుర్తింపు

» జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల్లో బయటపడిన వైనం

» తురకపాలెం కేసుల్లో మాత్రమే జన్యు రూపాంతరం

» కీళ్ల నొప్పులు కలిగించే కొత్త లక్షణం బహిర్గతం



బర్కోల్డేరియా సూడోమలీ బ్యాక్టీరియా



తురకపాలెంలో రక్త నమూనాలు సేకరిస్తున్న ఆరోగ్య సిబ్బంది (ఫైల్)

గుంటూరు మెడికల్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇటీవల గుంటూరు నగర శివార్లలోని తురకపాలెంలో వెలుగుచూసిన మెలియోయిడోసిస్ జ్వరాలకు కారణమైన బర్కోల్డేరియా సూడోమలీ బ్యాక్టీరియాలో జన్యుమార్పులు (మ్యుటేషన్) చోటుచేసుకున్నాయని వైద్య పరిశోధనల్లో తేలింది. పలువురు రోగుల నుంచి సేకరించిన నమూనాలకు జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షలు నిర్వహించగా.. బ్యాక్టీరియాలోని జెనెటిక్ కోడ్ (జీటీసీ 254టీ 55920) మారినట్లు గుర్తించారు. రూపాంతరం చెందిన ఈ బ్యాక్టీరియా రోగుల్లో మోకాళ్లు, మడమ నొప్పులకు కారణమవుతుందని గుర్తించారు. సాధారణంగా ఈ బ్యాక్టీరియా బాధితుల ఊపిరితిత్తులపై దాడిచేయడం వల్ల విపరీతమైన దగ్గుతో పాటు నోటి వెంట రక్తం (హిమాప్టిసిస్) పడుతుంది. అయితే తురకపాలెం రోగుల్లో ఈ లక్షణాలు కనిపించలేదు. గతేడాది గుంటూరు నగర శివార్లలోని తురకపాలెంలో వెలుగుచూసిన మెలియోయిడోసిస్ జ్వరాలతో మూడు నెలల వ్యవధిలోనే గ్రామంలో 30 మంది మృతి చెందటం... అప్పట్లో తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ యంత్రాంగం మూడు వారాల పాటు తురకపాలెంలో తిష్టవేసి గ్రామస్తులకు అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. చివరకు దీని వెనుక ఉన్న గుట్టును కనుగొన్నారు.

మారిన జెనెటిక్ కోడ్... వ్యాధి లక్షణాలు

గుంటూరుకు చెందిన అంటువ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ కే కల్యాణ్ చక్రవర్తి.. తురకపాలెంలో నలుగురు రోగుల మోకాళ్ల నుంచి సేకరించిన సైనోవియల్ ఫ్లూయిడ్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపారు. అక్కడి నుంచి వచ్చిన ఫలితాలను అమెరికాకు చెందిన ఇఫ్లైటి అనే సంస్థ విశ్లేషించగా... సూడోమలీ బ్యాక్టీరియాలో మారిన కొత్త జెనెటిక్ కోడ్ వెలుగు చూసింది. అప్పట్లో వైద్యులు రోగుల నమూనాలు సేకరించి బ్లడ్ కల్చర్ పరీక్ష చేయించగా.. ఫలితాల్లో నెగెటివ్ రిపోర్ట్ వచ్చేది. దీంతో విభిన్నంగా ఆలోచించిన వైద్యులు మోకాళ్ల నుంచి సైనోవియల్ ఫ్లూయిడ్‌ను సేకరించి జీనోమ్ పరీక్షలు చేశారు. ఇందులో పాజిటివ్ రిపోర్ట్ వచ్చింది. దీన్ని ప్రామాణికంగా తీసుకొని సైనోవియల్ ఫ్లూయిడ్‌ను ఉపయోగించి పీసీఆర్ పరీక్షలు చేయగా.. మూడు గంటల్లోనే మెలియోయిడోసిస్ పాజిటివ్ రిపోర్ట్ రావడం విశేషం. మరోసారి ఈ శాంపిల్స్‌కు సంప్రదాయబద్ధమైన కల్చర్ పరీక్షలు నిర్వహించగా.. మూడు రోజుల తర్వాత వెలువడిన ఫలితాల్లో సైతం మెలియోయిడోసిస్ ఫీవర్ పాజిటివ్ వచ్చింది. అయితే పల్నాడు జిల్లాకు చెందిన మెలియోయిడోసిస్ రోగి నుంచి సేకరించి చేసిన జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల్లో మాత్రం.. అక్కడి బ్యాక్టీరియాలో జన్యు రూపాంతరం కనిపించలేదు. ఊపిరితిత్తులపై దాడిచేసే బ్యాక్టీరియానే ఉన్నట్లు తేలింది. దీంతో తురకపాలెం గ్రామంలో మాత్రమే బ్యాక్టీరియా జెనెటిక్ కోడ్ మారినట్లు స్పష్టమైంది.

ఇకపై 3 గంటల్లోనే వ్యాధి నిర్ధారణ: డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి

ఇకపై మెలియాయిడోసిస్ జ్వరాల నిర్ధారణ సులువుగా మారుతుందని అంటువ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ కే కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. గురువారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ... జీనోమ్ సీక్వెన్సింగ్ పరీక్షల ద్వారా మారిన బ్యాక్టీరియా జెనెటిక్ కోడ్‌ను గుర్తించినట్లు చెప్పారు. ఇకపై రోగుల మోకాళ్ల నుంచి సేకరించిన సైనోవియల్ ఫ్లూయిడ్‌ను పీసీఆర్ పరీక్షలు చేయిస్తే మూడు గంటల్లోనే కచ్చితమైన ఫలితాలు పొందవచ్చని ఆయన వెల్లడించారు. కీళ్ల నొప్పులు, మడమ నొప్పులు, జ్వరం, ఒంటిపై యాప్సిస్ ఉంటే మెలియోయిడోసిస్‌గా అనుమానించాలని కల్యాణ్ చక్రవర్తి ఆర్థోపెడిక్ డాక్టర్లకు సూచించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కలిసివచ్చిన జర్మనీ

జర్మన్ చాన్సెలర్ ఫ్రీడ్రిక్ మర్జ్ రెండురోజుల పర్యటనతో కొత్త ఏడాదిలో యూరోపియన్ నేతల వరుస రాకపోకలు మొదలైనట్టే. ఈనెలాఖరులో జరగబోయే ఈయూ–ఇండియా శిఖరాగ్ర సదస్సు కోసం వస్తున్న ఈయూ కౌన్సిల్, కమిషన్ అధ్యక్షులు భారత గణతంత్రదినోత్సవ వేడుకల్లోనూ పాల్గొంటారు. ఫిబ్రవరిలో జరిగే ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ సదస్సులో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్‌ది కీలకపాత్ర. ట్రంప్ చర్యలూ చేష్టలతో ఇబ్బందులు పడుతున్న భారత్‌కు ఈయూతో సాన్నిహిత్యం ఉత్సాహంతో పాటు, ఉపకారాలూ చేస్తుంది.

ఉక్రెయిన్ యుద్ధం సహా చాలా విషయాల్లో జర్మనీతో భారతదేశానికి విభేదాలు ఉన్నాయి. కానీ, ట్రంప్ మహాశయుడు అస్మదీయులు, తస్మదీయులన్న తేడా లేకుండా అందరినీ ఏదో విధంగా వేధించుకుతింటున్న తరుణంలో యూరప్ దేశాలు కొత్త స్నేహాలతో పాటు, ఇప్పటికే ఉన్నవాటిని బలోపేతం చేసుకొనే పనిలో పడ్డాయి. జర్మన్ చాన్సెలర్ తన పర్యటనలో ఉభయదేశాల సాన్నిహిత్యం అత్యున్నత స్థాయిలో ఉండబోతున్నదని స్పష్టంచేశారు. ఈయూలో భారత్ అతిపెద్ద వాణిజ్య భాగస్వామి అయిన జర్మనీతో ఇప్పుడు కుదిరిన ఒప్పందాలు ఆ వ్యాఖ్యలకు అనుగుణంగానే ఉన్నాయి. భారతీయులకు వీసా ఫ్రీ ట్రాన్సిట్ సదుపాయం కల్పించడం జర్మన్ అధినేత పర్యటనలో కీలకమైన నిర్ణయం. ఇది ప్రయాణాలను సులభతరం చేయడంతో పాటు, ప్రజలమధ్య సాన్నిహిత్యానికి పెంచేందుకు కట్టుబడి ఉన్నామని చెబుతున్న చర్య. విద్యారంగంలో సంయుక్తంగా కోర్సులు, యూనివర్సిటీల మధ్య విస్తృతసహకారం, క్యాంపస్‌ల ఏర్పాటు సహా ఉభయదేశాలు ఇచ్చిపుచ్చుకోగలిగే పలురకాల అవకాశాల గురించి దేశాధినేతలు ఇద్దరూ మాట్లాడుకున్నారు. వివిధ ఉత్పత్తుల తయారీతో మేకిన్ ఇండియాను బలోపేతం చేయడం కూడా జర్మనీ నిర్ణయాల్లో ఒకటి. భారత్–జర్మనీ మధ్య కుదిరిన అవగాహనలు, ఒప్పందాలు మనకు చాలా రంగాల్లో వృద్ధికి వీలుకల్పిస్తాయి. ఎప్పుడో కుదిరిన సబ్‌మెరైన్ల సరఫరా వంటివి ఇంకా కొన్ని ఒత్తిళ్ళ నేపథ్యంలో, ఆచరణకు దూరంగా ఉండిపోయినప్పటికీ, నైపుణ్యంగల కార్మికులకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి జర్మనీ సిద్ధపడటం బాగుంది. ఆరోగ్యరంగంలో సహకారం సాంకేతికతతో పాటు ఉపాధినీ పెంచుతుంది. రక్షణరంగంలో ఇచ్చిపుచ్చుకోవడాలు భారతీయ కంపెనీలకు కొత్త అవకాశాలను కల్పిస్తుందని అంటున్నారు. పారిశ్రామికంగా దక్కబోయే సహకారం మనకు సాంకేతికతనూ, సామర్థ్యాన్ని సమకూరుస్తుంది. సెమీ కండక్టర్లు, కీలక మినరల్స్, బయో ఎకానమీ వంటివి బలోపేతమవుతాయి. వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికతల బదలాయింపు, గ్రీన్ ఎనర్జీ ఇత్యాది అంశాల్లో యూరప్ దేశాల సహకారం తోడైనప్పుడు అభివృద్ధిచెందిన ఆర్థికవ్యవస్థగా భారత్ అవతరించడం సుసాధ్యమవుతుంది. యూరప్‌లో అతిపెద్ద ఆర్థికశక్తిగా జర్మనీ నిర్వహించే పాత్ర ఇందులో ప్రధానమైనది. ఈయూతో మనం జరుపుతున్న మొత్తం వాణిజ్యంలో నాలుగోవంతు ఈ దేశంతోనే సాగుతోంది. అయితే, ఈయూ ఆవల ఈ దేశం సాగిస్తున్న వాణిజ్యం అమెరికా, చైనాల్లోనే అధికంగా సాగుతోంది. పెట్టుబడులు కూడా అది ఈ దేశాల్లోనే అధికంగా పెడుతోంది. అయితే, ఒక వాణిజ్యభాగస్వామిగా చైనా మీద ఎక్కువగా ఆధారపడటం సరికాదన్న ఆలోచనతో జర్మనీ ఇప్పుడు కొత్త విస్తరణ ప్రయత్నాలతో కదులుతోంది. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తరువాత అమెరికా కూడా నమ్మదగ్గది కాకుండా పోతున్నది. ఈ నేపథ్యంలో విస్తృతమైన మార్కెట్ అవకాశాలు ఉన్న భారత్‌తో బంధం జర్మనీకి అత్యవసరం.

ఇండియా–ఈయూ స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని ఉభయదేశాల నాయకులు అపరిమితంగా శ్లాఘిస్తూ ఈనెలాఖరులో జరగబోయే శిఖరాగ్రసదస్సులో ఖరారుచేయాలని నిర్ణయించుకున్నారు. అమెరికాతో ఇదే తరహా ఒప్పందం ఎడతెగని చర్చోపచర్చలతో ఇంకా కొలిక్కిరాని నేపథ్యంలో, ఈయూతో మనం చేయీచేయీ కలిపి సాగడం మనకు ధైర్యాన్నీ, స్థైర్యాన్నీ ఇస్తుంది. తన తొలి ఆసియా పర్యటనలో భారత్‌ను ఎంపికచేసుకొని జర్మనీ అధినేత ఇచ్చిన ప్రాధాన్యం ప్రశంసనీయమైనది. ఇప్పుడు జర్మనీ, రాబోయే రోజుల్లో మొత్తంగా ఈయూ చాలా రంగాల్లో తోడు నిలవబోతున్నాయి. ట్రంప్ ఎవరినైతే రావద్దంటున్నాడో, వేటినైతే కాదంటున్నాడో ఆ లోటుపాట్లను భర్తీ చేసేందుకు ఇండియా–ఈయూ సాన్నిహిత్యం ఉపకరిస్తుంది.


నిత్య సంక్రాంతి.. పుస్తక పఠనం

వ్యక్తిత్వ వికాసంపై పదాలు, చిత్రాలు మిళితమైన పద్యాలు; కొండంత ఆకారం గల జంతువులతో మైథిలి అనే బాలిక సాహసాలు, అనుభవాల గురించిన వర్ణశోభిత బొమ్మల పుస్తకం; లోకాలకు వెలుగునిచ్చే ఆదిత్యుడిని ఒక యువతిగా చిత్రించిన ఈశాన్య భారత జానపద గాథ, సువిశాల భారతావనిని సస్యశ్యామలం చేస్తోన్న మన నదుల (కొండ నుంచి కడలి దాకా) ప్రస్థాన శోభను కల్పిత గాథలు, బొమ్మల ద్వారా కళ్లకు కట్టించిన కథనాలు, ఆధునిక భారతదేశ చిత్రకారుడు ఒకరిని పరిచయం చేసిన రమణీయ పుస్తకం సహా ఎన్నో పుస్తకాలు... దేశ రాజధానిలో కొనసాగుతున్న ప్రపంచ పుస్తక ప్రదర్శనలోకి మిమ్ములను స్వాగతిస్తున్నాయి. మరి మీరు మీ పిల్లల జీవితాలలో ఆ జ్ఞానకుసుమాలు పరిమళించేందుకై వాటిని స్వాగతిస్తున్నారా? మీ మీ నగరాలు, పట్టణాలలో పుస్తక ప్రదర్శనలు జరిగినప్పుడు మీ పిల్లలను తప్పక వాటికి తీసుకువెళ్లాలి. ఎందుకు తీసుకువెళ్లాలో వివరిస్తాను.

తండ్రి సందిటా, తల్లి కౌగిటా ఉండటమే బాలలకు సరిపోదు. తల్లీ, తండ్రి నీడలోనే అంటే తమ గృహంలోనే తమకొక సొంత ప్రదేశాన్ని వారు కోరుకుంటారు. ఆ ప్రదేశమేమిటో వారు తమకు తామే ఎంచుకుంటారు. బాలల పుస్తకాలకు కూడా అలాగే సొంత గౌరవనీయమైన ప్రదేశాల అవసరం ఎంతైనా ఉన్నది. అంకితభావంతో వాటిని చూడాలి, సంరక్షించాలి. బాలలకు సదా అందుబాటులో ఉండేలా చేయడమనేది మరీ మరీ ముఖ్యం. అప్పుడే వాటి విషయమై పిల్లల్లో శ్రద్ధాసక్తులు జనిస్తాయి. ఇంటిలో ఎదురుగుండా ఉండే అన్ని వస్తువుల కంటే కూడా పుస్తకాలు చాలా విలువైనవి. అవును, అవి విలువైనవనే భావాన్ని బాలల మనసుల్లో పాదుకొల్పడం మరీ ముఖ్యం.

ఇప్పుడు తల్లిదండ్రులుగా ఉన్న మీరు చిన్న వయసులో పంచతంత్ర కథలు, అమర్ చిత్ర కథలు చదివివుంటారు. అయితే ఇప్పుడు మీరు మీ పిల్లలు పాఠశాలల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు తోడ్పడే విద్యా సంబంధిత పుస్తకాలను మాత్రమే అందుబాటులో ఉండేలా చేస్తున్నారు. మరి మీ పిల్లల మనోవికాసం ఏమయ్యేట్టు? వారి ఊహా వైచిత్రి వింత సోయగాలు ఎలా పోతుంది? ఆలోచనా రీతులు జీవిత పురోగమన అవరోధాలను అధిగమించేలా ఎలా పదునెక్కుతాయి? బాలల కోసం ప్రత్యేకంగా రాసిన, రూపొందించిన పుస్తకాలను మీరు తప్పకుండా మీ పిల్లలకు అందించాలి. నెలనెలా పుస్తక దుకాణాలకు వెళ్లకపోయినా ఏడాదికొకసారి, అలాగే ఏవైనా ప్రత్యేక సందర్భాలలో జరిగే పుస్తక ప్రదర్శనలకు వెళ్లండి. మీ పిల్లల పఠనాసక్తులను పెంపొందించే పుస్తకాలను కొనండి. మీ చిన్నారులకు ఇవ్వండి. వీడియోలు, రీల్స్ వీక్షణే ప్రధానమైన పిల్లల జీవితాల్లో పుస్తకాలను ప్రవేశపెట్టండి. అవి వారి మనో ప్రపంచంలో కొత్త కాంతులు ప్రసరిస్తాయి. వెలుగులను విరజిమ్మే ఆలోచనలను రేకెత్తిస్తాయి.

అవును, మీరు పుస్తక ప్రదర్శనలకు తప్పక వెళ్లాలి. మీతో పాటు మీ పిల్లలనూ తప్పక తీసుకువెళ్లాలి. వారిని మన సువిశాల ఉపఖండ చరిత్ర, అందమైన కల్పనా గాథలు, అనంత వైవిధ్యంతో అలరారుతున్న, నడయాడుతున్న జన జీవితాలతో అనుసంధానించేందుకు అదొక ఉత్తమ మార్గం. ఆ చారిత్రక నేపథ్యం తోనూ, ఆ కథలను పలవరిస్తూనూ వారు పెరుగుతారు. భారతావని అనంత జీవన వైవిధ్యంలో తమ సొంత రీతిలో వెలుగొందడానికి వారు సంసిద్ధమయ్యేందుకు ఆ సాంస్కృతిక మూలాలతో వారిని చిన్న వయసులోనే కలపాలి. కలిపి తీరాలి.



వీడియోలు, రీల్స్ వీక్షణే ప్రధానమైన పిల్లల జీవితాల్లో పుస్తకాలను ప్రవేశ పెట్టండి. అవి వారి మనో ప్రపంచంలో కొత్త కాంతులు ప్రసరిస్తాయి. వెలుగులను విరజిమ్మే ఆలోచనలను రేకెత్తిస్తాయి.

కృత్రిమ మేధతో సహజీవనం చేస్తున్న బాలల్లో జిజ్ఞాసను రేకెత్తించేందుకు, సృజనశీలతను వికసింపచేసేందుకు మీరు మీ పిల్లలను పుస్తక ప్రదర్శనలకు తీసుకు వెళ్లాలి. వారికి పుస్తక పఠనాన్ని అలవాటు చేయాలి. ఇంతకు మించిన మంచి అలవాటు ఏముంటుంది? మరింత స్పష్టంగా చెప్పాలంటే భారతీయ బాలలకు, ముఖ్యంగా ఏదైనా ఒక భారతీయ భాషలో రాసిన భారతీయ పుస్తకాల కోసం మీరు పుస్తక ప్రదర్శనలకు వెళ్లాలి. శుభస్య శీఘ్రం. బాలల కోసం రాసిన అద్భుత పుస్తకాలు మీకు లభ్యమవుతాయి. భారతీయ బాల సాహిత్యం ఇప్పుడు పునరుజ్జీవన శుభ కాలంలో ఉన్నది. ఈ చైతన్యశీల వికాసం ఆంగ్లంలో రాసిన పుస్తకాలతో ప్రారంభమయింది. ఈ నవ జాగృతి సంప్రదాయ పురాణాలు, బోధనా కథలను దాటి ఒక శక్తిమంతమైన, సమకాలీన దృశ్యానికి చేరుకుంటోంది. ఆధునిక వాస్తవాలను అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. సమస్యలను విడమరిచి చెబుతోంది. తరతరాల మౌఖిక కథల చరిత్ర, నైతికత, జ్ఞానాన్ని నొక్కి చెప్పడంలోనూ ఈ సాహిత్య జాగృతి కొత్త దారులు తొక్కుతోంది. సమకాలీన ఆలోచనలతో వారసత్వాన్ని మిళితం చేసే శక్తిమంతమైన సాంస్కృతిక మార్పును ప్రతిబింబిస్తోంది.

హిందీ భాషలో ప్రచురితమైన పుస్తకాలను చూసిన తరువాత ఇతర భారతీయ భాషలలోనూ ఇటువంటి పుస్తకాలు, వీటికి మించిన పుస్తకాలు ఉంటాయనే భావన, కాదు, విశ్వాసం కలిగింది. బాల సాహిత్య రచయితలకు, బొమ్మల సృజనకారులకు, ప్రచురణకర్తలకు, మరీ ముఖ్యంగా పాఠకులకు ఇదొక ఉత్తేజకర కాలం. ఇది, బాల సాహిత్యానికి బంగారు కాలం, సందేహం లేదు.

బాల సాహిత్య ఉత్తమ కృతులను 'Parag Honour List' ద్వారా తెలుసుకోవచ్చు. టాటా ట్రస్ట్ వారి చొరవతో ఇది రూపొందింది. ఇంగ్లీష్, హిందీ భాషలలో బాల, యువ పాఠకులను దృష్టిలో ఉంచుకుని ఉత్తమ శైలిలో రాసిన, సాంస్కృతిక సంబంధిత విషయాలపై రాసిన పుస్తకాలు మాత్రమే ఈ జాబితాలో ఉంటాయి. గత ఐదు సంవత్సరాలుగా టాటా ట్రస్ట్ పరాగ్ ఆనర్ లిస్ట్‌ను ప్రకటిస్తోంది. గమనార్హమైన విషయమేమిటంటే ఆ పుస్తకాలను ట్రస్ట్ సొంతంగా ప్రచురించదు. కనుక ఇతర ప్రచురణకర్తలతో పోటీ పడే ప్రసక్తి లేదు. బాల సాహిత్య ఉత్తమ పుస్తకాలను ప్రఖ్యాత రచయితలు, చిత్రకారులు ఎంపిక చేస్తారు. 2025 సంవత్సరపు జాబితాలోను, గత ఐదు సంవత్సరాల జాబితాలలో ఏ ఏ పుస్తకాలు ఉన్నాయో తెలుసుకోవాలంటే ఆన్‌లైన్‌లో 'http://www.paragreads.in.@'కు వెళ్లండి. ఇంతవరకు ఈ జాబితాలలో మొత్తం 286 పుస్తకాలు ఉన్నాయి. భిన్న వయస్కులు అయిన బాలలకు పఠనయోగ్యమైన పుస్తకాలుగా వాటిని వర్గీకరించారు. ఆ పుస్తకాలను మొత్తం 24 వేర్వేరు సంస్థలు ప్రచురించాయి. పుస్తక ప్రదర్శనలలో అవి సులభంగా అందుబాటులో ఉన్నాయి.

చాలా ఆసక్తికరమైన, ఉత్తేజకరమైన భారతీయ బాల సాహిత్య పుస్తకాలు ఆంగ్లంలో ప్రచురితమయ్యాయి. అయితే ఒక వాస్తవాన్ని మనం అంగీకరించి తీరాలి. సుప్రసిద్ధ రచయిత్రి–చిత్రకారుడు ద్వయం– జూలియా డోనాల్డ్ సన్, ఆక్సెల్ షెఫ్లర్ చమత్కారమైన కథ, చిరస్మరణీయమైన పాత్రలతో సృజించిన 'ది గ్రఫలో' లాంటి పుస్తకాలు ఇంకా మన బాల సాహిత్య రచయితల నుంచి వెలువడడం లేదు. అయితే రచయిత సి.జి. సాలమాండర్, చిత్రకారుడు రాజీవ్ ఈప్ సృష్టించిన 'అసునం: సంగీతాన్ని ఇష్టపడే మృగం' అనే పిల్లల చిత్ర పుస్తకాలు పైన పేర్కొన్న 'ది గ్రఫలో' స్థాయిని క్రమంగా అందుకుంటున్నాయని చెప్పవచ్చు.

ఇంత వివరంగా ఎందుకు చెబుతున్నానంటే మీరు మీ పిల్లను పుస్తక ప్రదర్శనలకు తప్పక తీసుకువెళ్లాలనే ఆశంసతోనే.. పుస్తక పఠనంతోనే చిన్నారి బాలల ఊహా వైచిత్రి వికసిస్తుందనే సత్యాన్ని తల్లిదండ్రులు మరువకూడదు.



■ యోగేంద్ర యాదవ్
(వ్యాసకర్త 'స్వరాజ్ ఇండియా' అధ్యక్షుడు)

మృదుశక్తి మహిమను కోల్పోతున్నామా!?

ప్రపంచవ్యాప్తంగా మతాల మంచిచెడుల గురించి మాట్లాడటం ఇప్పుడు తగ్గిపోతోంది. నమ్మశక్యం కాకపోయినా ఇది నిజం! మత భావాలను రెచ్చగొట్టి, వాటికి అనుగుణంగా జన సమీకరణలు చేసే రాజకీయాలు చాలా దేశాల్లో పెరుగుతున్నాయి. అవి ఎంతగా పెరుగుతుంటే అంతగా మతాల మంచిచెడులపై సద్విమర్శలూ, సద్వివేచనలూ తగ్గిపోతున్నాయి. మత ఆధారిత రాజకీయాల్లో ఏదో విధంగా ఎదుటి మతాలను దుమ్మెత్తిపోయటం, చిన్నబుచ్చటం, వాటిపై విద్వేష భావాలను పెంచటం, కొందరు చేసిన తప్పులకు ఆ మతాలను అనుసరించే వారందరూ బాధ్యులే అన్నట్లుగా వ్యవహరించటం సాధారణంగా కనపడుతుంది. అందుకే మతాల గొప్పలు, వారసత్వాల ఆసరాతో రాజకీయంగా బలాన్ని పెంచుకునేందుకు పావులను కదపటం వల్ల అన్నిచోట్లా బలి అవుతున్నదీ మూల్యాన్ని చెల్లిస్తున్నదీ సమిధలవుతున్నదీ సాధారణ పౌరులే.



బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం కనపడే చిత్రం అదే. ప్రతి రోజూ హిందువులపై దాడులు, హత్యల వార్తలు వస్తూనే ఉన్నాయి. రాజ్యాన్ని ఇస్లామీకరిస్తామనీ, చట్టాలన్నిటినీ షరియా, హాదిత్‌లకు అనుగుణంగా మార్చేస్తామనీ చెప్పే జమాత్–ఇ–ఇస్లామీ లాంటి సంస్థలు బంగ్లాదేశ్‌లో అధికారం కోసం తహతహలాడుతున్నాయి. ప్రతి రాజకీయ సంక్షోభాన్ని.. కొన్ని మెట్లు పైకెక్కేలా ఉపయోగించుకోవటంలో మతతత్వ సంస్థలు ఎప్పుడూ ముందుంటూనే ఉన్నాయి. జనాగ్రహ వెల్లువలో షేక్‌హసీనా ప్రభుత్వం కూలిపోయిన తర్వాత మతతత్వ సంస్థల, పార్టీల రాజకీయ చురుకుదనం బాగా పెరిగింది. అచ్చమైన, స్వచ్ఛమైన ఇస్లామిక్ పాలన తీసుకొస్తామనే నినాదాలు తప్ప జనజీవితాలను గణనీయంగా మార్చే ఆర్థిక విధానాలు మతతత్వ సంస్థలకు సహజంగానే ఉండవు. వాటికి కావాల్సిందల్లా ఒక మతం ప్రజలను నిత్యం శత్రువులా పరిగణించే రాజకీయాలు మాత్రమే. అక్కడి హిందువులందరినీ భారత అనుకూలురుగా, ఏజెంట్లుగా, ఇస్లాం వ్యతిరేకులుగా ఆరోపణలూ చేస్తూ దాడులకు పాల్పడుతూ మత ప్రాతిపదికన ప్రజల్లో బలాన్ని పెంచుకోవటం వాటికి అవసరం. అందుకోసం చేసే మూకదాడులూ, దేవాలయాల విధ్వంసాలూ వారి దృష్టిలో నేరచర్యలు కావు. మతంతో సంబంధంలేని పౌరహక్కులకు వాటి దృష్టిలో ఎటువంటి విలువా లేదు. మతాతీతంగా అందరికీ వర్తించే పౌరహక్కుల భావనకు ఆ సంస్థలు వ్యతిరేకం. వచ్చేనెలలో ఆ దేశంలో ఎన్నికలు జరగనున్నాయి కాబట్టి మతతత్వ విద్వేషాలు మరింతగా రెచ్చగొడుతున్నారు. బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బీఎన్‌పీ), నిన్నమొన్నటి వరకూ అధికారాన్ని చలాయించిన అవామీలీగ్ పార్టీ సమయానుకూలంగా మతతత్వ పార్టీలు, సంస్థల అండదండలను అందిపుచ్చుకున్నవే. ఈ రెండు ప్రధానపార్టీలు మతతత్వంతో అంటకాగకపోతే పరిస్థితి కాస్త భిన్నంగా ఉండేది. కానీ ఇప్పుడు దాన్ని వదులుకునే రీతిలో ఆ పార్టీల్లేవు. ప్రభుత్వానికీ, పాలనకూ ఇస్లాం విధానాలనే ఆలంబన చేసుకుంటామనీ రెండు పార్టీలూ ఎప్పుడో స్పష్టం చేశాయి.

బంగ్లాదేశ్ ఏర్పడిన తొలినాళ్లలో రూపొందిన రాజ్యాంగంలో లౌకికవాదాన్ని పాలనకు మూలస్తంభంగా పేర్కొన్నారు. మతం ఆధారంగా నడిచే పార్టీలనూ నిషేధించారు. సోషలిజాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగానూ పరిగణించారు. లౌకిక, సామ్యవాద పదాలను భారత రాజ్యాంగం నుంచి తొలగించాలని డిమాండు చేసే వారికి ఈ సంగతి తెలియకపోవచ్చు. తెలిసినా అప్రియసత్యాలను ప్రస్తావించటం ఇష్టమూ ఉండకపోవచ్చు. మనకంటే ముందుగానే (1972లో) వాటిని బంగ్లాదేశ్ రాజ్యాంగంలో పొందుపరిచారు. అధికారాన్ని పదిలం చేసుకోటానికి రాజకీయ కారణాలతో లౌకికవాదం నుంచి వైదొలగటమే బంగ్లాదేశ్‌లో ఇప్పుడు నెలకొన్న విద్వేష వాతావరణానికి ఒక ప్రధానకారణం. భారత్‌కు అనుకూలంగా వ్యవహరించినంత మాత్రాన అవామీలీగ్ లౌకికపార్టీ అయిపోదు. అవసరాన్ని బట్టి జమాత్–ఇ–ఇస్‌లామీతో జట్టుకట్టిన చరిత్ర ఆ పార్టీకి ఉంది. లౌకికవాదాన్ని రాజ్యాంగ మౌలిక సూత్రంగా 1977లో మిలటరీ పాలకులు తొలగించారు. అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం, భక్తి ఉందనే పదాలను రాజ్యాంగ పీఠికలో చేర్చారు. ఇక 1988లో ఇస్లాంని రాజ్యమతంగా అధికారికంగా ప్రకటించారు. షేక్ హసీనా 1996లో తొలిసారి అధికారంలోకి వచ్చినా వాటిని తీసివేయటానికి ప్రయత్నించలేదు. 2011లో భారీ మెజారిటీతో ప్రభుత్వ పగ్గాలను చేపట్టిన తర్వాత లౌకికవాద పదాన్ని మళ్లీ రాజ్యాంగంలో చేర్చినా రాజ్యమతంగా ఇస్లాం అనే దాన్నీ, పీఠికలో ప్రవేశపెట్టిన అల్లా పట్ల సంపూర్ణ విశ్వాసం–భక్తి లాంటి వ్యక్తీకరణలను అలాగే ఉంచేశారు. 2014 మార్చి 23న షేక్‌హసీనా చేసిన కీలక ప్రకటనతో బంగ్లాదేశ్ లౌకికవాదం వైపు మొగ్గే అవకాశం దాదాపుగా ముగిసిపోయింది. మహమ్మద్ ప్రవక్త మదీనాలో చేసిన చివరి ప్రసంగం ఆధారంగానే బంగ్లాదేశ్ పాలన ఉంటుందనీ, ఖురాన్–సున్నత్‌లకు భిన్నంగా ఎలాంటి చట్టమూ దేశంలో రాదనీ హసీనా స్పష్టంచేశారు. లౌకికవాదాన్ని పాలనకు మౌలికసూత్రంగా పేర్కొంటూ రాజ్యాంగాన్ని రూపొందించి, అమల్లోకి తెచ్చిన (1972 నవంబర్ 4) అవామీలీగ్ మతానికి రాజకీయంగా పెద్దపీట వేయటం బంగ్లాదేశ్‌కు చెడ్డమలుపుగానే చెప్పుకోవాలి. దాన్నుంచి వెనక్కివెళ్లే కొత్త రాజకీయాలు ఇప్పుడక్కడ కనుచూపు మేరలో కూడా లేవు.



■ రాహుల్ కుమార్

బంగ్లాదేశ్‌లో మూకదాడులు, మతప్రేరిత హత్యలు ఘోరమైనవి, హేయమైనవి, మానవతా దృక్పథానికి వ్యతిరేకమైనవి. అయినా వాటిని ఒక పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, లౌకికవాదానికి నిబద్ధమైన దేశంగా బలంగా ఖండించలేని నైతిక సందిగ్ధతలో భారత్ ఉండిపోతున్న పరిస్థితే కనపడుతుంది. హిందూ మతాభిమాన ఉద్వేగాలతో సామాజిక మాధ్యమాల్లో ఖండనలు తీవ్రంగానే వెలువడుతున్నాయి. కానీ విశ్వమానవ పౌరహక్కుల దృష్టితో చూస్తే అవి పరిమితమైనవి, పాక్షికమైనవి. మత ఆలోచనలకు అతీతంగా ఆధునిక నాగరికత అందించిన పౌరహక్కుల పరిధి చాలా విశాలమైంది. ఆ పౌరహక్కుల స్పృహ లోతుగా మన హృదయాల్లో, మనసుల్లో పాదుకుంటే అన్నిరకాల మతవిద్వేష దాడులపై ఆగ్రహం కలుగుతుంది. ఆవేశం పెల్లుబికుతుంది. వివేచనతో కూడిన ఆచరణను పురిగొల్పుతుంది. బయటే కాదు దేశంలోపలా పెట్రేగుతున్న విద్వేషాలకు ఎదురొడ్డి నిలబడగలిగితేనే ఆ పౌరహక్కులకు సార్థకత ఉంటుంది. అలా చేయలేనప్పుడు మనకు నైతికశక్తి కొరత ఏర్పడుతుంది. బంగ్లాదేశ్‌లోని అకృత్యాలపై బలహీన గొంతులకు కారణం ఆ కొరతే!

బంగ్లాదేశ్ హిందువులు ఇప్పుడు అన్నివైపుల నుంచీ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. ఇస్లాం రాజ్యమతం అయిన తర్వాత, చట్టాలన్నిటికి ఆ మత సిద్ధాంతాలు, పద్ధతులు ప్రాతిపదికలవుతాయని ప్రకటించిన తర్వాత తమ అస్తిత్వాలు శాశ్వత ప్రమాదంలో ఉన్నాయనే భయమే వారిని ఆవహిస్తోంది. అధిక సంఖ్యాకుల మతం, సంస్కృతి, విశ్వాసాలు, ఆధిపత్యాలకు తలవొగ్గి ఉండాల్సిన పరిస్థితులు మైనారిటీ మతాల వారిని మామూలు మనుషులుగా ఉండనీయవు. సహేతుకత, ఉన్నత న్యాయదృష్టి లేకుండా మతం, సంస్కృతి, సంప్రదాయాలను చిన్నబుచ్చే ప్రయత్నాలను ప్రజలు తేలికగా జీర్ణించుకోలేరు. మెజారిటీ మతాన్ని అన్నివిధాలుగా ఆకాశానికెత్తుతూ, మైనారిటీల మతాన్ని తక్కువచేసి చూపటం సామాజిక వైషమ్యాలను సృష్టిస్తుంది.

> బలప్రయోగం లేకుండా, కుటిలనీతికి పాల్పడకుండా సాటి సమాజాలు కాస్త ఉన్నతస్థాయికి ఎదగటానికి తోడ్పడటాన్ని మృదుశక్తికి (సాఫ్ట్‌పవర్) నిదర్శనంగా భావిస్తారు. చరిత్రలో భారత్‌కు కొంతకాలం ఆ మృదుశక్తి పుష్కలంగా ఉండేది. వలసపాలనలో మగ్గి, ఆర్థికంగా వెనుకబడి, అన్ని విధాలుగా చితికిపోయినా.. స్వాతంత్ర్యానంతరం సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని స్వీకరించి, లౌకికవాదం, మత సమభావనలతో వ్యవహరించటం ద్వారా భారత్ సరికొత్త మృదుశక్తిని సంపాదించుకుంది. ఆ మృదుశక్తితోనే ఎన్నో దేశాలకు ప్రేరణగా నిలిచింది. దేశంలో ప్రజాస్వామ్యాన్నీ నిలబెట్టుకుంది. ఇప్పుడు ఆ శక్తికి గండిపడుతున్న ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి.

బంగ్లాదేశ్‌లో ఈ విపరిణామాలన్నీ విస్తృతంగా జరుగుతున్నాయి. వీటిని కాదనలేం. అదే సమయంలో భారత్ మైనారిటీలూ అలాంటి అస్తిత్వ సంక్షోభాన్ని ఎదుర్కోవటం లేదా? అంటే.. కాదని చెప్పలేం! తరతరాల తమ అస్తిత్వానికి తగిన ప్రాధాన్యం ఇవ్వటం లేదనే భావన ఎక్కడైనా ప్రమాదకరమే. పాలకుల మతం ఆధారంగా దేశచరిత్రలో స్వర్ణయుగాలు, చీకటియుగాలు ఉంటాయని పదేపదే ప్రచారం చేయటం విద్వేష భావాలనే కలగచేస్తుంది. ఇస్లాం మతం అనుసరించిన పాలకులందరూ పీడకులేననీ, వారి పాలనలో దేశం అన్నిరంగాల్లో అధోగతి పాలైందనే ఆరోపణలు అత్యున్నత స్థాయినుంచి రావటం తీవ్రమైన ఆత్మన్యూనతా భావాన్ని సృష్టిస్తుంది. నిరంతరం ఆ పరిస్థితిలో ఉన్నవారు విపరీత ధోరణులకు తేలికగా ప్రభావితం అవుతారు. బహుళమత భారతావనికి అసలుసిసలైన ప్రమాదం ఇదే.

ప్రజాస్వామ్యానికి భారత్‌ను పుట్టినిల్లుగా చెప్పుకోవటం తెలికే. చరిత్రలో మనం ప్రజాస్వామ్యాలుగా, గణతంత్రాలుగా పిలిచేవేవీ నిజమైన ప్రజాస్వామ్యాలు కావు. కొద్దిమంది పాలక కులాల పెద్దలు పదవుల్లో కూర్చోటానికి గతంలో పరిమితంగా ఎన్నికలు జరుపుకున్నంత మాత్రాన మనల్ని మనం ప్రజాస్వామ్య సృష్టికర్తలుగా చెప్పుకోలేం. నల్లజాతివారిని ఎంతో అమానవీయంగా బానిసలుగా మార్కెట్‌లో అమ్మకాలు, కొనుగోలు చేస్తున్న కాలంలోనే అమెరికా తనను తాను ప్రజాస్వామ్య రాజ్యంగా ప్రకటించుకుంది. అంతమాత్రానే అది సంపూర్ణ ప్రజాస్వామ్యం అవ్వదు. అసలు సవాలు.. ఆధునిక ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆచరణలో చూపటమే. దానికి బలమైన లౌకికవాదంతో కూడిన పౌరహక్కులే పునాది. అందుకే మతప్రసక్తి, వివక్షాలేని పౌరహక్కులను నిజస్ఫూర్తితో బంగ్లాదేశ్‌లో అమలుపరిస్తేనే అక్కడి మైనారిటీ హిందువులు భయం బతుకుల నుంచి బయటపడతారు. భారత్‌లో మైనారిటీలకూ ఆ పరిస్థితిని కల్పించాలి.


> **అసలు సవాలు.. ఆధునిక ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఆచరణలో చూపటమే. దానికి బలమైన లౌకికవాదంతో కూడిన పౌరహక్కులే పునాది. అందుకే మతప్రసక్తి, వివక్షాలేని పౌరహక్కులను నిజస్ఫూర్తితో బంగ్లాదేశ్‌లో అమలుపరిస్తేనే అక్కడి మైనారిటీ హిందువులు భయం బతుకుల నుంచి బయటపడతారు.**

రాజ్యపిపాసతో రక్తపాతాలు చిందించటం అంతర్గతంగా మనచరిత్రకు కొత్తకాదు. కానీ బలప్రయోగంతో బాహ్యదేశాల్లో భారత్ తన సంస్కృతిని విస్తరించలేదు. మన సంస్కృతీ పరిచయంతో మధ్య, ఆగ్నేయ, తూర్పు ఆసియాలు ప్రభావితమై ఆనాటి పరిస్థితుల్లో మరికొంత ఉన్నతస్థాయిని చేరుకోగలిగాయి. బలప్రయోగం లేకుండా, కుటిలనీతికి పాల్పడకుండా సాటి సమాజాలు కాస్త ఉన్నతస్థాయికి ఎదగటానికి తోడ్పడటాన్ని మృదుశక్తికి (సాఫ్ట్‌పవర్) నిదర్శనంగా భావిస్తారు. చరిత్రలో భారత్‌కు కొంతకాలం ఆ మృదుశక్తి పుష్కలంగా ఉండేది. వలసపాలనలో మగ్గి, ఆర్థికంగా వెనుకబడి, అన్ని విధాలుగా చితికిపోయినా.. స్వాతంత్ర్యానంతరం సంపూర్ణ ప్రజాస్వామ్యాన్ని స్వీకరించి, లౌకికవాదం, మత సమభావనలతో వ్యవహరించటంద్వారా భారత్ సరికొత్త మృదుశక్తిని సంపాదించుకుంది. ఆ మృదుశక్తితోనే ఎన్నో దేశాలకు ప్రేరణగా నిలిచింది. దేశంలో ప్రజాస్వామ్యాన్నీ నిలబెట్టుకుంది. ఇప్పుడు ఆ శక్తికి గండిపడుతున్న ఛాయలు స్పష్టంగా కనపడుతున్నాయి. దాన్ని పూడ్చుకుని మృదుశక్తిని బలంగా కాపాడుకుంటేనే ఉపఖండానికి భారత్ దిక్సూచిగా ఉంటుంది. అది జరక్కపోతే ఇంటాబయటా సమస్యలే ఎదురవుతాయి!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

పల్లె మనసు

పల్లెకు ప్రాణం లేచొచ్చింది
వెయ్యి చందమామల వెన్నెల
అమృతంలా కురిసినట్టు
తన్మయంతో తడిసిపోయింది
తల్లి బిడ్డను అక్కున చేర్చుకుని
ముద్దాడినట్టు మురిసిపోయింది
బతుకు జట్కా కోసం
పట్నం బాట పట్టిన పిల్లలు
పండగ పూట ఊర్లో అడుగిడేసరికి
పల్లె ఆనందం ఉప్పొంగి



పచ్చ కోక కట్టిన పడతిలా
పైరుతో తలూపుతూ
బిడ్డలకు స్వాగతం పలికింది
పాపం పల్లె అమాయకమైనది
మూన్నాళ్ళ ముచ్చటే అయినా
దానికి అది అలవాటే
మళ్లొచ్చే పండగ కోసం
కళ్ళలో వత్తులు వేసుకుని
అమ్మలా వేచి ఉండటం!

– న్యాలకంటి నారాయణ

తెలుగు సంస్కృతి సంక్రాంతి!



ప్రాంగణమ్మున పూచు బంతిపూవుల సొరు
గుమ్మాన పూదండ కులుకుచుండ
ముంగిట తీర్చిన రంగవల్లికలందు
చెలువుగ గొబ్బిళ్ళు కొలువుచేయ
క్రొత్త యల్లునికిని కొంటె మరదళ్లకు
జరిగెడు చతుర ప్రసంగములును
అత్తవారింటిలో క్రొత్త కోడలు పంచు
పొంగలి రుచిలోన పొదలు మమత

బోసినవ్వుల పాపకు బోగిపళ్ళు
పెలుచు బొమ్మల కొలువులు పేరంటాండ్రు
తెలుగు లోగిళ్ళ కొంగ్రొత్త వెలుగులెగయ
పర్వమున సంప్రదాయము పల్లవించె

రేయి మూడవ జాము రెక్కలు జాడించి
కొక్కొరొకో యను కోడి పుంజు
ఇంటింటికిని పోయి ఎల్లర నిద్దుర
లేపి దీవించు గంటాపకీరు
హరిలొరంగ యటంచు హరికీర్తనము చేసి
భక్తిని మేల్కొల్పు భట్టుదాసు
అయ్య గారికి మ్రొక్కి ఆటపాటలతోడ
హంగులు చేసెడి గంగిరెడ్లు

బుడబుక్కల మ్రోగించి పొలుచువారు
కాటిపాపలు తోల్బొమ్మలాటగాండ్రు
పగటి వేషాలు వేదాలు పలుకు బుధులు
పోతురాజులు పులియాట పోటుగాండ్రు
వీరలొకనాడు సంస్కృతి పెంపు చేసి
వెలుగులిచ్చిరి సంక్రాంతి విభవమునకు

ఇట్టి దృశ్యములీనాడు వట్టిపోయే
ఆదరణ లేక కళలెల్ల యావురనియె
పూర్వ వైభవ మేరీతి పొందగలవొ
సుంత యోచింపుడో బుద్ధిమంతులారా!

– వేదాంతం శరచ్చంద్రబాబు

స్వాగతించుదునిపుడు సంతసమున

సంక్రాంతి పండగ సౌభాగ్య సంపద,
భోగి భాగ్యములందు బలిమి కూర్చు,
కొత్త ధాన్యము పంట కలిసి వచ్చెగనంట,
పుష్య మాసపు లక్ష్మి పూజ చేయ,
నల్ల తిలబియ్యంబునెయ్యి కలిపిన వంట,
అర్పించి మొక్కెద ఆరగించు
గాలిపటములెల్ల గగనతలమునందు,
రంగవల్లిరథం రత్నరాసి..



ఔర సంక్రమణ శుభవేళ హరిని సిరిని,
దివ్య గానమే హరిదాసు దీవెనెంతో,
స్వాగతించుదునిపుడు సంతసమున
తెల తెలవారంగనే తెలుగుతావు

– వరకాల యాదగిరి

ముగ్ధమోహన రాగసుధ

మంచు ముత్యపు పిలుపునందిన
పుష్యమాసపు పడతి వధువై
మహీతలపు ప్రణయ వేదిక
ముగ్ధమోహన రాగసుధగా
సంకురాతిరి మరల వచ్చెను
కృషికి ఫలితము చేతికందగ
రైతుబిడ్డకు ముదము హెచ్చెను
జియ్యరయ్యకు చేవవచ్చెను

తిరుప్పావై మధువుపంచగ
సంకురాతిరి శుభము పలికెను
సకల మానవోన్నతికై

కానీ–
గంగిరేడుల వినుతి హెచ్చిన
గంగిరెద్దుల గుణము పోవలె
అభ్యుదయపు విలువ తెలిసిన
శాంతి పథమె మనది కావలె

భోగిమంటలు నింగికెగసిన
భాగ్యమేమియు కూడి రాదు
ఆ అగ్నిజ్వాలల దహనమవవలె
అంతరంగపు కలుషమంతయు



అపుడె జాతికి తేజ మొదవును
భాగ్యరాసులె పొంగి పొరలును
ప్రజల రాజ్యమె వెలసినపుడదె
నిక్కమగు సంక్రాంతి పర్వము

– పింగళి పాండురంగారావు
విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు



నేడు విజయవాడ వెస్ట్ బైపాస్ ట్రయల్ రన్

వెస్ట్ బైపాస్‌కు దారి సూచిక

- కాజ-గొల్లపూడి-చిన్న అవుటుపల్లి మధ్య రాకపోకలకు ఏర్పాట్లు
- ప్యాకేజీ- 4లో ఇప్పటికీ పలు చోట్ల పనులు పెండింగ్
- పండగ అవసరాలకు తాత్కాలిక ఏర్పాట్లతో అనుమతి

6

సరస్‌లో వైభవంగా సంక్రాంతి సంబరాలు

- కోలాటం ఆడిన డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి
- మహిళలకు వ్యాపార సామర్థ్యాలపై శిక్షణ

6

ఫోన్‌లో.. పోలీసు సేవలు

- వాట్సాప్ నంబర్ 95523 00009
- ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : మన మిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఫోన్లలోనే సులభంగా పోలీస్ సేవలు పొందవచ్చని ఎస్పీ వకుల్ జిందాల్ స్పష్టం చేశారు. ప్రజలకు ప్రభుత్వసేవలు మరింత సులభంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం ప్రవేశపెట్టిన వినూత్న కార్యక్రమమే "మన మిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ అని వివరించారు. దీని ద్వారా ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండానే, తమ మొబైల్ ఫోన్లలోనే ఎఫ్ఐఆర్ కాపీ, ఎఫ్ఐఆర్ ప్రస్తుత స్థితి, ఈ-చలానా వివరాలు తదితర పోలీస్ శాఖకు సంబంధించిన సేవలను పొందవచ్చని పేర్కొన్నారు. ఈ సేవలు పొందాలంటే ముందుగా 95523 00009 అనే నంబర్‌ను తమ మొబైల్ ఫోన్‌లో సేవ్ చేసుకుని, వాట్సాప్ ద్వారా 'హాయ్' అని మెసేజ్ పంపాలని సూచించారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ సేవలకు సంబంధించిన మెనూ ప్రదర్శించబడుతుందని, అందులో "సేవను ఎంచుకోండి" అనే ఆప్షన్‌ను క్లిక్ చేయడం ద్వారా అవసరమైన సేవలను ఎంపిక చేసుకోవచ్చని వివరించారు. ఆ మెనూలో పోలీస్ శాఖ సేవలు అనే ఆప్షన్‌ను ఎంచుకుంటే ఎఫ్ఐఆర్ నమోదు, ఎఫ్ఐ ఆర్ స్థితి, ఈ-చలానా వివరాలు వంటి సేవలు సులభంగా అందుబాటులో ఉంటాయని ఎస్పీ తెలిపారు.



వాట్సాప్ గవర్నెన్స్‌పై ప్రచార కరపత్రం

కోడి కత్తులు తయారీ ముఠా గుట్టు రట్టు

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి) : నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని నాయుడుపేట అంబేద్కర్ కాలనీలో ఓ ఇంటిలో గుట్టుగా కోడికత్తులు తయారు చేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు ఎస్పీ డీఎస్పీ శ్రీనివాసులు, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్ పర్యవేక్షణలో స్పెషల్ బ్రాంచ్ పోలీస్ సిబ్బంది జిల్లా వ్యాప్తంగా కోడి పందేలు జరగకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. నల్లపాడు స్పెషల్ బ్రాంచ్ పోలీస్ వారికి అందిన విశ్వసనీయ సమాచారం మేరకు శ్రీనివాసరావుతోటకు చెందిన బండి బాలచంద్ర అనే వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. దాడిలో భాగంగా అక్కడ ఉన్న 60 కోడి కత్తులు, మూడు కోడి కత్తులకు సాన పెట్టే మిషన్లను స్వాధీనం చేసుకొని, తదుపరి విచారణ నిమిత్తం నల్లపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.


గుంటూరు: సంపత్‌నగర్ అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి వెలిగిస్తున్న గ్రంథి కాంతారావు దంపతులు


అరండల్ పేట శివాలయం మకరజ్యోతి వెలిగిస్తున్న స్వరాజ్య లక్ష్మీ, శ్రీధర్

మాఫీ అన్నా.. ముందుకు రారే..!

- రూ.41.01 కోట్ల బకాయిలు
- రూ 4.62 కోట్లు వడ్డీ లేదన్నా ముందుకు రాని రుణ గ్రహీతలు

గుంటూరు (విద్య) జనవరి 14 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి పథకం కింద రుణాలు పొందిన లబ్ధిదారులు ఎస్సీ కార్పొరేషన్‌కు చుక్కలు చూపిస్తున్నారు. కోట్లాది రూపాయలు రుణాలు తీసుకొని చెల్లింపులు సకాలంలో చెల్లించకపోవడంతో బకాయిలు అంతకంతకు పెరిగి కొండలా పేరుకు పోతున్నాయి. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి 2018-19 వరకు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా లబ్ధిదారులు భారీ మొత్తంలో రుణాలు తీసుకున్నారు. ప్రధానంగా ఎన్ఎస్ఎఫ్‌డీసీ, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద దాదాపు 1253 మందికి ఎస్సీ కార్పొరేషన్ రుణాలు మంజూరు చేసింది. ఒక్కో యూనిట్కు లక్ష రూపాయల నుంచి రూ. 10 లక్షల వరకు రుణాలు మంజూరు చేశారు. అదేవిధంగా గ్రూప్ సభ్యులకు సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్, ఇన్నోవా కారు కొనుగోలు ఇతర స్వయం ఉపాధి పథకాల కోసం రూ 25 లక్షల వరకు రుణాలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరు చేశారు. అయితే చెల్లింపులు మాత్రం సక్రమంగా జరగడం లేదని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు దశాబ్ద కాలంగా ఉమ్మడి జిల్లాలో చెల్లింపులు సక్రమంగా జరగడం లేదు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 1253 మంది ఎస్సీ లబ్ధిదారుల నుంచి రూ. 41.01 కోట్ల బకాయిలు వసూలు కావలసి ఉంది. ఇందులో అసలు రూ 36. 39 కోట్లు కాగా దానిపై వడ్డీ దాదాపు రూ.4. 62 కోట్లు అయినట్లు అధికారులు నిర్ధారించారు.

ఎస్సీ కార్పొరేషన్‌కు బకాయిల బండ



ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం

వడ్డీ మాఫీ చేస్తామన్నా స్పందన నిల్

ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు రుణ మొత్తంలో వడ్డీని పూర్తిగా మాఫీ చేసి అసలు చెల్లించాలని అధికారులు చేసిన విజ్ఞప్తులు పట్టించుకోవడం లేదు. 4.62 కోట్లు వడ్డీ మాఫీ చేస్తామని ఇటీవల అధికారులు ప్రకటించారు. ఇందుకు లబ్ధిదారులకు ఏప్రిల్ 30 వరకు గడువు ఇచ్చారు. తీసుకున్న రుణంలో అసలు పూర్తిగా చెల్లించినట్లయితే వడ్డీ మాఫీ చేస్తామని ఎస్సీ కార్పొరేషన్ అధికారులు ప్రకటించారు. అయితే లబ్ధిదారులు ఎంతవరకు స్పందిస్తారనేది వేచి చూడాల్సింది.

ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకుడి మృతి

వినుకొండ టౌన్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొని వ్యక్తి మృతిచెందిన సంఘటన వినుకొండ ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లాపల్లి మండలం వెల్లటూరులో ఫాస్ట్‌ఫుడ్ బండి నిర్వహిస్తున్న లడ్డు రవి ద్విచక్ర వాహనంపై వస్తుండగా బొల్లాపల్లి మండలం మూగచింతలపాలెం గ్రామానికి చెందిన పులిపాటి పవన్, తల్లి అన్నామేరితో కలిసి హైదరాబాద్ వెళ్లేందుకు వినుకొండ ఆర్టీసీ బస్టాండ్‌కు ద్విచక్రవాహనంపై వస్తున్న సమయంలో ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పులిపాటి పవన్, తల్లి అన్నామేరికి తీవ్రగాయాలు కాగా, లడ్డు రవికి స్వల్పగాయాలయ్యాయి. వీరిని గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు చికిత్సకోసం తరలించగా పవన్ బుధవారం తెల్లవారుజామున మృతిచెందగా తల్లి అన్నామేరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుడు పవన్‌కు భార్య కరిష్మా, మూడు నెలల బాలుడు ఉన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరి మృతి

తుళ్లూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందిన ఘటన మండలంలోని వెంకటపాలెం వద్ద బుధవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, తుళ్లూరుకు చెందిన బుడ్డా మార్క్ (52), తాడేపల్లికి చెందిన పౌలు (65) స్కూటీ మీద వెళుతుండగా విజయవాడ నుంచి వస్తున్న లారీ వారి బండిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వారిరువురూ అక్కడికక్కడే మరణించారు. తాడేపల్లికి చెందిన పౌలు తుళ్లూరులోనే నివాసం ఉంటున్నారు. ఆయన రైల్వే డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేసి పదవీ విరమణ చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఎయిమ్స్‌కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై మారు తండ్రి లైంగికదాడి

● తల్లి ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు

మాచర్ల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై మారు తండ్రి లైంగికదాడికి పాల్పడిన ఘటన మాచర్ల పట్టణంలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, పట్టణంలోని రామాటాకీస్‌లైన్ ప్రాంతానికి చెందిన మైనర్ బాలికపై ఆమె మారు తండ్రి లైంగికదాడికి పాల్పడ్డాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతేడాది డిసెంబరు 25వ తేదీన బాలిక తల్లి నంద్యాలకు వెళ్లింది. అదే రోజున రాత్రి మారు తండ్రి మైనర్ బాలికకు కూల్ డ్రింక్ ఇచ్చి అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక తల్లి ఫిర్యాదులో పేర్కొంది. మారు తండ్రిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

పక్షుల కోసమే పంటల సాగు

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు



కారంపూడి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పక్షుల కోసమే తాను ప్రతి ఏటా పంటలు సాగుచేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు అంకారావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, కారంపూడి శివారులోని తన ఎకరం పొలంలో సజ్జ, జొన్న పంటలను సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల్లో పండించి పక్షులకు వదిలి వేస్తున్నట్లు చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో ప్రకృతి, అడవుల అభివృద్ధిలో సమస్త ప్రాణులలో పక్షులు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. పక్షి జాతి సంరక్షణ, అభివృద్ధి బాధ్యత అందరిపై ఉందన్నారు. రైతులు పండించే ప్రతి గింజలో పక్షులకు వాటా ఉందన్నారు. ఒక పక్షి ఎకరం పొలంలో అర బస్తా ధాన్యం తింటే దాని వ్యర్థాల ద్వారా భూమి సారవంతమై సుమారుగా 4 బస్తాల ధాన్యం దిగుబడి వస్తుందన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి ప్రథమ బాధ్యతని అంకారావు పేర్కొన్నారు.



కొల్లూరు : అనంతవరం బరిలో మొదలైన బుల్లెట్ బహుమతి పందెం



కొల్లూరు: జూద క్రీడల వద్ద పందేలు కాస్తున్న జూదరులు

కాలు దువ్విన కోళ్లు

(7వ పేజీ తరువాయి)

పోలీసులు తొలగించారు. ఇక కోడి పందేలు ఉండవని అంతా భావించారు. కాని రాత్రికి రాత్రే బరులు ఏర్పాటు చేసి బుధవారం ఉదయం కోడి పందేలను ప్రారంభించారు. పెద్ద ఎత్తున కోడి పందేలు నిర్వహిస్తున్నా పోలీసు అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలున్నాయి. కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసు కుంటామని కలెక్టర్ కృతికా శుక్లా, ఎస్పీ బి.కృష్ణారావు హెచ్చరించారు. అయితే క్షేత్రస్థాయిలో పోలీసు అధికారులు తీరు ఇందుకు భిన్నంగా ఉంది. వారు పందేల నిర్వహకులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

● అధికార నేతల అండతో...

రొంపిచర్ల మండలం కొనకంచి వారిపాలెం, రొంపిచర్ల, దొండపాడు, నాదెండ్ల మండలం సాతూలూరు ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న బరులను పోలీసు అధికారులు మంగళవారం తొలగించారు. పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మని హెచ్చరించి చేతులు దులుపుకున్నారు. రొంపి చర్ల మండలం కొనకంచివారి పాలెం సమీపంలో, నరసరావుపేట మండలం దొండపాడు వద్ద అధికార నేతల అండతో కొందరు కోడి పందేలు నిర్వహిస్తున్నారు. కొనకంచివారి పాలెం వద్ద రెండు బరులు ఏర్పాటు చేశారు. కొనకంచివారి పాలెం, దొండపాడు వద్ద పెద్ద ఎత్తున పందేలు జరిగాయి. రూ.లక్షల్లో పందేలు జరిగాయి. పోలీ సులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదన్న ఆరోపణలున్నాయి. కోడి పందేలకు వందల సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. బరులు కిటకిటలాడుతున్నాయి. కొనకంచివారిపాలెం, దొండపాడులో పందేలు తిలకించేవారు. పందేలు కాసే వారి కోసం బరుల వద్ద అన్ని ఏర్పాట్లు చేశా రు. రాత్రి వేళల్లో కూడా పందేలు నిర్వహించేం దుకు ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేశారు. కోడి పందేలతో పాటు జూదం కూడా విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. కోతముక్కు, గుండాట వంటి జూదం జోరుగా సాగుతోంది. బరుల వద్ద మద్యం పెద్ద ఎత్తున విక్రయిస్తున్నారు. మొబైల్ ఫోన్‌లలో పందేలు చిత్రకరించకుండా నిర్వాహకులు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ క్రమంలో కొనకం చివారిపాలెం బరి వద్ద కొందరి మొబైల్ ఫోన్‌లను లాగేసుకొని పగలగొట్టడం గమనార్హం. మరో రెండు రోజులు పందేలు జరగనున్నాయి.

● సంప్రదాయం ముసుగులో పందేలు

తీరంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సంప్రదాయాలను అడ్డంపెట్టుకొని అధికార పార్టీ నాయకుల ఆధ్వర్యంలో కోడి పందేలు జోరుగా సాగాయి. రేపల్లె నియోజకవర్గంలో చెరుకుపల్లి మండలం తూర్పుపాలెం గ్రామంలో 30 ఎకరాల విస్తీర్ణంలో 10 బరులు పేకాట శిబిరాలను ఏర్పాటు చేసి జోరుగా కోడిపందేలు నిర్వహించారు. ఈ పందేలను రాష్ట్ర రెవెన్యూమంత్రి అనగాని సత్యప్రసాద్ వీక్షించారు. తూర్పుపాలెంలో వీఐపీ బరుల్లో లక్ష నుంచి ఐదు లక్షల వరకు పందేలు జరుగగా చిన్నబరుల్లో రూ.10వేల నుంచి రూ.20వేలు, రూ.50వేల వరకు జరిగాయి. గుండాట, నెంబర్లాట విచ్చలవిడిగా కొనసాగాయి. కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి, తెలంగాణ రాష్ట్రం నుంచి వేలాదిగా పందెం రాయుళ్ళు తరలివచ్చి లక్షల్లో పందేలు కాసి వీక్షించారు.

● ఐదు పందేలు గెలిస్తే బుల్లెట్ బహుమతి

తూర్పుపాలెంలో ఒకేసారి 5 పందేలు గెలిస్తే బుల్లెట్ బండి బహుమతిగా అందిస్తామని చెప్పటంతో పందెం రాయుళ్ళు భారీగా తరలివస్తున్నారు. కోడిపందేలతోపాటు పేకాట, కోతముక్క, లోన బయట, తదితర ఆటలకు ప్రత్యేకంగా గుడారాలు వేసి పేకాటను నిర్వహించారు. మహిళలు సైతం పందేలను చూసేందుకు భారీగా తరలివచ్చారు. బరుల సమీపంలోనే ప్రత్యేక వాహనాలు ఏర్పాటు చేసి ఎలాంటి అనుమతులులేకపోయినా అధికార పార్టీ నాయకుల అండ చూసుకొని యథేచ్ఛగా మద్యం అమ్మకాలు జరిపారు.

● రద్దీని నియంత్రించేందుకు బౌన్సర్లు

వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కోడిపర్రు, కొల్లూరు, అనంతరవరం, చుండూరు గ్రామాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలో పందెం బరులను ఏర్పాటు చేశారు. ఆయా బరుల వద్ద వివిధ జూద క్రీడలతో పాటు మద్యం, తదితర సౌకర్యాలను పందెం రాయుళ్లు, జూదరుల కోసం అందుబాటులో ఉంచారు. వేమూరు, కొల్లూరు కోడి పందేల బరుల వద్ద పందెం రాయుళ్లను ఆకర్షించేందుకు కారు, బుల్లెట్, స్కూటీ తదితర వాహనాలను బహుమతులుగా ప్రకటించడంతో పాటు ప్రత్యేక ఆకర్షణగా వాటిని బరుల ప్రదర్శనగా ఉంచారు. కొల్లూరు బరిలో ఆరు పందాలకు బుల్లెట్ బహుమతిగా ప్రకటించగా, అనంతవరంలో ఏడు పందేలకు రూ.2 లక్షలు విలువ గల బుల్లెట్‌ను బహుమతిగా ఇస్తామంటూ నిర్వాహకులు హోరెత్తించారు. కోడి పందేలు తిలకించేందుకు వచ్చిన వారు పైపందేలు విపరీతంగా కాయడం గమనార్హం. ఆయా బరుల వద్ద రద్దీ, ఇతరత్రా వాటిని నియంత్రించేందుకు నిర్వాహకులు బౌన్సర్లను కూడా ఏర్పాటు చేయడం విశేషం.

సంక్రాంతి వచ్చింది.. సరదాలు తెచ్చింది

(7వ పేజీ తరువాయి)

ఆనందోత్సాహలను వ్యక్తం చేశారు. చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. భోగి పండుగ పురస్కరించుకొని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే ప్రత్యేక పూజలు చేశారు. శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాల్లో గోదాదేవి కల్యాణోత్సవాలు వైభవంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాల నడుమ కల్యాణోత్సవాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

● భక్తులకు మకర జ్యోతి దర్శనం

నరసరావుపేటలో శ్రీ అయప్పస్వామి దేవాలయాల్లో భక్తులు జ్యోతి దర్శనం చేసుకున్నారు. అయ్యప్పస్వామి తిరువాభరణాల ఊరేగింపు వైభవంగా జరిగింది. స్వామికి ఆభరణాలను అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అయ్యప్ప స్వామి దేవాలయాల్లో పడి పూజలు ఘనంగా జరిగాయి. నరసరావుపేటలో శ్రీ గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి ఊరేగింపు ఘనంగా నిర్వ హించారు. పాతూరు శివాలయం నుంచి ప్రారం భమైన ఊరేగింపు తెప్పోత్సవం నిర్వహించే వల్లప చెరువు వరకు సాగింది. వలప్ప చెరువులో శ్రీ గంగా పార్వతి సమేత భీమలింగేశ్వర స్వామి, గంగా మహాలక్ష్మీ అమ్మవార్ల తెప్పోత్సవం వైభవంగా జరిగింది. తెప్పోత్సవంను అధిక సంఖ్యలో భక్తులు తిలకించారు.

● పండుగ వేడుకల్లో ఎస్పీ

బాపట్ల జిల్లా పోలీస్ కార్యాలయం వేదికగా జరిగిన సంక్రాంతి వేడుకల్లో ఎస్పీ బి. ఉమామహేశ్వర్ పాల్గొన్నారు. భోగిమంటల వేడుకల్లో పాలుపంచుకున్న ఎస్పీ సంప్రదాయ ఎడ్లబండిపైకి ఎక్కి పండుగ ఆనందాన్ని రెట్టింపు చేశారు. గంగిరెద్దుల నృత్యాలతో పాటు హరిదాసు కీర్తలను ఆసక్తిగా ఎస్పీ తిలకించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో చిన్నారులు చూపిన ప్రతిభను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు



సరస్ మేళాను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

సరస్‌లో సంక్రాంతి సంబరాలు

గుంటూరు సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పరిధిలోని నల్లపాడు రోడ్డు రెడ్డి కళా శాల సమీపంలో జరుగుతున్న సరస్ మేళా-అఖిల భారత డ్వాక్రా బజార్‌లో భోగి పండుగ సందర్భంగా బుధవారం సంబరాలు కనుల విందుగా నిర్వహించారు. మేళా ప్రాంగణం కళా వేదిక సమీపంలో భోగి మంటలు, సంక్రాంతి చెరుకు గెడలు, గొబ్బెమ్మలు ఏర్పాటు చేసి పండుగ శోభను అద్భుతంగా ఆవిష్కరించారు. పండుగ విశిష్టతను ప్రతిబింబించేలా బొమ్మల కొలువు, రంగురంగుల ముగ్గులతో ప్రాంగణం కళకళ లాడింది. ఆదర్శనగర్‌కు చెందిన షణ్ముఖ కోలాటం బృందం హరిదాసుల వేషధారణతో పాటు మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి పలు భక్తిగీతాలకు కోలాటం చేసి సందర్శకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి కొద్దిసేపు కోలాటం ఆడి బృంద సభ్యులను ఉత్సాహపరిచారు. సంక్రాంతి సంబరాలను వీక్షించేందుకు సందర్శకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముగ్గుల వద్ద ఫోటోలు దిగేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు.

● వ్యాపార సామర్థ్యాల పెంపుదలపై శిక్షణ

సరస్ మేళా శిక్షణ కేంద్రంలో బుధవారం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వ్యాపార సామర్థ్యాల పెంపుదలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ ఎం.మహిపాల్ రెడ్డి శిక్షణ ఇస్తూ, ఎస్‌హెచ్‌జీ మహిళలు సేవా, తయారీ రంగా ల్లో ప్రారంభించగల వ్యాపారాల గురించి వివరించారు. పీఎంఈజీపి, పీఎంఎఫ్‌ఎంఈ, లఖ్‌పత్ దీదీ, ముద్రా యోజన, ఏఐఎఫ్, ఏఎంఐ వంటి పథకాల ద్వారా ప్రభుత్వ రాయితీతో అందించే రుణాలు, దరఖాస్తు విధా నాన్ని తెలియజేశారు. అదేవిధంగా సెర్ప్ ప్రతినిధులు స్వయం సహాయక సంఘాల పుస్తక నిర్వహణపై అవ గాహన కల్పించారు. పరిశ్రమల శాఖ అధికారులు త యారీ రంగ వ్యాపారాల ఏర్పాటు కోసం అవసరమైన ప్రభుత్వ అనుమతులు, ఐపీవో ప్రక్రియల గురించి వివరించారు.



కోలాటం ఆడుతున్న మహిళలు

● సరస్‌ను పరిశీలించిన కలెక్టర్

సరస్ మేళాను బుధవారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పరిశీలించారు. ప్రాంగణంలోని స్టాల్స్, కంట్రోల్ రూం, ఎమ్యూజ్‌మెంట్ పార్క్, ఫుడ్ కోర్ట్, భోజన శాల వద్ద ఏర్పాట్లను తనిఖీ చేసి అధికారులకు సూచనలు అందించారు. పండగ రోజుల్లో ప్రజల రద్దీ కి అనుగుణంగా విధులు కేటాయించిన అధికారులం దరూ పటిష్ట ప్రణాళికతో అవసరమైన అన్ని చర్యలు తీసుకొని బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు.

నేడు విజయవాడ

వెస్ట్ బైపాస్ ట్రయల్ రన్

● కాజ-గొల్లపూడి-చిన్న అవుటుపల్లి మధ్య రాకపోకలకు ఏర్పాట్లు
● ప్యాకేజీ- 4లో ఇప్పటికీ పలుచోట్ల పనులు పెండింగ్ ● పండగ అవసరాలకు తాత్కాలిక ఏర్పాట్లతో అనుమతి
● ప్యాకేజీ-3లో ఇంకా మిగిలే ఉన్న పనులు

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్ట్ బైపాస్‌లో సంక్రాంతి పండుగ రోజున రాకపోకలకు అనుమంతించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జిల్లా కాజ, చినకాకాని జంక్షన్ నుంచి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి మీదుగా చిన్న అవుటుపల్లి టోల్‌గేట్ జంక్షన్ వరకూ వెళ్లేందుకు వీలుగా ఒకవైపు రహదారిని సిద్ధం చేస్తున్నారు. గుంటూరు నుంచి అమరావతి, గొల్లపూడి, విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, ఉత్తరాంధ్ర వైపు వెళ్లేవారికి వీలుగా ఈ నెల 15న రాకపోకలు అనుమతిస్తున్నట్లు ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కాజ టోల్ గేటు వద్ద ఎన్‌హెచ్- 16, వెస్ట్ బైపాస్ అనుసంధాన పనులు ఒకవైపు పూర్తయ్యాయి. వీటిని బుధవారం ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు పరిశీలించారు. అనంతరం గురువారం నుంచి ట్రయల్‌రన్ నిమిత్తం అన్ని రకాల వాహనాలను అనుమతించనున్నారు.

● తాత్కాలిక ఏర్పాట్లతో అనుమతులు

గుంటూరు జిల్లా కాజ, చినకాకాని జంక్షన్ నుంచి ఎన్టీఆర్ జిల్లా చిన్న అవుటుపల్లి టోల్ గేటు వరకూ వెస్ట్ బైపాస్‌ను రెండు ప్యాకేజీలుగా నిర్మిస్తున్నారు. కాజ నుంచి గొల్లపూడి వరకూ ప్యాకేజీ-4 కింద 17.600 కిమీ, గొల్లపూడి నుంచి చిన్న అవుటుపల్లి వరకూ ప్యాకేజీ-3 కింద 30 కిమీ మొత్తం 48.300 కిమీ మేర ఈ బైపాస్‌ను నిర్మిస్తున్నారు. అయితే ప్యాకేజీ-4లో కృష్ణానదిపై 3,120 కిమీ పొడవైన అతిపెద్ద వారధితోపాటు, రాజధాని అమరావతిలోని కృష్ణాయపాలెం, కురగల్లు గ్రామాల మధ్య కొండవీటివాగుపై 300మీ, పాలవాగు మీద 110మీ పెద్ద బ్రిడ్జిని నిర్మించారు. దీంతోపాటు మంగళగిరి సరిహద్దుల్లో ఒక ఆర్వోబీ కూడా వస్తోంది. అయితే ప్యాకేజీకి సంబంధించిన ఈ కీలకమైన పనులు ఎప్పుడో పూర్తయిపోయాయి కాని చాలాచోట్ల సర్వీసు రోడ్లు పూర్తికావాల్సి ఉంది. కొండవీటివాగు బ్రిడ్జి వద్ద కొంతమేర పనులు పెండింగులో ఉన్నాయి. అక్కడ సర్వీసు రోడ్డుద్వారా రాకపోకలకు ఏర్పాటు చేశారు.

● ప్యాకేజీ-3లో రెండువైపులా రాకపోకలు

గొల్లపూడి నుంచి చిన్న అవుటుపల్లి వరకు చేపట్టిన ప్యాకేజీ-3లో కూడా చాలా చోట్ల పనులు పెండింగులో ఉన్నాయి. గొల్లపూడి వద్ద ఇప్పటికీ బైపాస్ నిర్మాణం పూర్తి కాలేదు. అక్కడ సర్వీసు రోడ్లలో రాకపోకలు అనుమతిస్తున్నారు. జక్కంపూడి జంక్షన్, అంబాపురం, విజయవాడ ఇన్నర్ రింగ్ రోడ్డు జంక్షన్ సహా 4 చోట్ల అండర్‌పాస్‌ల నిర్మాణం జరగాల్సి ఉంది. అయితే ఈ రెండు ప్యాకేజీల్లో వెస్ట్ బైపాస్, ఎన్‌హెచ్-16 జంక్షన్ల అనుసంధాన పనులు మాత్రం ఇప్పటికీ పూర్తికాలేదు. గడిచిన వారంలో హడావుడిగా కొంతమేర పనులను పూర్తిచేసి రాకపోకలకు అనుమతిస్తున్నారు. ఈ ట్రయల్ రన్ ద్వారా గుంటూరు నుంచి విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, రాజమండ్రి వైపు వెళ్లేవారికి రాకపోకలు సులభతరమవనున్నాయి. గొల్లపూడి-కాజ రోడ్డు నిర్మాణం ఇంకా పూర్తికాకపోవడంతో అటునుంచి వచ్చే వాహనాలకు మాత్రం అనుమతి లేదని అధికారులు చెబుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సీఐ నాయబ్ రసూల్

వరుస చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు

తెనాలి క్రైం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు సభ్యుల ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్ తెలిపారు. బుధవారం విలేకరుల సమావేశంలో నేరస్థుల వివరాలను సీఐ వెల్లడించారు. గత ఆదివారం రాత్రి తెనాలిలో ఆరు చోట్ల వరుస దొంగతనాలు జరిగాయన్నారు. ఈ చోరీలకు పాల్పడిన గుంటూరు శారదా కాలనీకి చెందిన యువకులు మిక్కిలి సందీప్ (24), పఠాన్ మస్తాన్‌వలి (24)ని నందివెలుగు జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. ఈ ఇద్దరు నేరస్థులు గత ఆరు సంవత్సరాల నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్నారని చెప్పారు. వీరిలో మిక్కిలి సందీప్ 28 కేసుల్లో జైలు శిక్ష అనుభవించగా, పఠాన్ మస్తాన్‌వలి 12 కేసులో జైలుకెళ్లి వచ్చాడన్నారు. గత డిసెంబరులో బెయిల్‌పై జైలు నుంచి బయటకు వచ్చిన వీరు తిరిగి దొంగతనాలకు పాల్పడుతున్నారన్నారు. తెనాలిలో జరిగిన దొంగతనాలను సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా పరిశీలించి వీరిని అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. వీరి నుంచి 8.5 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, రూ.17 వేల నగదు స్వాధీనం చేసుకున్నామని వెల్ల డించారు. విలేకర్ల సమావేశంలో ఎస్ఐ ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559


బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	180, 189, 200
చికెన్ విత్ స్కిన్(కిలో)	350.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	360.00



కొల్లిపర : నృత్య ప్రదర్శన చేస్తున్న డాక్టర్ వినీలా రావు శిష్య బృందం



● చెరుకుపల్లి మండలం తూర్పుపాలెంలో వీఐపీ బరి వద్ద కోడిపందేలు

కాలు దువ్విన కోళ్లు

- ఉమ్మడి జిల్లాలో యథేచ్ఛగా కోడిపందేలు
- భారీగా చేతులు మారుతున్న నగదు
- వరుసగా 5 పందేలు గెలిస్తే బుల్లెట్ బహుమానం
- బరుల వద్దే యథేచ్ఛగా మద్యం అమ్మకాలు
- వీఐపీలకు నాటుకోడి, మటన్ బిర్యానీలు
- కోడి పందేలు ఏర్పాటు చేసిన అధికార పార్టీ నేతలు

(నరసరావుపేట/చెరుకుపల్లి/కొల్లూరు, ఆంధ్రజ్యోతి)

కోడి పందేలు చూడాలన్నా.. పందేలు కట్టాలన్నా... గోదావరి, కృష్ణా జిల్లాలకు వెళ్లాల్సిన అవసరంలేకుండా కొందరు అధికార పార్టీ నేతలు వారి సొంత ప్రాంతాల్లోనే పందేలను ఏర్పాటు చేస్తున్నారు. అధికార పార్టీల నేతల అండతో ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో యథేచ్ఛగా బరులు ఏర్పాటు చేశారు. నరసరావుపేట, రేపల్లె నియోజకవర్గాలతో పాటు పలు ప్రాంతాల్లో కోడి పందేల బరులు అందుబాటులోకి తీసుకొచ్చారు. కొందరు టీడీపీ నేతలు పోలీసుశాఖ హెచ్చరికలు భేఖాతరు చేస్తూ కోడి పందేలు నిర్వహించారు. తమ వద్ద డ్రోన్ కెమెరాలు ఉన్నాయని, ఎక్కడ అక్రమాలు జరిగినా, కోడి పందేలు నిర్వహించినా ఇట్టే అరికడతామంటూ పోలీసు అధికారులు చెబుతున్నారు కాని డ్రోన్ నిఘా నిద్రోతున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. కొందరు యథేచ్ఛగా కోడి పందేలు నిర్వహిస్తున్నా అరికట్టడంతో పోలీసుశాఖ ఘోరంగా విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొల్లూరు: అనంతవరం బరి వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరం



కొల్లూరు బరి వద్ద పందెంగా ఉంచిన కారు

● రాత్రికి రాత్రే బరుల ఏర్పాటు

జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కోడి పందేలు కోసం ఏర్పాటు చేస్తున్న బరులను మంగళవారం (మిగతా 6వ పేజీలో)



బరి వద్దే మద్యం దుకాణం



చెరుకుపల్లి: తూర్పుపాలెంలో కోడిపందేల వద్ద పందెం రాయుళ్ల ద్విచక్రవాహనాలు

వ్యాపారుల సమస్యల పరిష్కారమే చాంబర్ ఆఫ్ కామర్స్ లక్ష్యం

● గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు

గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యాపారవర్గాల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ది ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ నిరంతరం పని చేస్తుందని చాంబర్ శాశ్వత గౌరవాధ్యక్షుడు ఆతుకూరి ఆంజనేయులు తెలిపారు. నగర రైస్ డీలర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ అధ్యక్షుడు లక్ష్మీశ్రీనివాస్, ఉపాధ్యక్షుడు వలివేటి శ్రీకాంత్‌లతో పాటు కార్యవర్గ సభ్యులు బుధవారం ఆంజనేయులను కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ వ్యాపారవర్గాలకు చాంబర్ నిరంతరం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో రైస్ డీలర్స్ నూతన అధ్యక్షుడు లక్ష్మీ శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు తదితరులున్నారు.



ఆంజనేయులను సత్కరిస్తున్న లక్ష్మీశ్రీనివాస్, శ్రీకాంత్

సంక్రాంతి వచ్చింది.. సరదాలు తెచ్చింది..

- సంబరంగా భోగి
- వాడ వాడలా.. భోగి మంటలు
- ఆలయాల్లో శ్రీవారికి కల్యాణోత్సవాలు
- చిన్నారులకు భోగి పండ్లు
- జిల్లా అంతా సంక్రాంతి కోలాహలం



ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన భోగి వేడుకల్లో పాల్గొన్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యే గల్లా మాధవి



నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

(గుంటూరు, తెనాలి - ఆంధ్రజ్యోతి)

హరిదాసు కీర్తనలు...గంగిరెద్దుల నర్తనలు...రంగవల్లుల సోయగాలు.. గొబ్బెమ్మల కోలాటాలు...కొత్త అల్లుళ్ల సందళ్లు... కొంటె మరదళ్ల సరదాలు... ప్రతి ఇంటా ఎటు చూసినా పండుగ సంబరాలు. గడప గడప లో ఆనంద పరవశాలు. తెలుగు లోగిళ్లలో ఎటు చూసినా సంక్రాంతి వెలుగు జిలుగులు కనిపిస్తున్నాయి. ఓ వైపు సంప్రదాయ కోడి పందేలు, మరో వైపు పోట్లగిత్తల బల ప్రదర్శనలు పట్టణాల సంగతెలా ఉన్నా పల్లెలు మాత్రం పండుగ కళతో వెలిగిపోతున్నాయి. పంట చేతికొచ్చిన ఆనందంలో అన్నదాతలు అపురూపంగా జరుపుకునే ఈ పండుగ ఎంతో ప్రత్యేకం. భానుడు మకర రాశిలోకి ప్రవేశిస్తూ వెదజల్లుతున్న కాంతి కిరణాలు నూతన ఉత్సాహాన్ని అందిస్తున్న వేళ సరికొత్త ఆశలతో, నూతనోత్తేజంతో తెలుగు లోగిళ్లు పరవళ్లు తొక్కుతున్నాయి.

● బంధువుల రాకతో కళకళ

సంక్రాంతి పండుగలో మొదటి రోజైన భోగిని అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరు పుకున్నారు. దూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన వారు స్వగ్రామల్లో మిత్రులు కుటుంబసభ్యులతో కలసి భోగి మంటలు వేసి ఒకరికొకరు అభినందనలు తెలుపుకు న్నారు. పిండి వంటల ఘుమ ఘుమలు, బం ధువులు, కుటుంబసభ్యుల సందడితో పల్లెలు శోభిల్లాయి. కుల మతాలకు అతీతంగా సం క్రాంతి రైతులు, వ్యవసాయ కూలీలు జరు పుకునే పండుగ కావడంతో అన్ని వర్గాల ప్రజలు ఘనంగా జరుపుకుం టున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారితో పాటు బంధువు ల రాకతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెల కొంది. పల్లెల్లో ముగ్గుల పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడలు నిర్వహిం చారు. భోగి మంటల అనంతరం దేవాలయాలకు భక్తులు తరలివెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. మహిళలు తమ ఇళ్ల ముందు ఒకరికొకరు పోటీ పడి భోగి ముగ్గులతో వాకిళ్ల ను అందంగా తీర్చిదిద్దారు. ఆ ముగ్గుల్లో గొబ్బెమ్మల ను అలంకరిం చారు. చిన్నా పెద్దా తారతమ్యం లేకుండా గాలి పటాలను ఎగుర వేసి (మిగతా 6వ పేజీలో)





గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సాంస్కృతి కార్యక్రమంలో శాస్త్రీయ నృత్యం



టగ్ ఆఫ్ వార్ పోటీల్లో పాల్గొన్న పురుషులు, మహిళలు



గంగిరెద్దు విన్యాసం

రోడ్లపై రోడ్లు..

పైపులైన్లు తొలగించకుండా కాల్వలు

- నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల తీరిది
- కాలువ గుంతలతో ఇళ్లపై రూ. 50 వేల భారం



శ్రీ లక్ష్మినగర్‌లో రోడ్డుపై రోడ్డు నిర్మించి పైపులైను కోసం ఒక ఎక్కన తవ్వేశారు

నగరంలో ఇటీవలకాలంలో రూ. 500 కోట్లకు పైగా అంచనా విలువ చేసే అభివృద్ధి పనులను నగరపాలక సంస్థ ఆమోదం తెలిపింది. ప్రస్తుతం ఏ డివిజన్‌కు వెళ్లి చూసినా సీసీ, బీటీ రోడ్లు, సైడు కాలువలు, అవుట్ ఫాల్ డ్రెయిన్ల నిర్మాణాలు జరుగు తున్నాయి. అయితే నిబం ధనలకు ఇంజనీరింగ్ అధికారులు పాతరేసి నిర్మాణాలు చేపడుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అలాగే కాలువల కోసం తీసిన గుంతల వల్ల తమపై రూ. వేల భారం పడుతోందని ఇళ్ల యజమానులు వాపోతున్నారు.

గుంటూరు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ నిబంధనల ప్రకారం ఒక రోడ్డుపై మరో రోడ్డును నిర్మించకూడదు. ఒకవేళ అలా చేస్తే కొద్ది రోజుల్లోనే పైన నిర్మించిన రోడ్డు వాహనాల రాకపోకలతో గుంతలమయంగా మారిపోతుంది. నల్లపాడు రోడ్డులో నల్లకుంటకు ఎదురుగా ఉన్న రోడ్డు మార్గంలో సీసీ రోడ్డుపై హాట్ మిక్స్‌తో రోడ్డు వేశారు. దీని వల్ల అది చాలా చోట్ల కొట్టుకుపోయి గుంతలమయంగా మారింది. మస్తాన్‌దర్గా వెనుక వీధి హాట్‌మిక్స్ రోడ్డు కాగా దానిపై సీసీ వేశారు. శారదా కాలనీలో అయితే సిమెంట్ రోడ్లు గుంతలు లేకుండా బావుండగా వాటిపై ఇప్పుడు మళ్లీ సీసీ రోడ్లు వేస్తున్నారు. నల్లచెరువులోనూ పలు వీధుల్లో ఉన్న రోడ్లపై సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. అరండల్‌పేట 9వ లైనులోనూ ఇదే పరిస్థితి. ఇందుకోసం తొలుత జీఎస్‌బీ (గ్రాన్యూలార్ సబ్‌బేస్) వేసి దానిపై సిమెంట్ కాంక్రీట్ రోడ్డు వేస్తున్నారు. కొన్ని చోట్లయితే కింద సీసీ రోడ్లు ఉండగా వాటిపై హాట్‌మిక్స్‌తో రోడ్డు వేస్తున్నారు.

● లోపాలు సరిదిద్దకుండా డ్రెయిన్ల నిర్మాణం

ఇక గత వర్షాకాలంలో నగరమంతటా డ్రైనేజీ సమస్య తలెత్తి వర్షం నీరు రోడ్లను ముంచెత్తింది. అపార్టుమెంటు సెల్లార్లు, గుంటూరు రైల్వేస్టేషన్ సబ్‌వేలోకి సీపేజ్ వచ్చింది. అలానే మేజర్ డ్రెయిన్లపై సిమెంట్ కాంక్రీట్ శ్లాబులు నిర్మించి మూసేయడం వల్ల సిల్టు బాగా పేరుకుపోయింది. అలానే డ్రెయిన్లలో అడ్డంగా ఉన్న పైపులైన్ల వల్ల చెత్తా, చెదారాలు ప్రవహించక అడ్డు పడటంతో వర్షం కురిసినప్పుడు ఆ నీరు ముందుకు ప్రవహించక రోడ్లను ముంచెత్తింది. ఈ లోపాలన్నింటిని సరిదిద్దకుండా నగరపాలకసంస్థ రూ. వందల కోట్లతో నూతన డ్రెయిన్ల నిర్మాణం చేపట్టింది. చుట్టుగుంట, ఐటీసీ, దేవాపురం, కోబాల్డ్‌పేట, లక్ష్మీపురం, నల్లచెరువు తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లలోని పైపులైన్లు తొలగించకుండానే పనులు పూర్తి చేస్తున్నారు. దీని వల్ల వర్షాకాలంలో చెత్త, చెదారం వచ్చి ఈ పైపులైన్ల వద్ద నిలిచి వరదనీరు ఉప్పొంగే అవకాశముంది. ఇప్పటికే కొత్తగా నిర్మించిన డ్రెయిన్లలో చాలా చోట్ల మురుగునీరు ప్రవహించడం లేదు. డ్రెయిన్లపై తొలగించిన ఆక్రమణలు మళ్లీ పుట్టుకొస్తున్నాయి. కాగా డ్రెయిన్ల నిర్మాణం వల్ల వాటిపై ర్యాంపులు, మెట్లు నిర్మించుకునేందుకు ఒక్కో ఇంటికి రూ. 50 వేలకు పైగా ఖర్చు అవుతున్నట్లు ఇళ్ల యజమానులు వాపోతున్నారు.

● అభివృద్ధి పనులతో కొత్త సమస్యలు

డ్రెయిన్ టూ డ్రెయిన్ నిర్మాణంలో భాగంగా రోడ్ల పక్కన



చుట్టుగుంట వద్ద పైపులైన్లు తొలగించకుండా డ్రెయిన్లు, కల్వర్టు నిర్మాణం



శారదాకాలనీ 27వ లైనులో సిమెంట్ రోడ్డు బాగానే ఉన్నప్పటికీ దీనిపై కొత్త రోడ్డు శాంక్షన్ చేశారు...

ఉన్న చెట్లను తొలగిస్తున్నారు. రోడ్డు నిర్మించిన తర్వాత మళ్లీ ఇరువైపులా గుంతలు తవ్వి మొక్కలు నాటుతున్నారు. వీటిల్లో చాలావరకు చనిపోతున్నాయి. సీసీ రోడ్డుపై మరో కొత్త రోడ్డు వేయడం వల్ల ఇళ్లల్లో ఉండే కుళాయి పైపులైన్లు ఆరు నుంచి ఏడడుగుల కిందికి వెళ్లిపోతున్నాయి. రేపటి రోజున పైపులైను లీకు ఏర్పడితే రోడ్డును ధ్వంసం చేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇళ్లు రోడ్డు కంటే పల్లం అయిపోతున్నాయి. దీని వల్ల వర్షం కురిస్తే కాలువల్లోని నీరంతా ఇళ్లలోకి చేరుతుంది. శ్రీ లక్ష్మినగర్ మెయిన్‌రోడ్డులో ఇటీవలే సీసీ రోడ్డుపై కొత్త సీసీ రోడ్డు నిర్మించారు. ఇప్పుడు కొత్తగా పైపులైను నిర్మాణం కోసం ఆ రోడ్డును ఒక పక్కన తవ్వారు. యూజీడీ కోసం రోడ్ల మధ్యన పైపులైన్లు నిర్మించి మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. ఇప్పుడు వాటిని పూర్తిగా కప్పేసి దానిపై సీసీ రోడ్డు వేస్తున్నారు. రేపటి రోజున ఈ మ్యాన్‌హోల్స్ ఎక్కడుంటాయో తెలియని పరిస్థితి. అక్కడ రోడ్లు గుంతలు లేకుండా బాగానే ఉన్నాయి. అయినప్పటికీ వాటిపై కొత్తగా సీసీ రోడ్లను నిర్మిస్తున్నారు. సైడు కాలువల్లో అడుగున అడ్డంగా తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. అయినప్పటికీ వాటిని తొలగించకుండా డ్రెయిన్లు నిర్మించేస్తున్నారు. అంతేకాకుండా నిర్మించిన డ్రెయిన్లపై కొన్ని చోట్ల సిమెంట్ కాంక్రీట్ శ్లాబులు కూడా వేసి కప్పేస్తున్నారు. ఇలా పూర్తి చేసిన పనులు మహా అయితే ఒక వర్షాకాలాన్ని తట్టుకోగలవు. ఆ తర్వాత యథా స్థితికి చేరుకుంటాయన్నది బహిరంగ రహస్యమే. ఇప్పటి వరకు జరిగిన పనులను ఉన్నతాధికారులు పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాకు యూరియా ఎరువుల నిల్వలు

● తాజాగా 2564 మెట్రిక్ టన్నులు సరఫరా

గుంటూరు సిటీ, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లాలో రైతుల అవసరాల నిమి త్తం యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి ముళ్లపూడి పద్మావతి, ఏడీఏ నాగ భైరు మోహన్‌రావు తెలిపారు. రెడ్డిపాలెం స్టాక్ పాయింట్‌కు బుధవారం ఇఫ్కో యూరియా చేరినట్లు చెప్పారు. దీనితో మొ త్తం 2,564 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాలకు అందినట్లు తెలిపారు. అందులో మార్క్ ఫెడ్‌కు 1,280 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్లకు 1,284 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు వెల్ల డించారు. జిల్లాల వారీగా యూరియా పంపిణీ వివరాలు పరిశీలిస్తే.. గుంటూరు జిల్లాకు 850 మెట్రిక్ టన్నులు, బాపట్ల జిల్లాకు 644 మెట్రిక్ టన్నులు, పల్నాడు జిల్లాకు 570 మెట్రిక్ టన్నులు, ప్రకాశం జిల్లాకు 500 మెట్రిక్ టన్నులు కేటాయించినట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువుల సరఫరా నిరంత రంగా కొనసాగుతుం దని, క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేపడుతున్నామని స్పష్టం చేశారు.



యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఏడీఏ మోహన్‌రావు



మంచు దుప్పట్లో విజయవాడ....



భోగి పండుగ రోజు ఉదయాన్నే విజయవాడను పొగమంచు కమ్మేసింది. ఉదయం ఎనిమిది గంటలైనా దట్టంగా అలుముకున్న మంచు నగరాన్ని వీడలేదు. బెంజ్‌సర్కిల్ ఫ్లైఓవర్, కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంతాల్లో దృశ్యాలివి..

పెరిగిన చలి

మంచులో వాహనాల రాకపోకలకు అంతరాయం

తిరుపతిలో పలు విమానాలు ఆలస్యం

విశాఖపట్నం/రేణిగుంట, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఉత్తర, మధ్య భారతంలో వీస్తున్న అతి శీతల గాలుల ప్రభావంతో రాష్ట్రంలో చలి స్వల్పంగా పెరిగింది. దీనికితోడు అనేకచోట్ల దట్టంగా మంచు కురిసింది. దీంతో ఉదయం పూట వాహన రాకపోకలకు అంతరాయం కలిగింది. బుధవారం అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయలో 7.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న రెండు రోజుల్లో చలి తీవ్రత పెరుగుతుందని, అనేకచోట్ల మంచు కురుస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. ఉదయం పూట వాహనచోదకులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. పొగమంచు కారణంగా తిరుపతి విమానాశ్రయానికి బుధవారం పలు విమానాలు ఆలస్యంగా వచ్చాయి. హైదరాబాద్ నుంచి ఉదయం 7.15 గంటలకు రావాల్సిన ఎయిర్ అలయన్స్ విమానం 8.10 గంటలకు వచ్చి, 9గంటలకు తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరింది. హైదరాబాద్ నుంచి ఉదయం 7.40 గంటలకు రావాల్సిన ఇండిగో విమానం గంట ఆలస్యంగా వచ్చింది. 9.30 గంటలకు తిరుగు ప్రయాణమైంది. సాయంత్రం ముంబై నుంచి తిరుపతి మీదుగా హైదరాబాద్, అలాగే బెంగళూరు నుంచి తిరుపతి మీదుగా విజయవాడకు ప్రయాణించాల్సిన ఇండిగో విమానాలు 40 నిమిషాలు ఆలస్యంగా నడిచాయి.

ఘంటసాల పోలీస్‌స్టేషన్‌పై యువకుల దౌర్జన్యం

- ఎస్ఐతో పాటు సిబ్బందిపై దూషణలు.. దాడి
- పోలీసుల అదుపులో నలుగురు, మరో ముగ్గురు పరార్



ఘంటసాల పోలీస్‌స్టేషన్

ఘంటసాల, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): కర్రీ పాయింట్ దగ్గర మొదలైన గొడవ పోలీస్‌స్టేషన్‌పై దౌర్జన్యం చేసేవరకూ వెళ్లింది. కృష్ణా జిల్లా, ఘంటసాలలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఏడుగురు యువకులు స్థానిక ఎస్ఐతో పాటు స్టేషన్ సిబ్బందిపై భౌతిక దాడి చేశారు. స్థానికుల కథనం మేరకు, సత్రవ సెంటరు సమీపంలోని వేములపల్లి రాధాకృష్ణ షాపింగ్ ప్రాంగణంలో షేక్ మాలింబి కర్రీ పాయింట్ నడుపుతోంది. అంబేడ్కర్ నగర్‌కు చెందిన కాళింగి సాయికృష్ణ, దగాని వంశీ అనే యువకులు బుధవారం మధ్యాహ్నం సమయంలో కూరలు కొనే విషయంలో ఆమెతో గొడవపడ్డారు. ఇది గమనించిన షాపు యజమాని రాధాకృష్ణ యువకులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అయితే ఈ సమయంలో ఆ యువకులు నెట్టివేయటంతో రాధాకృష్ణ ఎడమ కాలికి గాయమైంది. ఈ గలాటా సమాచారం తెలియడంతో ఎస్ఐ ప్రతాపరెడ్డి వెంటనే కానిస్టేబుల్ జోగయ్య, హోంగార్డు శ్రీనివాసులను ఘటనా స్థలానికి పంపారు. వివరాలు తెలుసుకునే సమయంలో పోలీస్ సిబ్బందిపై కూడా యువకులు దౌర్జన్యానికి దిగారు. అంతేగాక షాపింగ్ ప్రాంగణమంతా అల్లకల్లోలం చేశారు. ఘంటసాల పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లే సమయంలో ఆ యువకులు తమ స్నేహితులకు సమాచారం ఇచ్చారు. స్టేషన్‌కు వెళ్లే సమయానికి సాయికృష్ణ, వంశీల స్నేహితులు మరో ఐదుగురు స్టేషన్ వద్దకు వచ్చారు. వీరంతా కలిసి స్టేషన్ వద్ద హంగామా సృష్టించారు. వాళ్లని సముదాయించడానికి వచ్చిన ఎస్ఐ, పోలీస్ సిబ్బందిని అసభ్య పదజాలంతో దూషించారు. తర్వాత ఎస్, సిబ్బందిపై భౌతిక దాడి చేశారు. ఈ గొడవ అంతా సీసీ కెమెరాలో రికార్డు అయినట్లు సమాచారం. స్టేషన్‌పై దౌర్జన్యానికి దిగిన ఏడుగురిలో నలుగురిని పోలీసులు అదుపులోకి తీసుకోగా, ముగ్గురు మాత్రం పరారయ్యారు. పరారైన వారిలో గొడవకు కారణమైన సాయికృష్ణ, వంశీ ఉన్నట్లు తెలుస్తోంది. వారి కోసం గాలింపు చేపట్టారు. ఈ దాడి విషయం తెలుసుకున్న అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి శ్రీవిద్య, చల్లపల్లి సీఐ కె.ఈశ్వరరావు ఘంటసాల వచ్చి వివరాలు సేకరించారు.

పత్తి రైతుకు సర్కారు అండ

సీఎం చొరవతో సీసీఐ నిబంధనల సడలింపు

- రాష్ట్రవ్యాప్తంగా పెరిగిన కొనుగోళ్లు
- ఇప్పటికి 3.22 లక్షల క్వింటాళ్ల సేకరణ
- 71,710 మందికి దక్కిన మద్దతు ధర
- ప్రైవేటు వ్యాపారులూ అధిక ధర ఆఫర్
- రాయలసీమకు ఎక్కువ లబ్ధి



(గుంటూరు-ఆంధ్రజ్యోతి)

మొంథా తుఫాన్ కంటే ముందే ఆరంభమైన ప్రకృతి విపత్తులు ఈ ఏడాది రాష్ట్ర వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా ప్రభావితం చేశాయి. ముఖ్యంగా పత్తి సాగు ప్రాంతాల్లో వర్షాలు, గాలులు, తేమ ప్రభావం దిగుబడితోపాటు నాణ్యతపైనా పడింది. పంట చేతికొచ్చే సమయానికి మార్కెట్‌లో ధరలు పడిపోతాయన్న భయం రైతులను వెంటాడింది. అటువంటి సంక్షోభ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన నిర్ణయాలతో పత్తి రైతుకు అండగా నిలిచింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ సీసీఐ(కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) ద్వారా మద్దతు ధరకు పత్తి కొనుగోళ్లు జరిగేలా రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపింది. అయితే సీజన్ ప్రారంభంలో పరిస్థితి అంత అనుకూలంగా లేదు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాలు, సాంకేతిక నిబంధనల పేరుతో సీసీఐ కొనుగోళ్లలో ముందడుగు వేయలేదు. దీంతో రైతులు తమ పంటను ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరకు అమ్మాల్సి వస్తుందన్న ఆందోళనలో పడ్డారు. క్వింటా పత్తిని రూ.4 వేల నుంచి రూ.5500కు కూడా రైతులు అమ్ముకోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్షించారు. జిల్లాల నుంచి వచ్చిన నివేదికలను పరిశీలించిన అనంతరం రాష్ట్రంలో పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ కేంద్రానికి లేఖ రాశారు. అసాధారణ వాతావరణ పరిస్థితుల దృష్ట్యా నిబంధనల్లో సడలింపులు ఇవ్వాలని, సీసీఐ కొనుగోళ్లను వేగవంతం చేయాలని సీఎం చేసిన విజ్ఞప్తిపై కేంద్రం స్పందించింది. దీంతో సీసీఐ తన వైఖరిని మార్చుకొని కొనుగోళ్లను విస్తరించింది. ఈనెల 5వ తేదీనాటికి గుంటూరు జిల్లాలో 3,314 మంది రైతుల నుంచి 22,793 క్వింటాళ్ల పత్తిని సీసీఐ కొనుగోలు చేసింది. కర్నూలు జిల్లాలో 20,992 మంది రైతుల నుంచి 6,54,933 క్వింటాళ్లు సేకరించింది. విజయనగరం జిల్లాలో 433 మంది రైతుల నుంచి 6,730 క్వింటాళ్లు, మన్యం జిల్లాలో 682 మంది రైతుల నుంచి 10,306 క్వింటాళ్లు, ఎన్‌టీఆర్ జిల్లాలో 5,295 మంది రైతుల నుంచి 3,67,661 క్వింటాళ్లు, పల్నాడు జిల్లాలో 3,979 మంది రైతుల నుంచి 2,70,994 క్వింటాళ్లు, నంద్యాల జిల్లాలో 922 మంది రైతుల నుంచి 70,084 క్వింటాళ్లు కొనుగోలు చేసింది. పత్తి సాగు విస్తీర్ణం అధికంగా ఉన్న అనంతపురం జిల్లాలో రికార్డు స్థాయిలో కొనుగోళ్లు జరిగాయి. అక్కడ 36,093 మంది రైతుల నుంచి 16,16,688 క్వింటాళ్ల పత్తిని సీసీఐ తీసుకుంది. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 71,710 మంది రైతులకు సీసీఐ ప్రకటించిన మద్దతు ధర లభించింది. సీసీఐ కేంద్రాల్లో పత్తి క్వింటాల్‌కు రూ.8,110(మొదటి శ్రేణి నాణ్యత), దిగువ శ్రేణి నాణ్యత కలిగిన పత్తికి రూ.7,710 వరకు మద్దతు ధర లభించింది. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది పత్తి కొనుగోళ్లు గణనీయంగా పెరగడం, ముఖ్యంగా విపత్తుల వేళ నిబంధనలు సడలించి కొనుగోళ్లు చేయడం రైతులకు ఊరట నిచ్చింది. కేంద్రంతో సమన్వయం, రాష్ట్ర స్థాయిలో వేగవంతమైన నిర్ణయాలు తీసుకోవడం వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయి.

ఆదోని మార్కెట్ కళకళ ..

ఈ ఏడాది ఇప్పటి వరకు సీసీఐ కొనుగోలు చేసిన పత్తిలో ఎక్కువ భాగం రాయలసీమదే కావడం గమనార్హం. రాష్ట్ర వ్యాప్తంగా 3.22 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయగా, ఆదోని మార్కెట్ నుంచి ఎక్కువ సేకరణ జరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. సీసీఐ మద్దతు ధరకు దీటుగా రేటు చెల్లించేందుకు ఇక్కడి ప్రైవేట్ వ్యాపారులు ముందుకు రావటం శుభ పరిణామంగా కనిపిస్తోంది.

ప్రభుత్వ చొరవ వల్లే: ఇక్కుర్తి, మన్నవ

ఈ ఏడాది సీజన్ ఆరంభంలోనే సీసీఐకి, రాష్ట్రంలోని పత్తి మిల్లుల యాజమాన్యాలకు మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడిందని ఏపీ కాటన్ టీఎంసీ కన్సార్టియం అధ్యక్షుడు ఇక్కుర్తి శివప్రసాద్, సంయుక్త కార్యదర్శి మన్నవ హరినాథ్‌బాబు తెలిపారు. ఆ సందర్భంలో రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేసిందన్నారు. సీఎం కేంద్రానికి లేఖ రాయడంతోపాటు, వ్యవసాయ మంత్రి అచ్చెనాయుడు, మార్కెటింగ్ డైరెక్టర్ విజయసునీత అనేక మార్లు సీసీఐ అధికారులతో సమావేశాలు జరిపారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ చొరవ వల్లే ఎక్కువ మొత్తంలో పత్తి కొనుగోలుకు అవకాశం ఏర్పడిందని, లేకుంటే పత్తి రైతుకు కోలుకోలేని దెబ్బ తగిలేదని పేర్కొన్నారు.



అనంతపురం జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు జరుగుతున్న దృశ్యం

4 నెలల్లోనే అనుమతుల నుంచి నిర్మాణ దశకు!

- ఏసీఎంఈ గ్రూప్ సోలార్ ప్లాంట్‌పై లోకేశ్ స్పందన

అమరావతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఏసీఎంఈ గ్రూప్ అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేస్తున్న 400 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతుండటంపై రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, విద్యాశాఖ మంత్రి లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. రూ.3వేల కోట్ల వ్యయంతో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్టు కేవలం 4 నెలల్లోనే అన్ని అనుమతులు పొంది నిర్మాణ దశకు చేరుకుందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇంటిగ్రేటెడ్ బ్యాటరీ స్టోరేజితో సిద్ధమవుతున్న ఈ సోలార్ ప్రాజెక్టు ఈ ఏడాది చివరికి సోలార్ విద్యుత్తును ఉత్పత్తి చేయనుందని, ఏసీఎంఈ ఈ ప్రాజెక్టు పనులను వేగంగా చేయడం చాలా సంతోషాన్నిస్తోందని లోకేశ్ పేర్కొన్నారు.

విద్యా శాఖ ఉత్తర్వులపై పీఎస్‌హెచ్‌ఎం ఫోరం నిరసనలు

అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయుల విధులపై ఇటీవల పాఠశాల విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులపై పీఎస్‌హెచ్‌ఎం ఫోరం నిరసనలు చేపట్టింది. ఉత్తర్వుల కాపీలను రాష్ట్రంలోని పలుచోట్ల భోగి మంటల్లో వేసి హెచ్‌ఎంలు నిరసన తెలిపారు. తమకు జరుగుతున్న అన్యాయంపై విద్యాశాఖ అధికారులు, మంత్రులు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేయనున్నట్లు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ తెలిపారు. పీఎస్‌హెచ్‌ఎంలను పరిపాలనా విధులకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. ఈ మేరకు పూర్తిస్థాయి జాబ్ చార్ట్ విడుదల చేయాలన్నారు. కాగా ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల ఆవరణల్లో ఉన్న మోడల్ ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎంలు సాధారణ టీచర్ల తరహా విధులు నిర్వర్తించాలని, ఉన్నత పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు పరిపాలనా బాధ్యతలు తీసుకుంటారని ఇటీవల పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ఆర్థిక అంశాలపై దశలవారీ ఉద్యమం: ఎస్టీయూ

అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): పీఆర్‌సీ అమలు, మధ్యంతర భృతి మంజూరు, ఆర్థిక బకాయిల చెల్లింపులపై మేనిఫెస్టో అమలు చేయాలని కోరుతూ దశలవారీ ఉద్యమ చేపడుతున్నట్లు రాష్ట్రోపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మల్లు రఘునాథరెడ్డి, ఎల్.సాయి శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 'సీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని, మెరుగైన పీఆర్‌సీ అమలు చేస్తామని, అధికారంలోకి రాగానే ఐఆర్ ప్రకటిస్తామని కూటమి మేనిఫెస్టోలో పొందుపరిచింది. సీపీఎస్‌పై ప్రభుత్వం ఇంతవరకూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో చర్చలు జరపలేదు. 2003 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటుపై జాప్యం చేస్తున్నారు. ఈ డిమాండ్లపై ఈనెలాఖరున మండల స్థాయిలో, ఫిబ్రవరి మొదటి వారంలో జిల్లా కలెక్టరేట్ల వద్ద, బడ్జెట్ సమావేశాల సమయంలో చలో విజయవాడ కార్యక్రమాలు చేపడతాం. ఈ ఉద్యమంలో ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలి' అని వారు పిలుపునిచ్చారు.

రోశయ్య కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు పరామర్శ

అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం, మాజీ గవర్నర్ దివంగత కొణిజేటి రోశయ్య కుటుంబ సభ్యులకు సీఎం చంద్రబాబు ఫోన్ చేసి పరామర్శించారు. సోమవారం తెల్లవారుజామున రోశయ్య సతీమణి శివ లక్ష్మి కన్నుమూశారు. ఈ సందర్భంగా రోశయ్య కుమారుడు శివతో సీఎం ఫోన్లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రోశయ్య కుటుంబంతో తనకున్న అనుబంధాన్ని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

ప్రైవేట్ బస్సుల్లో ఉల్లంఘనలపై స్పెషల్ డ్రైవ్

- నిబంధనల అతిక్రమణ, అధిక చార్జీలపై 850 కేసులు
- ఆరు రోజుల్లో 41.77 లక్షల జరిమానా వసూలు
- వివరాలు వెల్లడించిన ఆర్టీసీ అధికారులు

విజయవాడ (బస్‌స్టేషన్), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా ప్రైవేట్ బస్సులపై ప్రజా రవాణా సంస్థ ప్రత్యేక దృష్టి పెట్టింది. ట్యాక్స్‌లు ఉల్లంఘన, అనుమతులు లేకపోవటంతో పాటు అధిక ఛార్జీలు వసూలు చేసిన కాంట్రాక్టు క్యారేజీ బస్సుల యజమానుల నుంచి రాబట్టిన కాంపౌండ్ ఫీజు వివరాలను బుధవారం ఆర్టీసీ ఉన్నతాధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 9 నుంచి 14వ తేదీ (బుధవారం) వరకు నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో ఆ బస్సుల ఉల్లంఘనలకు సంబంధించి 850 కేసులు నమోదు చేసి రూ. 41,77,280 జరిమానా వసూలు చేశారు. అధిక చార్జీల విషయంలో 265 కేసులు నమోదు చేసి రూ. 26,25,250 ఫైన్ వేశారు. ఈ కేసులు అత్యధికంగా పశ్చిమ గోదావరి జిలా (59) నమోదయ్యాయి. పన్నులు, అనుమతులకు సంబంధించి 41 కేసులు పెట్టారు. ఇక అనుమతులు, పన్నుల చెల్లింపు తదితర అంశాల కేసుల్లో ఎన్టీఆర్ జిల్లా టాప్‌లో ఉంది. ఇక్కడ 92 కేసులు నమోదు చేసి రూ. 3,63,659 జరిమానా వసూలు చేశారు. అధిక చార్జీల విషయంలో కేవలం రెండు కేసులు మాత్రమే నమోదయ్యాయి. కాగా, బుధవారం ఒక్కరోజే అన్ని జిల్లాల్లో అధిక చార్జీలకు వసూలుకు సంబంధించి 50 కేసులు నమోదు కాగా, కాంపౌండు ఫీజు కింద రూ.4,61,200 వసూలు చేశారు. అనుమతులు, పన్నుల చెల్లింపు విషయాలకు సంబంధించి అన్ని జిల్లాల్లో కలిపి 134 కేసులు నమోదు చేశారు. కాంపౌండు ఫీజు కింద రూ. 3,79,300 వసూలు చేసినట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

ముగిసిన ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ అంత్యక్రియలు

హైదరాబాద్, అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్రశర్మ సతీమణి, ప్రముఖ కవయిత్రి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ అంత్యక్రియలు బుధవారం జరిగాయి. ఉదయం 10-30 గంటకు అంతిమ యాత్ర అంబర్‌పేట శ్మశానవాటికకు చేరుకుంది. 11-30 గంటలకు ప్రక్రియ పూర్తయింది. అంత్యక్రియల్లో బంధువులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ఇందిరాదేవి ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కల్యాణ్

'ప్రఖ్యాత కవి గుంటూరు శేషేంద్రశర్మ సతీమణి, ప్రముఖ కవయిత్రి ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ తుదిశ్వాస విడిచారని తెలిసి చింతిస్తున్నా. హిందీ, ఉర్దూ, ఆంగ్ల భాషల్లో పాండిత్యం సంపాదించిన ఆమె చేసిన సాహితీ సేవ విలువైనది. గుంటూరు శేషేంద్రశర్మ సతీమణిగా ఆయన సాహితీ యాత్రలో ఇందిరాదేవి పాత్ర చిరస్మరణీయం. ఇందిరాదేవి ధన్‌రాజ్‌గిర్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నా' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

వైద్యవిద్యలో పీజీ చేసినా.. సర్జరీ చేసే సత్తా లేదు



శస్త్రచికిత్స చేయాలంటే తమపై తమకే నమ్మకం లేదంటున్న 50.5 శాతం మంది డాక్టర్లు

- 70 శాతం పీజీలకు నిర్దిష్ట పనివేళలు లేవు
- 62 శాతం మందికి స్టైపెండ్ ఆలస్యం
- కొత్త వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల లేమి
- 'ఫైమా- ఆర్ఎంఎస్' సర్వే సంచలన నివేదిక
- దేశవ్యాప్తంగా 2వేల మందికి పైగా మెడికోలు, డాక్టర్లతో సర్వే
- ఎన్ఎంసీకి నివేదిక.. తక్షణమే సంస్కరణలు చేపట్టాలని వినతి

హైదరాబాద్, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు ఎంబీబీఎస్ చేసిన డాక్టర్లు సైతం పలు రకాల సర్జరీలు చేయగలిగేవారు. ఇప్పుడు పోస్ట్ గ్రాడ్యుయేట్ చేసినా కత్తి పట్టుకునేందుకు యువ వైద్యుల చేతులు వణుకుతున్నాయని... గైనకాలజీ చేసినా సిజేరియన్ చేయలేని దుస్థితిలో చాలా మంది ఉంటున్నారని.. తాజా సర్వేలో వెల్లడైంది. పీజీ పూర్తి చేసిన వైద్యుల్లో 50.5 శాతం మంది.. సొంతంగా సర్జరీ చేసే విషయంలో తమపై తమకే నమ్మకం కలగట్లేదని ఈ సర్వేలో చెప్పడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. ఇండియాలో వైద్య విద్య ప్రమాణాలు, మెడికల్ కాలేజీల్లో మౌలిక సదుపాయాలు, మెడికోల మానసిక ఆరోగ్యంపై 'ఫెడరేషన్ ఆఫ్ ఆలిండియా మెడికల్ అసోసియేషన్' (ఫైమా) నిర్వహించిన రివ్యూ మెడికల్ సిస్టమ్(ఆర్ఎంఎస్) సర్వే -2025లో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, యూనియన్ టెరిటరీలకు చెందిన 2,000 మందికి పైగా మెడికల్ విద్యార్థులు, పీజీ రెసిడెంట్లు, ఫ్యాకల్టీని ఈ సర్వేలో భాగంగా ప్రశ్నించారు. సర్వే నివేదికను ఫైమా బుధవారం జాతీయ వైద్య కమిషన్(ఎన్ఎంసీ) చైర్మన్‌కు అందజేసింది. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని.. వైద్య విద్యలో తక్షణ సంస్కరణలను అమలు చేయాలని విజ్ఞప్తి చేసింది.

ప్రమాదంలో మెడికోల మానసిక ఆరోగ్యం

దేశవ్యాప్తంగా చాలా కాలేజీలు యాంటి రాగింగ్ నిబంధనలు పాటించడం లేదు. అలాగే మెడికోలకు కౌన్సెలింగ్ సౌకర్యాలు లేవు. వారికి మానసిక ఆరోగ్యంపై సాయమందించే వ్యవస్థ లేదని ఫైమా సర్వేలో వెల్లడైంది. సర్వే ప్రకారం ఇలా 54.4 శాతం మంది మెడికల్ విద్యార్థులకు మానసిక ఆరోగ్య సహాయం అందడం లేదు. ప్రతి కాలేజీలో మెంటల్ హెల్త్ కమిటీ, 24 గంటల హెల్ప్‌లైన్, ప్రతి 500 మందికి 2 మంది కౌన్సిలర్లు, తప్పనిసరిగా ఉండాలని ఫైమా సూచించింది.

వసతుల లేమి..

కొత్తగా ఏర్పాటవుతున్న వైద్య కళాశాలల్లో ఎన్ఎంసీ నిబంధనల మేరకు మౌలిక సదుపాయాలు ఉండట్లేదని ఫైమా సర్వేలో వెల్లడైంది. ప్రధానంగా తాగునీరు, లైబ్రరీలు, ల్యాబ్‌లు, హాస్టళ్లు, తగినంత మంది భద్రతా సిబ్బంది లేనట్టు తేలింది. అలాగే ఆసుపత్రుల్లో పడకలు, పర్యవేక్షణ సిబ్బంది, పేషెంట్ ఎక్స్‌పోజర్ సరిపోకపోవడం వల్ల.. మెడికల్ కోర్సులు నామమాత్రం అవుతున్నాయనే అభిప్రాయం విద్యార్థుల్లో వ్యక్తమైంది. అత్యధిక వైద్య కళాశాలల్లో విద్యార్థులకు పేషెంట్ ఎక్స్‌పోజర్ లేకపోవడంతో.. శస్త్రచికిత్స చేయడానికి వారు భయపడుతున్నట్టు వెల్లడైంది. ఈ నేపథ్యంలో "యూనిఫామ్ స్కిల్ అక్విజిషన్ ప్రోగ్రామ్"ను అన్ని కాలేజీల్లో తప్పనిసరి చేయాలని ఫైమా సూచించింది.

కుంగదీస్తున్న పనివేళలు..

పీజీ, రెసిడెంట్లపై పని భారం ప్రమాదకరస్థాయిలో ఉందని ఫైమా రిపోర్ట్ వెల్లడించింది. 70.5 శాతం మందికి ఫిక్స్‌డ్ డ్యూటీ అవర్స్ (నిర్దిష్ట పనివేళలు) లేవు. 73.8% మందిని క్లరికల్ పనుల్లో ఉపయోగిస్తున్నారు. చాలాసార్లు 24 గంటలకుపైగా హాస్పిటల్లో డ్యూటీలు వేస్తున్నారు. దీంతో నిద్ర లేక.. ఒత్తిడికి గురికావడం, ఆత్మవిశ్వాసం తగ్గడం వంటి మానసిక సమస్యలు బాగా పెరుగుతున్నాయని రిపోర్ట్ పేర్కొంది. అలాగే సర్వేలో 62.1 శాతం మంది విద్యార్థులు తమకు స్టైపెండ్ సమయానికి రావడం లేదని వెల్లడించారు. ప్రైవేట్, ప్రభుత్వ కాలేజీల్లో భారీ తేడాలు ఉండటంతో అందరికీ యూనిఫాం పే స్కేల్ అమలు చేయాలని మెడికోలు కోరుతున్నట్లు సర్వేలో వెల్లడైంది.

సర్వేలో వెల్లడైన మరికొన్ని ముఖ్యాంశాలు..

కేవలం మెడికల్ కాలేజీల ఏర్పాటు, సీట్లు పెంచడంపైనే దృష్టి పెడుతున్నారని.. కళాశాల్లో మౌలిక సదుపాయాలు అడుగుంటుతున్నాయని సర్వే పేర్కొంది.

- తమ కాలేజీల్లో పూర్తిస్థాయి గ్రంథాలయం లేదని 50 శాతం మంది విద్యార్థులు తెలిపారు.
- ప్రమాణాలకు తగిన క్లినికల్ ప్రయోగశాలలు లేవని 47.6 శాతం మంది వెల్లడించారు.
- శరీర నిర్మాణం గురించి తెలుసుకునేందుకు అవసరమైన మృతదేహాల లభ్యత పరిమితంగా ఉందని 52.2 శాతం మంది పేర్కొన్నారు.
- తగినంత మంది నర్సింగ్ సిబ్బంది, మానవ వనరులు లేక రోగుల వైద్య సేవలపై తీవ్ర ప్రభావం పడుతున్నట్లు 72.9 శాతం మంది మెడికోలు తెలిపారు.

..ఈ సర్వేలో పాల్గొన్న వారిలో 90.3 శాతం మంది ప్రభుత్వ మెడికల్ కాలేజీలో చదివేవారు కాగా, 7.8 శాతం ప్రైవేటు మెడికల్ కాలేజీలు, మిగిలిన వారు గవర్నమెంట్ ఎయిడెడ్ కాలేజీలకుచెందిన వారున్నారు. ఇక 61 శాతం మంది యూజీలు కాగా, 29.9 శాతం పీజీలు సర్వేలో పాల్గొన్నారు. మిగిలిన వారంతా సీనియర్ రెసిడెంట్స్, అధ్యాపకులు.

నేర్చుకోవాలనే తపనే ఉండట్లేదు



ఈ తరం వైద్య విద్యార్థుల్లో నేర్చుకోవాలనే తపన ఉండాలి. అది లేకుంటే ఉపయోగం ఉండదు. గతంలో ఎంబీబీఎస్ చేసిన వారు సొంతంగా క్లినిక్‌లు పెట్టుకుని సర్జరీలు చేసేవారు. నేటి తరం వారి ఆలోచనలు కూడా భిన్నంగా ఉంటున్నాయి. కొద్దిపాటి పనిగంటలకే తీవ్ర ఒత్తిడికి గురి అవుతున్నారు. దీంతో అధ్యాపకులు కూడా కఠినంగా వ్యవహరించలేకపోతున్నారు. ప్రొఫెసర్ కఠినంగా ఉంటే పేరెంట్స్ ఒప్పుకోవట్లేదు. ప్రధానంగా వైద్యంలో కమర్షియల్ ఎలిమెంట్స్ వచ్చిన తర్వాత ఇటువంటి పరిణామాలే చోటుచేసుకుంటాయి. వైద్యవిద్యార్థుల్లో కమిట్‌మెంట్ ఉండాలి. మెడిసిన్‌ను స్టేటస్ సింబల్‌గా చూడవద్దు. అదోక సేవా వృత్తిగా భావించాలి.

- డాక్టర్ రాజారావు, ప్రిన్సిపాల్, ఉస్మానియా మెడికల్ కాలేజీ, హైదరాబాద్

బైక్‌పై వెళుతున్న వ్యక్తిని బలిగొన్న మాంజా!

- పండుగకు కుమార్తెను తీసుకువద్దామని వెళుతుండగా దారుణం
- కూతురుకు ఫోన్ చేసి.. ప్రాణాలు వదిలిన తండ్రి

బెంగళూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగకు కుమార్తెను తీసుకువచ్చేందుకు బయలుదేరిన వ్యక్తిని గాలిపటానికి ఉపయోగించే మాంజా(దారం) బలిగొంది. కర్ణాటక రాష్ట్రం బీదర్ జిల్లా బంబుళగి గ్రామానికి చెందిన సంజీవ్ కుమార్ హొసమని(48) కుమార్తె హుమ్నాబాద్‌లోని వసతి పాఠశాలలో చదువుతోంది. పండుగ నేపథ్యంలో ఆమెను తీసుకు వచ్చేందుకు బుధవారం సంజీవ్ కుమార్ బైక్‌పై బయలుదేరాడు. బిటగుప్ప తాలూకా తాళమడగి గ్రామ సమీపంలో అనూహ్యంగా గాలిలో ఎగురుతూ వచ్చిన మాంజా ఆయన మెడకు చుట్టుకుంది. దీంతో అదుపుతప్పి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. మెడకు తీవ్ర గాయం కావడంతో బట్ట చుట్టుకుని కూతురుకు ఫోన్ చేసి విషయం చెప్పాడు. కాసేపటికి స్థానికులు గమనించి, రక్తస్రావం నిలిపే ప్రయత్నం చేశారు. వారి ప్రయత్నాలు ఫలించక సంజీవ్ కుమార్ ప్రాణాలను కోల్పోయాడు. కిందపడిన సంజీవ్ కుమార్‌ను గమనించిన వెంటనే అంబులెన్స్‌కు ఫోన్ చేశామని, సకాలంలో అంబులెన్స్ వచ్చి ఉంటే బతికి ఉండేవాడని స్థానికులు తెలిపారు. మాంజా వినియోగాన్ని బ్యాన్ చేసినా కొంతమంది అక్రమంగా వినియోగిస్తున్నారని బీదర్ జిల్లా ఎస్పీ ప్రదీప్ గుంటి అన్నారు. మన్నేకహళ్లి పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారని తెలిపారు. సంజీవ్‌కుమార్‌కు భార్య, కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, పాండునాయక్ తదితరులు

గిరిజన విద్యార్థిసేన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు(విద్య), జనవరి 14(ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థిసేన ఆధ్వర్యంలో రూపొం దించిన క్యాలెండర్‌ను నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం ఆవిష్క రించారు. విద్యార్థి సంఘ నాయకులు సమస్యలపై పోరాటం చేయడంతో పాటు సామా జిక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు పాండునాయక్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం


వేంకటేశ్వర స్వామి కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన భక్తులు

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): గుంటూరు పట్టణం లాలాపేటలో పాత బస్టాండ్ సెంటర్లో ఉన్న పద్మావతి అండాల్ సమేత వేంకటేశ్వర స్వామి దేవస్థానం లో, కొత్తపేటలోని జగన్నాథ స్వామి దేవస్థానంలో బుధవారం భోగి సందర్భంగా దేవస్థా నాల ప్రాంగణంలో గోదాదేవి రంగనాయకుల స్వామికి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించడమైనది. వివాహం కానీ కన్యలతో వ్రతం నిర్వహించారు. చిన్నారులకు భోగి పండ్లు పోశారు. ఈ కార్యక్రమాలను దేవస్థానాల కార్యనిర్వాహణధికారి టి.సుభద్ర పర్య వేక్షణలో అర్చకులు ప్రసాద్, మురళీ చంద్రకుమార్ అయ్యప్పతో నిర్వహించారు.

ఘనంగా కల్యాణ మహోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

గుంటూరు (తూర్పు), జనవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీవేంకటే శ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో భోగి సందర్భంగా బుధ వారం శ్రీకృష్ణుడ్ని ప్రత్యే కంగా అలంకరిం చా రు. డాక్టర్ కోగంటి వేంకట శ్రీరంగనాయకి చిన్నారులకు భోగి పండ్లను పోశారు. అన్నమయ్య కళావేదికపై తిరుమల తిరుపతి దేవస్థానాలు ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్ట్ సౌజన్యంతో ముప్పై రోజులు నిర్వహించిన తిరుప్పావై ముగిసింది. అనంతరం కోగంటి వేంకట శ్రీరంగనాయకిని ఆలయ పాలకమండలి సత్కరించారు. తదుపరి ఆలయ అర్చకులు మాధవస్వామి బృందం ఆధ్వర్యంలో గోదా రంగనాథ స్వామివార్ల తిరుకల్యాణ మహోత్సవం మంగళవాయిద్యాలతో వేదమంత్రాల నడుమ వేద పండితులచే శాస్త్రో క్తంగా జరిగింది. పాల్గొన్నవారికి అన్నప్రసాద వితరణ జరిగింది.

● గుంటూరు(తూర్పు), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కృష్ణానగర్, 1వ లైన్లో కొలు వైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో భోగి పండుగ సందర్భంగా బుధవారం గోవింద నామాలతో, అన్నమయ్య కీర్తనల గానంతో శ్రీగోదా రంగనాథుల కల్యాణం వేద మంత్రాల నడుమ కనుల పండువగా జరిగింది. విశేషంగా పాల్గొన్న భక్తులకు గోదా అమ్మవారి విశేషాలను వివరిస్తూ వేద పండితులు కల్యాణాన్ని నిర్వహించారు. శ్రీనివాసాచార్యులు వారి అనుగ్రహభాషణం, అనంతరం విశేష అన్నదానం జరిగింది. కార్యక్రమాల్ని నిర్వాహ కులు ధనకుదరం శ్రీనివాసాచార్యులు పర్యవేక్షించారు.

మాజీ మేయర్ చుక్కా ఏసురత్నం మరణం తీరని లోటు

● పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర మాజీ మేయర్, ప్రఖ్యాత జంతుశాస్త్ర అధ్యాపకుడు చుక్కా ఏసురత్నం మరణం తీరని లోటని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఏసురత్నం పార్థివదేహానికి బుధవారం ఎమ్మెల్యే మాధవి, రామచంద్రరావు దంపతులు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. మేయర్‌గా, విద్యా వేత్తగా చుక్కా ఏసురత్నం గుంటూరు నగర అభివృద్ధికి, విద్యారంగానికి విశేష సేవలు అందించారని, ఆయన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే తెలిపారు.


చుక్కా ఏసురత్నం పార్థివ దేహం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి, రామచంద్రరావు

ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నివాళి

నగర మాజీ మేయర్ చుక్కా ఏసురత్నం భౌతిక కాయానికి ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి బుధవారం నివాళులర్పించారు. అరండల్‌పేటలోని నివా సానికి వెళ్ళిన అప్పిరెడ్డి ఆ పార్టీ నాయకులు ఏసురత్నం భౌతిక కాయా నికి పూలమాలలతో నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శిం చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పాపతోటి అంబేద్కర్, దూపాటి వంశీ, కిషోర్, పానుగంటి చైతన్య, భాగ్యారావు తదితరులున్నారు.


ఏసురత్నం భౌతిక కాయానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి తదితరులు

సీఐటీయూ నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు(తూర్పు), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) క్యాలెండర్‌ను బుధవారం అరండల్‌పేట, కార్మిక శాఖ కార్యాలయంలో ఏసీఎల్ లక్ష్మి, యూడీసీ సుభాషిణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల కోసం క్యాలెండర్ రూపొందించడం సంతోషదాయకమన్నారు. కార్మిక సంఘం చేసే కార్యక్రమాలకు మావంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎల్‌వో తిరుపతిరావు, సంఘం నాయకులు ఖాసిం వలి, దీవెనరావు, డి.కోటేశ్వరరావు, ముత్యాలరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కార్మిక శాఖ అధికారులు


ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతున్న సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు మాధవి, నసీర్ అహ్మద్, అర్బన్ బ్యాంక్ చైర్మన్ బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ తదితరులు


తూర్పు నియోజకవర్గంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో భోగి మంటలు వేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డిప్యూటీ మేయర్ షేక్ సజల కార్పొరేటర్లు తదితరులు

ఘనంగా సంక్రాంతి సంబరాలు

● భోగి మంటలు, గంగిరెద్దుల విన్యాసాలు
● హాజరైన నగర మేయర్, ఎమ్మెల్యే మాధవి తదితరులు


భోగిమంటల చుట్టూ పాటల పాడుతూ నృత్యం చేస్తున్న మహిళలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): భోగి పండుగ ప్రతి ఇంట్లో భోగభాగ్యాలు అందించాలని కోరుకుంటున్నామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అన్నారు. గుంటూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం ఎమ్మెల్యే గల్లా మాధవి, వివిధ డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి జీఎంసీ సంక్రాంతి సం బరాల్లో భాగంగా భోగి మంటలు వేయడం, చిన్నారులకు భోగి పళ్ళు పోయ డం, గంగిరెద్దుల విన్యాసాలు, సన్నాయి మేళం, హరిదాసుల కీర్తనలతో పాటు టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొని ప్రజలను ఉత్సాహపరిచారు.

మేయర్ రవీంద్ర మాట్లాడుతూ తరతరాల నుంచి వచ్చిన తెలు గు సంప్రదాయ పద్ధతులను, క్రీడలను నేటితరం పిల్లలకు అందించేలా జీఎంసీ పశ్చిమ, తూర్పు నియోజకవర్గాల్లో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబ రాలకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందన్నారు. ఆదరణ కోల్పోతున్న ఆటలను తిరిగి పరిచయం చేయడానికి సంక్రాంతి సంబరాలు ప్రధాన వేదికగా మారాయని అన్నారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయం ఉత్సాహం కలి సిన సంక్రాంతి వేడుకలను ప్రజలతో కలిసి ఆనందంగా జరుపుకోవడం మర్చిపోలేని అనుభూతి అని తెలిపారు.

తూర్పు నియోజకవర్గంలో..

తూర్పు నియోజకవర్గంలోని వెల్ఫేర్ సెంటర్లో జరిగిన సంక్రాంతి సంబ రాల్లో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, వివిధ డివి జన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భోగి మంటలు, చిన్నారుల కు భోగి పళ్ళు, గోలీలాట, గంగిరెద్దుల విన్యాసాలు, కోలాటం, డప్పుల వాయి ద్యాలు, మహిళల నృత్యాలు ప్రజలను విశేషంగా ఆకర్షించాయి.

భోగి ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలి

● పిల్లి మాణిక్యరావు


టీడీపీ జిల్లా కార్యాలయం వద్ద భోగి మంటలు వేస్తున్న పిల్లి మాణిక్యరావు తదితర టీడీపీ నేతలు

గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): భోగి పండుగ ప్రజల జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించి న భోగి వేడుకల్లో పాల్గొని జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో దాసరి రాజా మాష్టారు, కంచర్ల శివరామయ్య, ఏమినేటి లక్ష్మీ శైలజ, వేములకొండ శ్రీనివాస్, షేక్ ఫిరోజ్, యర్రగోపు నాగేశ్వరరావు, లోకే శ్వరి, పద్మ, రమాదేవి, కనకరత్నం తదితరులు పాల్గొన్నారు.


ముగ్గులో గొబ్బెమ్మ పెడుతున్న మహిళ


ఇళ్ల ముందు భోగి మంటలు


ప్రత్యేకంగా అలంకరించిన ఇంటి వద్ద చిన్నారులు


మహిళల ప్రదర్శనలు

దేవర పూజకు వెళ్లివస్తూ..

● నిద్రమత్తులో చెట్టును ఢీ కొన్న కారు
● ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం

ప్రత్తిపాడు, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): పండుగ పూట స్వగ్రామంలో జరుపుకునే దేవర పూజకు వెళ్లివస్తూ ఒకరు మృత్యువు ఒడిలోనికి వెళ్లిన సంఘటన ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం సమీపంలో జరిగింది. ప్రత్తిపాడు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ప్రత్తిపాడు మండలం గనికపూడి గ్రామానికి చెందిన అంచా భానుప్రసాద్ (60) తో పాటు వా రి కుటుంబసభ్యులు గుంటూరులో నివాసం ఉంటున్నారు. అయితే భోగి పండుగ రోజున స్వగ్రామమైన గనికపూడిలో దేవరకు పూజలు నిర్వహిం చడం ఆనవాయితీగా వస్తుంది. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్వ గ్రామానికి వెళ్లి అక్కడ బంధువులతో కలసి పండుగను జరుపుకోవడంతో పాటు దేవరకు పూజలు చేశారు. తిరిగి మధ్యాహ్నం నాలుగు గంటల స మయంలో గుంటూరుకు బయలు దేరారు. అయితే డ్రైవింగ్ సీటులో ఉ న్న అంచె శ్రీనివాసరావుకు తిక్కిరెడ్డిపాలెం దాటిన తరువాత నిద్రరావ డంతో కునుకు తీయడం, కారు అదుపు తప్పి రోడ్డు మార్జిన్‌లో ఉన్న చిం త చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముందు సీటులో కూర్చున్న భా నుప్రసాద్‌కు బలమైన గాయాలు కావడంతో వెంటనే గుంటూరు తరలిం చారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. వెనుక సీటు లో కూర్చున్న భానుప్రసాద్ తల్లి వెంకటసువర్ణ పరిస్థితి కూడా విషమం గా ఉంది. అయితే డ్రైవర్ సీటులో ఉన్న అంచే శ్రీనివాసరావుకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ మేరకు ప్రత్తిపాడు ఎస్‌ఐ నరహరి సంఘట నా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

వైసీపీ సంక్రాంతి సంబరాల్లో అంబటి, మోదుగుల డ్యాన్స్‌లు


మాజీ ఎంపీ మోదుగులతో మాజీ మంత్రి అంబటి రాంబాబు స్టెప్పులు

గుంటూరు, జనవరి 14(ఆంధ్ర జ్యోతి): జిల్లా కేంద్రం గుంటూరులో వైసీపీ ఆధ్వర్యంలో చేపట్టిన సంక్రాంతి సంబరాల్లో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపా ల్‌రెడ్డి స్టెప్పులేసి ఆహూతులను అలరిం చారు. వైసీపీ ఆధ్వర్యంలో గుంటూరు శివారులోని ఎన్‌జీవో కాలనీలో మెట్టు అంజిరెడ్డి కల్యాణ మండపం ఆవరణలో సంక్రాంతి సంబరాలు చేపట్టారు. ఇందులో భాగంగా భోగి మంటలు వెలిగించి కళాకారులతో కలిసి మాజీ మంత్రి అంబటి స్టెప్పులేశారు. ఇదే సమయంలో అంబటితో జత కలిసి మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి కూడా డ్యాన్స్‌లు వేశారు.

కొనసాగుతున్న నాటక పోటీలు

పెదకాకాని, జనవరి 14(ఆంధ్రజ్యో తి): పెదకాకాని మండలం తక్కెళ్ళ పాడులో రెండో రో జు 15వ జాతీయ స్థాయి నాటక పోటీలు కొనసాగాయి. డాక్టర్ కాసరనేని స దాశివరావు నాటక కళాపరిషత్ ఆధ్వర్యంలో లలిత కళానికేతన్ ఆధ్వర్యంలో ఈ నాటిక పోటీలు జరుగుతున్నాయి. బుధవారం మమ్మల్ని బతకనివ్వండి, అల్లరి బాజాలు- వీధి దీపాలు, నాన్న నాటకాలు ప్రదర్శించారు. లలిత కళానికేతన్ కార్యవర్గ సభ్యులు నందిపాటి ప్రసాద్, అప్పసాని నాగమల్లేశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

పిల్లి మాణిక్యరావుకు సత్కారం



ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీ సెస్ (ఏపీటీఎస్) చైర్మన్ మన్న వ మోహనకృష్ణను తెలుగుదేశం పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షు డిగా నియమితులైన ఏపీ లిడ్‌క్యాప్ చైర్మన్ పిల్లి మాణిక్య రావు మర్యాద పూర్వకంగా కలి శారు. గుంటూరులోని తన కార్యాలయానికి వచ్చిన ఆయ నను మన్నవ మోహనకృష్ణ శా లువాతో సత్కరించి, శుభాకాం క్షలు తెలిపారు. - గుంటూరు.

పీపీపీ జీవోల దహనం

గుంటూరు(తూర్పు), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): సీపీఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా బుధవారం నగర సమితి ఆధ్వర్యంలో కొత్తపేటలో మల్లయ్య లింగం భవన్ వద్ద భోగిమంటల్లో పీపీపీ జీవోలను దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు పార్టనర్‌షిప్ పద్ధతిలో కొనసాగించే ప్రభుత్వ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ విధానంతో పేద, అట్టడుగు వర్గాల విద్యార్థులకు మెడికల్ విద్య, పేదలకు ప్రభుత్వ వైద్యం దూరమయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనల్లో ఆకిటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, నూతలపాటి చిన్న, జంగాల చైతన్య, వెంకటేశ్వర్లు, చల్ల మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

కారు డ్రైవర్ ఆత్మహత్య

గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): వడ్డీ వ్యాపారుల ఒత్తిడి తట్టుకోలేక కారు డ్రైవర్ యేమినేని నాగేశ్వరరావు(43) గడ్డి మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య సంధ్య, నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వట్టి చెరుకూరు మండలం చమళ్ళమూడి గ్రామానికి చెందిన యేమినేని నాగేశ్వరరావు కారు డ్రైవర్‌గా పని చేస్తుంటాడు. ఆయనకు భార్య సంధ్య, ఒక కుమారుడు, కుమార్తె సంతానం ఉన్నా రు. నాగేశ్వరరావు కుటుంబ అవసరాల నిమిత్తం ఏడాది క్రితం గోరంట్లకు చెందిన కె శ్రీని వాసరావు వద్ద ఏడు లక్షలు అప్పుగా తీసుకున్నాడు. అదేవిధంగా కాకర్ల శ్రీనివాసరావు వద్ద లక్ష 17 వేలు, అలాగే గోనా వెంకటేశ్వరరావు వద్ద 45 వేలు అప్పుగా తీసుకున్నాడు. ఇందుకుగాను ఇంటి స్థలంలో కొంత భాగం అమ్మగా వచ్చిన నాలుగు లక్షల 50 వేలు అప్పు ఇచ్చిన వారికి తిరిగి చెల్లించాడు. అయితే అప్పు ఇచ్చిన వారు ఆ మొత్తాన్ని వడ్డీ కింద మినహాయించుకొని ఇంకా అసలు ఇవ్వాలంటూ నాగేశ్వరావుపై ఒత్తిడి తెచ్చారు. దీంతో నాగేశ్వరరావు ఈనెల 13న ఉదయం పొత్తూరు బైపాస్ సమీపంలోని ఓబుల్ నాయుడుపాలెం వద్ద గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ విషయం తన స్నేహితులు శివ, వెంకటస్వామి, మురళి తదితరులకు ఫోన్ చేసి చెప్పాడు. వారు వెంటనే నాగేశ్వరావును జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. భార్య సంధ్య ఫిర్యాదు మేరకు నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్వామియే శరణం అయ్యప్ప

● సంపత్‌నగర్‌లో మకరజ్యోతి దర్శన మహోత్సవం
● శరణు ఘోషతో పులకరించిన భక్తజనం



గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): సంపత్ నగర్‌లోని అయ్యప్పస్వామి ఆలయంలో మకర జ్యోతి దర్శన మహోత్సవం బుధ వారం సాయంత్రం అంగ రంగ వైభవంగా జరిగిం ది. 50 సంవత్సరాల నుంచి అయ్యప్ప దేవస్థానంలో మకర సంక్రాంతి పర్వదినాన జరుగుతున్న మకరజ్యోతి దర్శనాన్ని ఈ సంవ త్సరం కూడా ఎంతో వైభవంగా క్రేన్ అనుబంధ క్రేన్ రిలీజియస్ ట్రస్ట్, క్రేన్ సంస్థల చైర్మన్ గ్రంధి వెంకటసత్యలక్ష్మి కాంతారావు, వారి సతీమణి లక్ష్మీ హైమావతి దంపతులు, కుటుంబసభ్యులు ఘనంగా నిర్వహించారు. బుధ వా రం సాయంత్రం 5.30 గంటలకు స్వామి వారి తిరువాభరణాలను సంపత్ నగర్‌లోని క్రేన్ వక్కపొడి ఫ్యాక్టరి నుంచి దేవాలయానికి కాంతారావు దంప తులు, వారి మూడో అల్లుడు చక్కా వినోద్ రామకృష్ణ, మూడో కుమార్తె విజయలక్ష్మి, కుటుంబసభ్యులు, భక్తులు వేలాదిగా పాల్గొని ఆభరణాలను దేవాలయానికి చేర్చారు. అనంతరం ఆభరణాలను స్వామికి అలంకరించారు. సాయంత్రం 7.01 గంటలకు దేవాలయానికి చేరిన వేలాది భక్తులతో స్వామి వారి శరణుఘోషలో క్రేన్ గ్రూపు సంస్థల చైర్మన్ గ్రంధి కాంతారావు దంపతులు మకరజ్యోతి ప్రజ్వలన చేశారు. కళాకారులచే భక్తిగీతాల సంగీత విభావరి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో క్రేన్ గ్రూప్ సంస్థల సిబ్బంది టంగుటూరి మణి, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అరండల్‌పేట శివాలయంలో....

గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): గుంటూరు అయ్యప్ప సేవా సమాఖ్య ఆధ్వర్యంలో స్థానిక అరండల్‌పేట 4/4 శివాలయంలో బుదవారం సాయంత్రం 6.45 గంటలకు సిరిపురపు స్వరాజ్యలక్ష్మి మకర జ్యోతిని వెలిగించారు. శబరిమ లైలోని అయ్యప్పస్వామి సన్నిధిలో జరిగే మకర విళ్ళక్కు పర్వదినాన్ని పురస్క రించుకొని మకరజ్యోతి దర్శనం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో కూడా మకర జ్యోతి దర్శనం కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిరిపురపు శ్రీధర్, ఆలయ ధర్మకర్త ఏకా ప్రసాద్, అర్చకులు కుందుర్తి సుబ్రహ్మణ్యం, భాస్కర్ శర్మ, శ్రీనివాస్, మన్నవ రాధాకృష్ణ, సిరిపురపు అనీషా తదితరులు పాల్గొన్నారు.

● చుట్టుగుంట పోలేరమ్మతల్లి, అయ్యప్ప స్వామి భక్త బృందం ఆధ్వర్యంలో చుట్టు గుంట పోలేరమ్మ తల్లి ఆలయం సెంటర్‌లో మకర జ్యోతి దర్శన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు.


మకరజ్యోతి దర్శనంలో పాల్గొన్న వాసవీ మణికంఠ సేవా భక్త బృంద సభ్యులు

● గుంటూరు (తూర్పు), జనవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏలూరు బజారు, కోదండ రామాలయం వద్ద శ్రీవాసవీ మణికంఠ సేవా భక్త బృందం ఆధ్వర్యంలో మకరజ్యోతి దర్శ న కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మకరజ్యోతిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాదర్తి ఉమామహేశ్వరరావు, సురేష్, జుజ్జూరు శ్రీనివాసరావు, ఎల్ఐసీ రవి, ఓం ప్రకాష్, దేవతి శివకుమార్, సుధాకర్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
గురువారం
15 జనవరి 2026

అందాల రంగవల్లి ఆరోగ్యానికి కూడా

కేవలం ఆధ్యాత్మికత మాత్రమే కాదు.... ఆరోగ్యపరమైన అంశాలు కూడా ఇమిడి ఉండడం మన పండుగల ప్రత్యేకత. సంక్రాంతి ముగ్గులు కూడా ఆ కోవలోకే వస్తాయి. ధనుర్మాసం ముగిసిన తరువాత సంక్రాంతి వస్తుంది. ధనుర్మాసం నెల రోజులూ ముగ్గులు వేయడం మన సంప్రదాయం. ఈ మాసంలో శీతాకాలం తీవ్రంగా ఉంటుంది. క్రిములు, కీటకాలు కూడా ఎక్కువగా ఉంటాయి. ముగ్గుల ద్వారా వాటిని నిరోధించవచ్చు. ముగ్గులు వేయడం కోసం ఇంటి ముందు పేడ నీళ్ళతో కళ్లాపి జల్లుతారు. ముగ్గు వేయడానికి వరిపిండిని ఉపయోగిస్తారు. గడపలకు పసుపు రాస్తారు. పసుపు, పేడ క్రిమినాశకాలు. అలాగే క్రిములు, పురుగులకు వరిపిండి ఆహారం. వాటి ద్వారా క్రిములు, చిన్న పురుగులు ఇళ్ళలో ప్రవేశించకుండా ఉంటాయి.

ఆ ఋణాలు తీర్చుకుందాం

మానవులుగా జన్మించినవారు తీర్చుకోవాల్సిన ఋణాలను పూర్వులు నిర్దేశించారు. అవి: దేవ, పితృ, మనుష్య, ఋషి, భూత ఋణాలు. వాటిని 'పంచ ఋణాలు' అంటారు. వీటన్నిటినుంచీ విముక్తి కలిగించేది సంక్రాంతి. సూర్యుడి ఆరాధనతో పాటు యజ్ఞ, యాగాదుల ద్వారా దేవ ఋణం; దానాలు, పిండప్రదానాల ద్వారా పితృ ఋణం; ఆ ఏడాదిలో తమకు లభించిన సంపద నుంచి పంచుకోవడం ద్వారా మనుష్య ఋణం; ధ్యాన సాధనలు, సత్సంగాల్లాంటి మంచి కార్యక్రమాల ద్వారా ఋషి ఋణం; పంచభూతాల సాక్షిగా భూమి, పశువులు, పక్షులకు సమర్పించేవాటి ద్వారా భూత ఋణం తీరుతాయంటారు పెద్దలు. పితృదేవతలకు తర్పణాలు ఇచ్చే రోజు కాబట్టి దీన్ని 'పెద్దల పండుగనీ, వ్యవహారికంగా 'పెద్ద పండుగ' అనీ అంటారు. తర్పణాలతో పాటు దానాలకు కూడా ప్రాధాన్యం ఉంటుంది. ప్రధానంగా కూష్మాండ (గుమ్మడిపండు) దానం చేస్తారు. సూర్యారాధన కూడా ఈ రోజున విశేషంగా చేస్తారు.



సంక్రాంతి

పండుగ వేళ... కృతజ్ఞతగా!

సంక్రాంతి నుంచి దేవతలకు ప్రీతికరమైన ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభమవుతుంది. ఈ నేపథ్యంలో... ఈ రోజున నిర్వహించాల్సిన విధులను పూర్వులు నిర్దేశించారు. తమ పితృదేవతలను (గతించిన మన ఆత్మీయులు, గురువులు, మన కుటుంబం కష్టంలో ఉన్నప్పుడు ఆపన్న హస్తం అందించినవారు) తలచుకోవాలి. గృహిణి స్వయంగా వండిన పదార్థాలను ప్రత్యక్ష భగవానుడైన సూర్యుడికి నైవేద్యం పెట్టి, ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అందరూ తినాలి.



రామాయణంలో...

రామాయణ గాథ ప్రకారం... దశరథుడు మరణించిన విషయాన్ని శ్రీరాముడికి తెలియజేసి, అయోధ్యా రాజ్యాన్ని ఆయనకు అప్పగించడం కోసం కొన్నివేలమందితో భరతుడు బయలుదేరాడు. శ్రీరాముడు ఉన్న చిత్రకూటానికి వెళ్ళాడు. ఆ సైన్యాన్ని తిలకించిన రాముడికి దశరథుని కోవిదార ధ్వజం (గోగు పూవు రంగు జెండా) ఉన్న రథం కనిపించలేదు. తండ్రి గతించాడని భరతుడు చెప్పాడు. అప్పటికి దశరథుడు స్వర్గస్థుడై 38 రోజులు గడిచాయి. అయినప్పటికీ, సీతతో కలిసి నది ఒడ్డుకు రాముడు వెళ్ళి పిండ ప్రదానం చేశాడు.

ఇంగుదం బదరైర్మిశ్రం పిణ్యాకం దర్భసంస్తరే
న్యస్య రామ స్సుదుఃఖార్త రుదన్వచన మబ్రవీత్

రేగు పిండిని, అడవిలో దొరికే ఇంగుదీ ఫలాలను కలిపి ముద్దలు చేసి పెడుతూ "దివ్యాన్నాలను స్వీకరించే నా తండ్రీ! నేను తింటున్న దాన్ని, ఇక్కడ లభించిన దాన్ని నీకు సమర్పిస్తున్నాను" అంటూ పిండ ప్రదాన కార్యక్రమాన్ని ముగించాడు. దక్షిణ దిక్కుకు తిరిగి దశరథుడికి తర్పణాలను (నువ్వులను, నీళ్ళను పవిత్రంగా సమర్పించడం) వదులుతూ దుఃఖాతిశయంతో తండ్రిని తలచుకున్నాడు.

కృతజ్ఞులమై ఉండాలి...

స్కాంద పురాణంలో ఒక కథ ఉంది. ఒక కుటుంబం పొరుగూరికి బయలుదేరింది. తమతో తెచ్చుకున్న ఆహారాన్ని తినేసి ప్రయాణం సాగిస్తోంది. ఆకస్మాత్తుగా వర్షం కురిసింది. మార్గంలోని సెలయేరు ప్రవాహం పెరిగింది. వారి ప్రయాణం ఆగిపోయింది. దాదాపు ఆరేడు గంటలు అక్కడే ఉండిపోయారు. పిల్లలు ఆకలికి తాళలేక నీరసంతో నిద్రపోయి, మళ్ళీ లేచి బిగ్గరగా ఏడుపు మొదలుపెట్టారు. ఆ తల్లితండ్రులకు ఏం చేయాలో తోచలేదు. కాసేపటికి సూర్యుడు ఉదయించాడు. సెలయేటి ప్రవాహం తగ్గింది. చిత్రమేమిటంటే... ఆ దగ్గరలోనే ఒక చెట్టు కింద పెద్ద అన్నం మూట కనిపించింది. ఆవురావురుమంటున్న ఆ కుటుంబం కడుపు నిండా భోజనం చేసింది. ఆ తరువాత... ఆ మూటను ఎవరు మరిచిపోయారో అనుకుంటూ నలుదిక్కులా చూశారు. ఆ చెట్టు మీద నుంచి గతించిన ఆ కుటుంబ పెద్ద తల్లిదండ్రులు తమ కంఠ స్వరాలతో "మేమేరా! నీ తల్లిదండ్రులం. నీ అన్న, తమ్ముడు మాకు శ్రాద్ధ కర్మలను సక్రమంగా చేస్తూ పెట్టే పిండాలలో కొంత నీకు ఇచ్చాం. తృప్తిగా భోజనం చేశావుగా సకుటుంబంగా! ఉంటాం" అన్నారు. తల్లిదండ్రులు పరమపదించిన తరువాత కూడా మనల్ని కనిపెట్టుకొని ఉంటారు. వారిని పట్టించుకోకుండా ఉండడం సమంజసం కాదు. ఏ కొందరికో వారి తల్లిదండ్రులు కష్టాన్ని, నష్టాన్ని కలుగజేసి ఉండవచ్చు. కానీ ఆ కోపంతో పిండప్రదానాలను మానకూడదు. లౌకిక భావనతో చూస్తే దీన్ని కృతజ్ఞత అనుకోవచ్చు. మనమే పంచ ప్రాణాలుగా భావించి, కష్టపడి మనల్ని పెంచి పెద్ద చేసిన, ఒక తోవ చూపిన తల్లిదండ్రులను, పైన పేర్కొన్న ఆత్మీయులందరినీ స్మరించుకోవడం మన విధి. లేకపోతే కృతఘ్నులం అవుతాం.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు



కట్టమూరి సుభాషిణి
విద్యానగర్, గుంటూరు



ముత్యాల ముగ్గు



'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం ప్రేక్షకాదరణతో కొనసాగుతున్న సందర్భాన్ని పురస్కరించుకొని చిరంజీవి హైదరాబాద్‌లోని తన నివాసంలో చిత్రబృందంతో కలసి విజయోత్సవ వేడుక నిర్వహించారు. దర్శకుడు అనిల్ రావిపూడి, వెంకటేశ్, నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల, రామ్‌చరణ్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

మరో తమిళ దర్శకుడికి గ్రీన్ సిగ్నల్





భోగి పండగ సందర్భంగా బుధవారం అల్లు అర్జున్ నటించే కొత్త సినిమా ప్రకటన వచ్చింది. వైవిధ్యమైన చిత్రాలు తీస్తూ కమర్షియాలిటీకి కొత్త అర్థం చెబుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న తమిళ దర్శకుడు లోకేశ్ కనకరాజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహించనున్నారు. రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రం తర్వాత లోకేశ్ ఏ సినిమా చేస్తారా అనే ఊహాగానాలు మొదలైన సమయంలో అల్లు అర్జున్ హీరోగా ఈ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేయడంతో క్లారిటీ వచ్చింది. ఇటీవల లోకేశ్ హైదరాబాద్ రావడం, అర్జున్‌ని కలవడం జరిగాయి. వీరిద్దరి కాంబినేషన్‌లో ఈ ప్రతిష్ఠాత్మక చిత్రం షూటింగ్ ఆగస్టులో ప్రారంభం కానుంది. ఈ సినిమాలో అల్లు అర్జున్ ఇప్పటివరకు చూడని ఓ కొత్త లుక్‌లో కనిపించబోతున్నారు. సరికొత్త మాస్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని సమాచారం. అనిరుధ్ ఈ సినిమాకు సంగీత దర్శకత్వం వహించనున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ యలమంచిలి... బన్నీ వాసుతో కలసి ఈ భారీ చిత్రాన్ని నిర్మించనున్నారు. నట్టి, శాండీ, స్వాతి సహ నిర్మాతలు. ప్రస్తుతం తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ చిత్రంలో అల్లు అర్జున్ నటిస్తున్న సంగతి తెలిసిందే.

పీపుల్స్ మీడియాతో పవన్



టాలీవుడ్‌లో మరో భారీ నిర్మాణ భాగస్వామ్యానికి అడుగులు పడుతున్నాయి. పవన్ కల్యాణ్ తన సొంత బ్యానర్ 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' ద్వారా సినిమాలు నిర్మించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా నిర్మాత టీజీ విశ్వప్రసాద్ నేతృత్వంలోని ప్రముఖ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీతో కలసి కొత్త చిత్రాలు నిర్మిస్తున్నారు. తమ కలయికలో రాబోతున్న కొత్త ప్రాజెక్ట్‌లపై పవన్ కల్యాణ్, టీజీ విశ్వప్రసాద్ చర్చించారు. 'ప్రేక్షకులకు బలమైన, అర్థవంతమైన కంటెంట్‌ను అందించడమే లక్ష్యంగా పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్‌తో కలసి పనిచేయడం గౌరవంగా భావిస్తున్నాం. ఈ అద్భుత ప్రయాణం కోసం ఎంతగానో ఎదురుచూస్తున్నాం' అని విశ్వప్రసాద్ పేర్కొన్నారు. ఈ రెండు బ్యానర్ల ఉమ్మడి సినిమాలకు సంబంధించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడే అవకాశం ఉంది.

ఏప్రిల్‌లో విడుదల



ప్రేక్షకులు ఎప్పుడెప్పుడా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్న మలయాళ చిత్రం 'దృశ్యం 3' అప్‌డేట్ వచ్చేసింది. 'దృశ్యం' ఫ్రాంచైజీలో భాగంగా మోహన్‌లాల్ నటించిన ఈ చిత్రాన్ని ఏప్రిల్ 2న విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా నిర్మాణ సంస్థ ప్రకటించింది. ఈ సందర్భంగా ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేసింది. టీవీ కేబుల్ ఆపరేటర్ జార్జి కుట్టి కథ ఎలాంటి మలుపులు తిరిగిందా అని ఎదురుచూస్తున్న వారికి ఆనందాన్ని ఇచ్చే వార్తే ఇది. మీనా కథానాయికగా నటించిన 'దృశ్యం 3' చిత్రానికి జీతూ జోసెఫ్ దర్శకుడు. 'దృశ్యం 3' హిందీ వెర్షన్ అజయ్ దేవగణ్ పుట్టిన రోజు సందర్భంగా అక్టోబర్ 2న విడుదలవుతుంది. ఈ చిత్రంలో శ్రియ, టబు కీలక పాత్రలు పోషించారు.

సిద్ధు జొన్నలగడ్డకు శోభన్‌బాబు అవార్డ్





సీనియర్ హీరో శోభన్‌బాబు జయంతి సందర్భంగా ప్రతి ఏటా ప్రజ్ఞా పాటవాలను ప్రదర్శించే యువ కథానాయకుడికి 'సోగ్గాడు శోభన్‌బాబు అవార్డ్'ను అందజేయాలని అఖిలభారత శోభన్‌బాబు సేవాసమితి నిర్ణయించింది. ఇటీవల సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థతో కలసి 'సోగ్గాడు' సినిమా స్వర్ణోత్సవాన్ని ఈ సంస్థ ఘనంగా నిర్వహించింది. బుధవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తొలి సారిగా ఈ అవార్డ్‌ను హీరో సిద్ధు జొన్నలగడ్డకు అందజేయనున్నట్లు సంస్థ గౌరవ అధ్యక్షుడు, నిర్మాత రాశీ మూవీస్ నరసింహారావు, సలహాదారు జేష్ట రమేశ్‌బాబు, పారిశ్రామిక వేత్త జె.రామాంజనేయులు తెలిపారు. త్వరలో నిర్వహించే ఓ కార్యక్రమంలో ఈ అవార్డ్‌ను సిద్ధు జొన్నలగడ్డకు అందజేస్తామని పేర్కొన్నారు.

నాన్‌స్టాప్‌గా నవ్వులు పంచుతున్నాం

- నవీన్ పొలిశెట్టి



'అనగనగా ఒక రాజు' చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. ఫస్టాఫ్, సెకండాఫ్ అనే తేడా లేకుండా నాన్‌స్టాప్‌గా నవ్వుతూనే ఉన్నారు. మొదటి షో నుంచే మా సినిమాకు బ్లాక్‌బస్టర్ టాక్ ఇచ్చిన ప్రేక్షకులకు రుణపడి ఉంటాను' అని నవీన్ పొలిశెట్టి అన్నారు. ఆయన కథానాయకుడిగా దర్శకుడు మారి తెరకెక్కించిన చిత్రమిది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. బుధవారం విడుదలైన సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. నాగవంశీ మాట్లాడుతూ 'మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు. అన్ని ఏరియాల నుంచి సినిమాకు సూపర్‌హిట్ టాక్ వస్తోంది. భారీ వసూళ్లు రాబడతామన్న నమ్మకం ఉంది. కామెడీని ఎంతగా ఎంజాయ్ చేస్తున్నారో, చివర్లో వచ్చే ఎమోషన్ సన్నివేశాలకూ ప్రేక్షకులు అంతే కనెక్ట్ అవుతున్నారు. రానున్న రోజుల్లో థియేటర్ల సంఖ్య పెంచుతాం' అని చెప్పారు.

ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది



'ప్రేక్షకులను నవ్వించాలనే ఆలోచనతో 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రం తీశాం. మా లక్ష్యం నెరవేరింది. థియేటర్లలో ప్రేక్షకులు నాన్‌స్టాప్‌గా నవ్వుతూనే ఉన్నారు. రవితేజ గారి పాత్ర చిత్రణ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంటోంది' అని కిశోర్ తిరుమల అన్నారు.

ఆయన దర్శకత్వంలో రవితేజ కథానాయకుడిగా సుధాకర్ చెరుకూరి నిర్మించిన చిత్రమిది. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం సక్సెస్‌మీట్‌ను యూనిట్ బుధవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ 'మా సినిమాను ఇంత పెద్ద హిట్ చేసిన ప్రేక్షకులకు, హీరో రవితేజగారికి ధన్యవాదాలు. ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలు సినిమాను బాగా ఎంజాయ్ చేస్తున్నారు. రవితేజ గారి కామెడీ టైమింగ్, ఇందులో చాలా అద్భుతంగా కొత్తగా ఉంది' అని అన్నారు. ప్రేక్షకుల నుంచి చక్కని ప్రశంసలు దక్కడం మాకెంతో ఆనందాన్నిస్తోంది అని కథానాయిక ఆషికా రంగనాథ్ అన్నారు.

భారతీయత గొప్పతనం చాటేలా



తెలుగు చిత్ర పరిశ్రమలో వినోదాత్మక కుటుంబ కథాచిత్రాలను అందించిన దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి తాజా చిత్రం 'వేదవ్యాస్'. దక్షిణ కొరియా నటీమణి జున్ హ్యాన్ జీ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో పిడుగు విశ్వనాథ్ హీరోగా పరిచయవుతున్నారు. వ్యాపారవేత్త కొమ్మూరి ప్రతాపరెడ్డి నిర్మిస్తున్నారు. చిత్ర సమర్పకుడు అచ్చిరెడ్డి కొత్త హీరో విశ్వనాథ్‌ను పరిచయం చేశారు. దర్శకుడు కృష్ణారెడ్డి మాట్లాడుతూ 'విశ్వనాథ్‌ను హీరోగా పరిచయం చేయడం ఆనందంగా ఉంది. అద్భుతంగా నటించారు. అలాగే సినిమాలో కీలకమైన వేద నారాయణ పాత్రను సాయికుమార్ పోషించారు. కొరియన్ యువతి జున్ తెలుగు నేర్చుకుని డబ్బింగ్ తనే చెప్పారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనం చాటేలా ఈ సినిమా ఉంటుంది' అని చెప్పారు.

వేట మొదలైంది



మలయాళ యంగ్ హీరో ఆంటోనీ వర్గీస్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'కట్టలన్'. పాల్ జార్జ్ దర్శకత్వంలో క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై షరీఫ్ ముహమ్మద్ నిర్మిస్తున్నారు. తెలుగు నటుడు సునీల్ ఈ చిత్రంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ప్రత్యేక పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఏనుగుల వేట నేపథ్యంలో ఉత్కంఠభరితమైన మాస్ యాక్షన్‌ను తలపించేలా ఉన్న పోస్టర్‌లో ఆంటోనీ వర్గీస్ పవర్‌ఫుల్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో దుషారా విజయన్ కథానాయిక. మే 14న 'కట్టలన్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. సంగీతం: బి. అజనీశ్ లోక్‌నాథ్.



గంగిరెద్దులను పట్టుకుని ఉన్న సీఎం చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు




పెనుకొండలో జరిగిన సంక్రాంతి సంబరాలలో పందెం కోడితో మంత్రి సవిత

సంబరాల్లో మంత్రులు

పెనుకొండ టౌన్, ధర్మవరం, జనవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లాలో బుధవారం సంక్రాంతి సంబరాల్లో మంత్రులు సత్యకుమార్ యాదవ్, సవిత పాల్గొన్నారు. పెనుకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సవిత ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆమె తన స్వగృహం నుంచి ఎద్దుల బండిపై వెళ్లారు. సరదగా గాలిపటాలు ఎగురవేయించారు. ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్ సతీసమేతంగా పాల్గొన్నారు. కాలేజీ సర్కిల్ నుంచి వారు ఎద్దుల బండిపై వచ్చారు. అనంతరం భోగిమంటలు వెలిగించారు.

ధర్మవరంలో ఎడ్లబండిపై మంత్రి సత్యకుమార్, పక్కన ఆయన సతీమణి



నారావారిపల్లెకు పండుగ కళ.. అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్

స్వగ్రామంలో భోగి వేడుకల్లో చంద్రబాబు

తిరుపతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం నారావారిపల్లెలో సీఎం చంద్రబాబు కుటుంబ సభ్యులతో కలసి బుధవారం భోగి సంబరాలు నిర్వహించారు. తెల్లవారుజామునే భోగి మంటలు వెలిగించి వేడుకలో పాల్గొన్నారు. హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల ప్రదర్శనలను సతీమణి భువనేశ్వరితో కలసి తిలకించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు నారావారిపల్లెకు చేరుకుని సీఎంకు భోగి శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్దఎత్తున వచ్చిన ప్రజల నుంచి మంత్రి లోకేశ్ ఫిర్యాదులు స్వీకరించారు. తిరుపతిలోని శెట్టిపల్లె భూ సమస్యకు పరిష్కారం చూపిన ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపేందుకు బాధితులు నారావారిపల్లెకు చేరుకున్నారు. 'థ్యాంక్యూ సీఎం సార్' అంటూ ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. సాయంత్రం 5గంటలు దాటినా సీఎం నివాసం వద్దకు పెద్దఎత్తున వస్తున్న ప్రజలను గురువారం రావాలని అధికారులు పంపేశారు. కాగా, సంక్రాంతి సందర్భంగా గురువారం చంద్రబాబుతో పాటు కుటుంబసభ్యులు నాగాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం తన తల్లిదండ్రులు నారా ఖర్జురపు నాయుడు, అమ్మణమ్మల సమాధుల వద్ద చంద్రబాబు నివాళులు అర్పించి, స్థానిక కార్యక్రమాల్లో పాల్గొని తిరుగుప్రయాణం కానున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి లోకేశ్

సంబరాల్లో హోం మంత్రి

నక్కపల్లి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం సారిపల్లివానిపాలెంలోని హోంమంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయం వద్ద సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఉదయం హోం మంత్రి అనిత భోగిమంటను వెలిగించారు. తదుపరి నియోజకవర్గ పరిధిలో మహిళల కోసం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. ఈ సంబరాల్లో కేరళ నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హోం మంత్రి అనిత కూడా డ్రమ్స్ వాయిస్తూ సందడి చేశారు. అనంతరం ఎద్దుల బండిని నడిపారు.



ప్రకృతి సమతుల్యతే పొంగల్!

ఇది.. ప్రపంచస్థాయి పండుగ

- పురాతన నాగరికతకు చిహ్నం
- ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటన
- సంక్రాంతి వేడుకల్లో పాల్గొన్న పీఎం
- వేడుకల్లో పాల్గొన్న కేంద్ర మంత్రులు

న్యూఢిల్లీ, జనవరి 14: ప్రకృతిని సమతుల్యం చేయడమే పొంగల్ ఇస్తున్న సందేశమని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. దీనిని ప్రపంచ స్థాయి పండుగగా అభివర్ణించారు. పురాతన నాగరికతకు చిహ్నమని తెలిపారు. విశ్వవ్యాప్తంగా ఉన్న తమిళులు సంప్రదాయ బద్ధంగా నిర్వహించుకునే ఉత్సవమని పేర్కొన్నారు. ఢిల్లీలోని కేంద్ర మంత్రి ఎల్. మురుగన్ నివాసంలో బుధవారం పొంగల్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని దాదాపు తమిళ సంప్రదాయాన్ని పాటించారు. ఈ వేడుకలకు తమిళనాడుకు చెందిన పలువురు ప్రముఖులతో పాటు ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, ఇటీవల విడుదలైన తమిళ మూవీ 'పరాశక్తి' బృందం కూడా హాజరైంది. అదేవిధంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన కేంద్రమంత్రులు రామ్మోహన్‌నాయుడు, కిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వచ్చే కొద్ది మాసాల్లో తమిళనాడు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఈ వేడుకకు అత్యంత ప్రాధాన్యం ఏర్పడింది. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. ఈ పండుగ రైతు కష్టాన్ని, భూమికి-భానుడికి కృతజ్ఞతను తెలియజేస్తుందని అన్నారు. కృతజ్ఞత కేవలం మాటలకే పరిమితం కాకుండా దైనందిన జీవితంలో అంతర్భాగంగా మారాలని ఈ పండుగ చెబుతుందన్నారు. పుడమి మనకు ఎన్నో ఇస్తోందని.. దానిని పరిరక్షించుకోవడం మన కర్తవ్యమని తెలిపారు. జల సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్తు తరాల కోసం వనరులను తెలివిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న తమిళ సమాజం పొంగల్‌ను ఎంతో ఘనంగా నిర్వహించుకుంటుందని.. వారితో కలిసి తాను ఈ వేడుక నిర్వహించుకోవడం గర్వకారణమని పేర్కొన్నారు. జీవించి ఉన్న పురాతన నాగరికతకు తమిళ సంస్కృతి నిదర్శనమని కొనియాడారు. కాగా.. 'వణక్కం' అంటూ ప్రధాని తన ప్రసంగాన్ని ప్రారంభించారు. పొంగల్‌ను నేడు ప్రపంచ వేడుకగా నిర్వహిస్తున్నారని తెలిపారు. కాగా.. ఈ వేడుకల్లో 'పరాశక్తి' సినిమా బృందం సందడి చేసింది.



కేంద్రమంత్రి మురుగన్ నివాసంలో నిర్వహించిన పొంగల్ వేడుకల్లో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ, కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే పండుగలు

ఈ సందర్భగా మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, 'సంక్రాంతి, పొంగల్ రైతులకు, ప్రకృతికి కృతజ్ఞతలు తెలిపే పండుగలు. దేశ వ్యవసాయ సంప్రదాయాలను, సాంస్కృతిక ఏకత్వాన్ని, ఘనమైన వారసత్వాన్ని గౌరవించే సందర్భాలు' అని పేర్కొన్నారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ, సంక్రాంతి, పొంగల్ దేశ సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీక అని పేర్కొన్నారు.

ఏపీ భవన్‌లో సంక్రాంతి సందడి

- భారీగా తరలివచ్చిన ఢిల్లీలోని తెలుగు ప్రజలు
- మూడు రోజులు కొనసాగనున్న వేడుకలు
- ఉచితంగా కొత్త సినిమాల ప్రదర్శన

న్యూఢిల్లీ, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలోని ఏపీ భవన్‌లో సంక్రాంతి సందడి నెలకొంది. ఏపీ భవన్ రెసిడెంట్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్ బుధవారం తెల్లవారుజామున భోగి మంటలను వెలిగించి సంక్రాంతి వేడుకలను ప్రారంభించారు. తెలుగు సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఉద్యోగులు రంగవల్లులు, గొబ్బెమ్మలను తీర్చిదిద్దారు. హరిదాసుల వేషధారణలు, కోడి పందేలు, రాష్ట్రం నుంచి వచ్చిన కళాకారులతో ఏర్పాటు చేసిన కార్యక్రమాలు తెలుగువాళ్లను అలరించాయి. తెలుగు వారికి వినోదం కోసం ఇటీవల విడుదలైన చలన చిత్రాలను ఏపీ భవన్‌లో ప్రత్యేకంగా ప్రదర్శించేందుకు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల స్టాళ్లను, ఉత్తరాంధ్ర వంటలు, ఆంధ్ర రుచులను ఢిల్లీలోని తెలుగు వారికి అందించేందుకు ప్రత్యేకంగా స్టాళ్ల ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సలహాదారు అశోక్ జైన్, ఉన్నతాధికారులు కదిరి మోహన ప్రభాకర్, సురేశ్ బాబు తదితరులు పాల్గొన్నారు. ఏపీభవన్‌లో సంక్రాంతి సంబరాలు మూడు రోజులు కొనసాగుతాయని అధికారులు తెలిపారు. మకర సంక్రాంతి, కనుమ రోజుల్లోనూ సాంస్కృతిక కార్యక్రమాలు, విందు వినోదాలతో ఏపీభవన్ కళకళలాడనుందన్నారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన తెలుగువారు కుటుంబ సమేతంగా తరలిరావడంతో ఏపీ భవన్ సహా పరిసర ప్రాంతాలన్నీ కిటకిటలాడాయి.



సంక్రాంతి పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులతో ఏపీభవన్ అధికారులు

సంస్కృతి, సంప్రదాయాల సమ్మిళితం సంక్రాంతి

- గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం సంక్రాంతి శుభాకాంక్షలు



తిరుమల శ్రీవారి ఆలయం ముందు భోగి సంబరాలు

సంక్రాంతి పండుగ సందర్భంగా భోగి మంటల వెలుగుల్లో తిరుమల శ్రీవారి ఆలయం ప్రత్యేక కళను సంతరించుకుంది. శ్రీవారి ఆలయ మహాద్వారం వద్ద వేకువజామున టీటీడీ అధికారులు, సిబ్బంది సంప్రదాయంగా భోగి వేశారు. ఈక్రమంలో శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చిన భక్తులు కూడా భోగి సంబరాల్లో పాల్గొని సంతోషం వ్యక్తం చేశారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

అమరావతి, న్యూఢిల్లీ, జనవరి 14(ఆంధ్రజ్యోతి): మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని పలువురు ప్రముఖులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ శుభాకాంక్షలతో లోక్‌భవన్ అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'సంక్రాంతి పండుగ మన సంస్కృతి, సంప్రదాయాల్లో ఒక ముఖ్యమైన భాగం. ఉత్సాహభరితమైన సంక్రాంతి వేడుకలు మన యుగాల నాటి సంప్రదాయాలు, సమాజంలోని అన్ని వర్గాలను కలిపి ఉంచే వైభవమైన గతం యొక్క జ్ఞాపకాలను వెలికితీస్తాయి. ఈ శుభ సందర్భం మనందరిలో ప్రేమ, అప్యాయతలను, స్నేహ, సోదర భావాలను పెంపొందిస్తుంది' అని గవర్నర్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఓ ప్రకటన చేస్తూ... 'విశిష్టమైన ఈ సంక్రాంతి పండుగ ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా. పాడిపంటలతో పల్లె సీమలు మరింత కళకళలాడాలి. ఆధునికతను సంతరించుకున్నప్పటికీ, మన సంప్రదాయాలను మరచిపోకుండా పాటించాలి. రైతన్నలు ఆనందంగా ఉండాలని, కష్టజీవులు శ్రమకు తగిన ఫలితం పొందాలని కోరుకుంటున్నా. అందుకు అనువైన పథకాలతో ప్రభుత్వం మరింత బాధ్యతతో వ్యవహరిస్తుందని హామీ ఇస్తున్నా' అని పేర్కొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఓ ప్రకటన చేస్తూ... 'సంక్రాంతి అనగానే భోగి మంటలు, గంగిరెద్దుల, రంగవల్లులు, హరిదాసు కీర్తనలు, సంప్రదాయ పందాలు, కొత్త దుస్తులు, పిండి వంటలు. రెండు తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి. కూటమి ప్రభుత్వం రాకతో ఏపీ అంతటా ప్రశాంతత వెల్లివిరుస్తోంది. ఈ సంక్రాంతి తెలుగు వారందరికీ సర్వైశ్వర్యం, సమృద్ధి, శుభ మంగళాలను ప్రసాదించాలని ఆ సర్వేశ్వరుడ్ని వేడుకుంటున్నా' అని పేర్కొన్నారు.

కృష్ణా బోర్డులో ఏపీ అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు

హైదరాబాద్, జనవరి 14(ఆంధ్రజ్యోతి): కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)లో ఇద్దరు అధికారులకు పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెడుతూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం బోర్డులో డీఈఈగా పనిచేస్తున్న పి.రవిచంద్రకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఈఈ)గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించింది. విజయవాడలో ప్రాజెక్ట్ అండ్ మానిటరింగ్ సెల్‌లో ఈఈగా పనిచేస్తున్న బి.హైఫ్‌జినత్‌కు ఎస్ఈగా పూర్తి అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. ఈ మేరకు జలవనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉద్యోగులకు పండగొచ్చె..

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టర్లలో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. డీఏ, డీఆర్ ఎరియర్స్ నిమిత్తం ఒక్కో ఉద్యోగి, పోలీసు ఖాతాలో రూ.70 నుంచి 80వేల వరకు జమ అవుతున్నాయి. పోలీసులకు అదనంగా సరెండర్ లీవులు, టీఏలు కూడా జమ అవుతున్నాయి. రిటైర్డ్ ఉద్యోగులకూ డీఏ, డీఆర్ బకాయిలు జమవుతున్నాయి. సుమారు 5.70 లక్షల మంది ఖాతాల్లో నిధులను ఆర్థికశాఖ జమ చేస్తోంది. ఉద్యోగ, పోలీసు సంఘాలు ప్రభుత్వానికి, సీఎంకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

పోలీసు సంఘం హర్షం

పోలీసులకు రావాల్సిన సరెండర్ లీవులు, డీఏ ఎరియర్లను ప్రభుత్వం విడుదల చేసిందని ఏపీ పోలీసు అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరావు తెలిపారు. దీంతో ఈసారి సంక్రాంతి పండగను తామందరం చాలా సంతోషంగా జరుపుకొంటున్నామని చెప్పారు. గతంలో సీఎం చంద్రబాబును కలవగానే సరెండర్ లీవులు విడుదల చేస్తామని చెప్పారని, హామీ ఇచ్చిన విధంగానే నిధులను విడుదల చేశారన్నారు. ముఖ్యమంత్రికి పోలీసులు అందరి తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని చెప్పారు. నిధులు విడుదల చేసేందుకు సహకరించిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, హోం మంత్రి వంగలపూడి అనిత, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

థ్యాంక్స్ సీఎం సార్: ఉద్యోగులు

రాష్ట్రంలోని మూడు లక్షల మంది సీపీఎస్ (కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్) ఉద్యోగులకు రావాల్సిన 60 నెలల డీఏ బకాయిలను ఒకే దఫాలో చెల్లించినందుకు ఏపీ సీపీఎస్ ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపింది. రాష్ట్రంలోని సీపీఎస్ ఉద్యోగులందరూ ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు జరుపుకొనే అవకాశం కల్పించారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, ఉన్నతాధికారులకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోరుకొండ సతీశ్, సీఎం దాస్ బుధవారం ఒక ప్రకటనలో ధన్యవాదాలు తెలిపారు.

'లిన్'తో మద్యం అక్రమాలకు చెక్

- ప్రతి మద్యం సీసాకు ఓ గుర్తింపు నంబరు
- స్టేట్‌కు, బ్రాండ్‌కు ప్రత్యేక కోడ్
- 20కు పైగా అంకెలతో లిన్
- సీసా లేబుల్‌పైనే నంబరు ముద్రణ
- అది చించేస్తే బ్రాండ్ పేరూ పోతుంది
- బెల్టులు, నకిలీల అడ్డుకట్టకు ఎక్సైజ్ గట్టి చర్యలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మద్యం అక్రమాల అడ్డుకట్టకు ఎక్సైజ్ శాఖ గట్టి చర్యలు చేపట్టింది. లిక్కర్ ఐడెంటిఫికేషన్ నంబరు(లిన్)ను అమల్లోకి తీసుకొస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకోసం లిక్కర్, బీరు, వైన్ రూల్స్‌కు సవరణలు చేసింది. లిన్‌తో బెల్టులు, నకిలీ మద్యానికి చెక్ పెట్టొచ్చని ఎక్సైజ్ వర్గాలు చెబుతున్నాయి. లిన్‌లో ప్రత్యేక గుర్తింపు నంబరు ఉంటుంది. ఇది ప్రతి సీసాకూ మారిపోతుంది. ఏపీకి ఒక కోడ్, బ్రాండ్‌కు ఒక కోడ్ ఇచ్చి ఆ తర్వాత బ్యాచ్ నంబరు, లైన్ నంబరు, సంవత్సరంతో కలిపి తేదీ, గంటలు, నిమిషాలు, సెకన్లు, మిల్లీ సెకన్లతో సహా ఒక పెద్ద నంబరును సీసాపై ముద్రిస్తారు. లిన్ నంబరు 20 కంటే ఎక్కువ అంకెలతో ఉంటుంది. రాష్ట్రంలో సుమారు 240 మద్యం బ్రాండ్లు ఉన్నాయి. ప్రతి బ్రాండ్‌కు ప్రత్యేక కోడ్ ఉంటుంది. ప్రస్తుత విధానంలో ఒక బ్యాచ్‌కు ఒక నంబరు ముద్రిస్తున్నారు. ఒక బ్యాచ్‌లో వేల సంఖ్యలో సీసాలు ఉత్పత్తి అవుతాయి. లిన్‌తో ప్రతి సీసాకు ప్రత్యేకంగా నంబరు వస్తుంది. అయితే దానిని లేబుల్‌పై ముద్రించడమే కీలకం.

హీల్ కోడ్‌లు చించేస్తున్నారు

మద్యాన్ని బెల్టు షాపుల్లో పెట్టి అమ్మేవారు మొట్టమొదట సీసా మూతలపై ఉండే హీల్ కోడ్‌లను చించేస్తారు. హీల్ కోడ్‌పై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే వివరాలు తెలిసిపోతాయి. అక్రమంగా మద్యం అమ్మేవారు హీల్ కోడ్‌లు తొలగిస్తే.. ఎక్సైజ్ దాడుల్లో సీసా పట్టుబడినా కచ్చితంగా ఎక్కడినుంచి వచ్చిందనే సమాచారం ఉండదు.

లిన్‌లో ఏం చేస్తారు?

లిన్‌ను బ్రాండ్ పేరు ఉండే లేబుల్‌పైనే ముద్రిస్తారు. లిన్‌లో సీసాకు సంబంధించిన మొత్తం సమాచారం ఉంటుంది. ప్రతి సీసాకూ లిన్ మారిపోతుంది. బెల్టులు నడిపేవారు అది చించివేస్తే బ్రాండ్ పేరు కూడా పోతుంది. అప్పుడు వినియోగదారులు ఆ సీసాలను కొనేందుకు ఆసక్తి చూపరు. అలాగే మూతపై ఉండే హీల్ కోడ్‌ను, సీసాపై ఉండే బార్ కోడ్‌ను లింక్ చేస్తారు. దీనివల్ల హీల్ కోడ్ పోయినా బార్‌కోడ్‌లో దొరికిపోతారని ఎక్సైజ్‌వర్గాలు చెబుతున్నాయి. లిన్ వల్ల బెల్టులతో పాటు నకిలీ మద్యానికీ చాలావరకు అడ్డుకట్ట పడుతుందంటున్నాయి. నకిలీ మద్యం ఉత్పత్తి చేసేవారు నకిలీ హీల్ కోడ్‌లు, లేబుళ్లు కూడా తయారుచేసే అవకాశం ఉంది. లిన్ నంబరు వస్తే ప్రతి బ్రాండ్‌కు ప్రత్యేకమైన కోడ్, ఎక్కువ అంకెలు ఉండటం వల్ల నకిలీ తయారు అసాధ్యం అంటున్నారు.



తాడిపత్రిలో పందుల పోటీలు

సంక్రాంతి వేడుకల్లో భాగంగా అనంతపురం జిల్లా తాడిపత్రిలో బుధవారం పందుల పోటీలు నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పట్టణంలోనిజూనియర్ కళాశాల మైదానంలో జరిగిన ఈ పోటీలను తిలకించేందుకు జనం ఆసక్తిగా తరలివచ్చారు. ఈ పోటీలో పాల్గొన్న పందుల యజమానులకు రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10వేలు చొప్పున నగదు బహుమతులను అందజేశామని నిర్వాహకులు తెలిపారు.

- తాడిపత్రి-ఆంధ్రజ్యోతి

చట్టనిబంధనలు పాటించకుండా ఎఫ్ఐఆర్

- కేసు నమోదులో యాంత్రికంగా వ్యవహరించారు
- పోలీసుల వైఖరిని తప్పుబట్టిన హైకోర్టు



అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక దొంగతనం ఆరోపణలతో నమోదు చేసిన కేసులో పోలీసులు చట్టనిబంధనలు అనుసరించకపోవడాన్ని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. రూ.5వేల విలువ కలిగిన ఆస్తి చోరీ కేసులో మేజిస్ట్రేట్ అనుమతి తీసుకోకుండా పోలీసులు నేరుగా ఎఫ్ఐఆర్ నమోదు చేయడం న్యాయ విచారణ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని పేర్కొంది. భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 303(2) ప్రకారం దొంగలించిన ఆస్తి విలువ రూ.5వేలకు లోబడి, మొదటిసారి నేరానికి పాల్పడి ఉంటే.. అది నాన్-కాగ్నిజబుల్ నేరం కిందికి వస్తుందని గుర్తుచేసింది. తహశీల్దార్ నివేదిక ప్రకారం ప్రస్తుత కేసులో పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇసుక విలువ రూ.1,500 మాత్రమేనని పేర్కొంది. ఖనిజ చట్ట నిబంధనల ప్రకారం అధీకృత అధికారి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తేనే కోర్టు విచారణ చేపట్టాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుత కేసులో మేజిస్ట్రేట్ నుంచి ముందస్తు అనుమతి తీసుకోకుండా ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు.. దర్యాప్తు అనంతరం చార్జిషీట్ దాఖలు వరకూ యాంత్రికంగా వ్యవహరించారని పేర్కొంది. ఈ నేపథ్యంలో రసిదుల్లాపై కర్నూలు మేజిస్ట్రేట్ కోర్టు వద్ద విచారణ పెండింగ్‌లో ఉన్న కేసును రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. అయితే పిటిషనర్ పై చట్టప్రకారం అధికారులు చర్యలు తీసుకోవచ్చని, ప్రస్తుత ఉత్తర్వులు అందుకు అడ్డంకి కాబోవని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. ఇసుక దొంగతనం ఆరోపణలతో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరుకు చెందిన పి.రసిదుల్లాపై సి.బెళగల్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 303(2), ఖనిజ చట్టం, ఇతర సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తు పూర్తిచేసి సంబంధిత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి కర్నూలు ఫస్ట్‌క్లాస్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ వద్ద జరుగుతున్న ప్రొసీడింగ్స్‌ను కొట్టివేయాలని కోరుతూ రసిదుల్లా హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ ఇటీవల విచారణకు రాగా పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది పోసాని వెంకటేశ్వర్లు వాదనలు వినిపించారు. వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించారు.

అంటువ్యాధుల గుర్తింపులో ప్రజల భాగస్వామ్యం

- ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్ వెబ్ లింక్‌లో ఫిర్యాదు
- ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్

అమరావతి, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): అంటువ్యాధులను ప్రాథమిక దశలోనే గుర్తించి, తక్షణ చర్యలు తీసుకోవడంలో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖ కమిషనర్ వీరపాండియన్ బుధవారం తెలిపారు. ఈ దిశగా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వ్యాధి నిఘా కార్యక్రమం (డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్) కింద రూపొందించిన సమగ్ర ఆరోగ్య సమాచార వేదిక (ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ ప్లాట్‌ఫామ్-ఐహెచ్ఐపీ) వెబ్ లింక్ ద్వారా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని తెలిపారు. పరిసరాల అపరిశుభ్రత, మురుగు నీటి డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, తాగునీరు కలుషితం కావడం వల్ల కొన్ని ప్రాంతాల్లో ప్రజలు మూకుమ్మడిగా వాంతులు, విరోచనాలు వంటి వ్యాధుల బారినపడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఈ తరహా ఘటనలు క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా సకాలంలో పైస్థాయి అధికారులకు చేరడంలో జాప్యం జరుగుతుంది. దీన్ని అధిగమించే చర్యల్లో భాగంగా వ్యాధుల నియంత్రణలో ప్రజలను కూడా భాగస్వాములను చేయాలని నిర్ణయించినట్లు వీరపాండియన్ వెల్లడించారు. ఇందుకోసం "ఎంవోహెచ్ఎఫ్‌డబ్ల్యూ.జీవోవీ.ఐన్" అనే వెబ్‌లింక్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామని, ప్రజలు ఈ వెబ్‌లింక్‌లో నమోదుచేసిన సమాచారం క్షణాల్లోనే ఏఎన్ఎం, పీహెచ్‌సీ వైద్యాధికారి, జిల్లా అధికారులు, రాష్ట్రస్థాయి అధికారులకు చేరుతుందని చెప్పారు. ఈ ఫిర్యాదుల ఆధారంగా క్షేత్రస్థాయి సిబ్బంది నుంచి ఉన్నతాధికారుల వరకూ వెంటనే అప్రమత్తమై తగిన చర్యలు చేపడతారని పేర్కొన్నారు. ఈ అవకాశం ద్వారా ప్రజలు అంటువ్యాధుల నివారణలో ప్రభుత్వానికి సహకరించాలని వీరపాండియన్ విజ్ఞప్తి చేశారు.

కారవాన్‌లో క్యాసినో..!?

సంక్రాంతి సంబరాల్లో కొత్త సంప్రదాయం

(నూజివీడు-ఆంధ్రజ్యోతి)

సంక్రాంతి సంబరాల్లో కొత్త సంప్రదాయానికి తెరలేచింది. ఉమ్మడి కృష్ణా జిల్లా పరిధిలోని గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో సంక్రాంతి సంబరాల్లో భాగంగా సంప్రదాయ కోడిపందేల బరుల వద్ద కారవాన్ల సాక్షిగా క్యాసినోలు నిర్వహించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గన్నవరం నియోజకవర్గంలో ఐదు కారవాన్‌లు ఏర్పాటు చేయగా.. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని మీర్జాపురంలో రెండు కారవాన్లను అందుబాటులో ఉంచారు. ఈ కారవాన్‌లో నిర్వహించే కాసినోలో పాల్గొనాలంటే లక్ష రూపాయల టోకెన్ ఉండాలనే ప్రచారం సాగుతోంది. అది కూడా ముందుగా ఎంపిక చేసిన వారిని మాత్రమే అనుమతిస్తున్నట్టు తెలిసింది. ఒక్కో కారవాన్‌లో సుమారు 15 ఆటలు సాగినట్టు, రూ.లక్షల్లో డబ్బులు చేతులు మారినట్టు సమాచారం. కారవాన్ల దరిదాపుల్లోకి వెళ్లేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే వారిని బౌన్సర్లు అడ్డుకోవడం ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తోంది.



ఏలూరు జిల్లా మీర్జాపురంలో సంక్రాంతి బరుల వద్ద నిలిపి ఉంచిన కారవాన్



తూర్పుపాలెంలో వరుసగా ఐదు పందేలు గెలిస్తే బహుమానంగా ప్యారీ వద్ద ఏర్పాటు చేసిన బుల్లెట్ బండి

ఏలూరులో ఎగసిన సందడి..

ప్రతి చోటా కోళ్లు కత్తులతో రివ్వున ఎగిరాయి. బరులు హైటెక్ హంగులు, అలంకారాలతో ఆకట్టుకున్నాయి. ఏలూరు జిల్లాలో బుధవారం సుమారు రూ.30 కోట్ల పైబడి కోడి పందేల్లో చేతుల మారాయి. బరుల వద్దే గుండాట, పేకాటలు సాగాయి. పెదవేగి మండలం దుగ్గిరాలలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, నారాయణపురంలో ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కొయ్యలగూడెంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పందేలను ప్రారంభించారు. ఈ జిల్లాలో చిన్నచితకా కలిపి 150 వరకు బరులు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ కూడా ఫ్లడ్ లైట్ల వెలుతురులో పోటీలు నిర్వహించారు. కొయ్యలగూడెం రామానుజపురంలో నాలుగు ఎకరాల పామాయిల్ తోటలో ఏర్పాటు చేసిన బరిలో 15 పందేల్లో కనీసం 8 పందేలు గెలిచిన వ్యక్తికి రూ.2.50 లక్షల బుల్లెట్‌ను బహూకరించారు. ఇదే మండలం గవరవరంలో నూతగ్గి ఆశా జ్యోతి ఎక్కువ పందేలు గెలిచి బుల్లెట్ గెలుచుకున్నారు. ముదినేపల్లి మండలంలోను బుల్లెట్‌లను బహూకరించారు. కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్ల బరిలో కోడిపందేల్లో గెలిచిన వారికి క్రెటా కారు, రెండు బుల్లెట్లు నజరానాగా ప్రకటించారు.

కో... అంటే కోట్లు

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలో బుధవారం పందెం పుంజులు కత్తులు దూశాయి. బరుల్లో రక్తమోడుతూ తలపడ్డాయి. నిర్వాహకుల వడిలో రూ.కోట్లు రాల్చాయి. పశ్చిమ గోదావరి జిల్లాలో సంక్రాంతి పండగ తొలిరోజే దాదాపు రూ.100 కోట్ల మేర చేతులు మారాయి. భారీ బరుల వద్ద విందులతో నిర్వాహకులు పందెంరాయుళ్లలో జోష్ నింపారు. పేకాట, గుండాట, మూడు ముక్కలాట, లోనా బయటా.. వంటి జూదాలు యథేచ్ఛగా సాగాయి. మద్యం ఏరులై పారింది. చికెన్ అమ్మకాలు తారస్థాయికి చేరాయి. ఉండి నియోజకవర్గం పెద అమిరంలో బరికి పాస్‌లు మంజూరు చేశారు. అతిథులకు కారవాన్‌ల్లో వసతి కల్పించారు. ఒక్కో పందెం రూ.20 లక్షల నుంచి 25 లక్షల వరకు కాశారు. అక్కడకు సమీపంలోని సీసలిలో ప్రతి పందెం రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వెళ్లింది. రెండు బరుల్లోనూ ముఖ్య నాయకులు పందేల్లో పాల్గొన్నారు. భీమవరం రూరల్ మండలం తాడేరు బరిలో ప్రహర్ష అనే యువకుడు వరుసగా నాలుగు పందేలు నెగ్గి బుల్లెట్‌ను గెలుచుకున్నాడు. ఇక్కడ ప్రతి పందెం రూ.లక్షల్లోనే సాగింది. తాడేపల్లిగూడెం పట్టణ సమీపంలోని ఓ తోటలో బుధవారం ఒకేరోజు 20 పందేలు నిర్వహించారు. ప్రతి పందెం ఏకంగా రూ.25 లక్షల వరకు జరిగింది. ఒక ముసుగు పందెన్ని రూ.65 లక్షలకు కాశారు. తాడేపల్లిగూడెం రూరల్ మండలంలో ఇదే పెద్దబరి. దీంతో ఇతర రాష్ట్రాల నుంచీ పందెం రాయుళ్లు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

ముసుగు పందెం రూ.కోటి

పశ్చిమ గోదావరి జిల్లా పెద అమిరంలో ఒకే ఒక్క ముసుగు పందెం కోటి రూపాయల వరకు కాశారు. ఇరు వర్గాలు ముసుగులోనే కోడి పుంజులను తెచ్చి బరిలో నిలిపారు. రెండు కోళ్లు హోరాహోరీగా తలపడ్డాయి. భీమవరం మండలం తాడేరు, గొల్లవానితిప్ప రోడ్డులో 10 బరులు వేశారు.

కాయ్ రాజా కాయ్..: కాయ్ రాజా కాయ్ అంటూ.. పందెం రాయుళ్లను బరుల నిర్వాహకులు ఉత్సాహపరిచారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కోడి పందాల్లో కోట్ల రూపాయలను పణంగా పెట్టారు. గుండాటల్లో రూ. లక్షల్లోనే కాసి జేబులు ఖాళీ చేసుకున్నారు. 100కు పైగా పందెం బరుల్లో తొలిరోజు రూ.30 నుంచి రూ.40 కోట్ల మేర చేతులు మారినట్లు అంచనా. వీఐపీ బరిగా పేరున్న ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి వద్ద భారీసంఖ్యలో కార్లు, మోటార్‌సైకిళ్లలో జనం క్యూకట్టారు. ప్రైవేట్ సైన్యం (బౌన్సర్లు) తనిఖీలు చేసి మరీ ఆ బరిలోకి పంపించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో రాత్రి పగళ్లు పోటీలు సాగుతున్నాయి. డిజిటల్ స్క్రీన్లు కూడా ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. కోట్ల రూపాయల మేర ఇక్కడ పందేలు కాశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ దాట్ల సుబ్బరాజు, టీడీపీ ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్, టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌తో సహా పలువురు ప్రముఖులు హాజరై తొలిరోజు పందేలను వీక్షించారు. సఖినేటిపల్లిలో కోడిపందేల బరి వద్ద ఆస్ట్రేలియా దేశస్తులు కోడిపుంజులను పట్టుకుని ఫొటోలు దిగి సందడి చేశారు. వందల సంఖ్యలో గుండాటలు ఏర్పాటు చేసి ఫోన్‌పేల్లో సైతం డబ్బులు కాయించి మరీ ప్రేక్షకులను నిలువు దోపిడీ చేశారు. రాజోలు దీవిలోని 10కిపైగా గ్రామాల్లో పండగ ముసుగులో అశ్లీల నృత్యాలు సాగాయి.

గుండాటలో మహిళల జోష్

పశ్చిమగోదావరి జిల్లా తాడేరులో ఎగ్జిబిషన్‌ను తలపించే రీతిలో బరి నిర్వహించి పందేలు కాశారు. యలమంచిలిలో సంక్రాంతి సంబరాల్లో 18 రకాల సంప్రదాయ మిఠాయిలు, మాంసాహారంతో 20 వేల మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఆ పక్కనే బరిలో నిర్వహించిన గుండాటలో మహిళలు సైతం ఉత్సాహంతో పాల్గొన్నారు. తణుకు నియోజకవర్గంలో తేతలి, వేల్పూరులో బరులకు కార్లలో పందెం రాయుళ్లు వచ్చారు. పందెం రాయుళ్లకు గూగుల్ పే, స్కానర్లు ఏర్పాటు చేసి కమీషన్‌దారులు నగదు సమకూర్చారు.

కాకినాడలో రూ. కోట్ల కూత...

భారీ బరుల్లో కోడి పందేలు, గుండాట కలిపి కాకినాడ జిల్లాలో రూ.80కోట్లకు మించే పందేలు జరిగాయి. బరుల వద్ద అత్యధికంగా తెలంగాణ నుంచి వచ్చిన వారు పందేలు పెద్దఎత్తున కాశారు. కరప, తాళ్లరేవు, వలసపాకల, జగ్గంపేట, పెద్దాపురంలో పందేలు రూ.కోట్లు దాటాయి. ఇన్నోవా కార్లు, బుల్లెట్ గిఫ్టలతో బరుల వద్ద అసలు సిసలు సంక్రాంతి తలపించింది. తొలిరోజు పందేల్లో కొందరు తెలంగాణవాసులు బుల్లెట్లు గెలుచుకున్నారు. కాకినాడ రూరల్‌లోని వలసపాకలో భారీ బరుల్లో కోడిపందేలు, గుండాట కలిపి రూ.4కోట్లకుపైగా లావాదేవీలు జరిగాయి. కరప మండలంలో రూ.8కోట్లకుపైగా పందేలు సాగాయి. ఇక్కడ మూడురోజులపాటు జరిగే మొత్తం 63 పందేల్లో అత్యధిక పందేలు గెలిచే విజేతకు ఇన్నోవా కారు బహుమతిగా ప్రకటించారు. యానాం సమీపంలోని తాళ్లరేవులో తొలిరోజు పందేలు రూ.6కోట్లు దాటాయి. గుడివాడలో ఆంధ్ర-తెలంగాణ మధ్య జరిగిన పందేల్లో ఆంధ్రాకు చెందిన పుంజు గెలవడంతో సంబరాలు జరిగాయి. విజేతకు బుల్లెట్ అందించారు. పులిమేరు మండలంలోని రాయభూపాలపట్నంలో కోడిపందేల బరుల విషయంలో టీడీపీ, జనసేన నేతల మధ్య ఉద్రిక్తత నెలకొంది. ఇరువర్గాల నేతల మధ్య వివాదం చెలరేగి పందేలు ఆగిపోయాయి.



కాకినాడ జిల్లా కరపలో పందెంబరివద్ద పెద్దమొత్తంలో డబ్బుతో పందెంరాయుళ్లు



బెజవాడలో ఏర్పాటు చేసిన బరిలో గుండాట టేబుల్ వద్ద యువతుల సందడి



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం లొల్లలో కోడి పందేలు వద్ద విజేతలకు ఇవ్వడానికి సిద్ధం చేసిన క్రెటా కారు, బుల్లెట్‌లు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లిలో కోడిపందేల బరి వద్ద కోడిపుంజుతో ఆస్ట్రేలియా దేశస్తులు



ఏలూరు జిల్లా కాళ్ల మండలం సీసలి బరి వద్ద పందేల్లో గెలిచిన డబ్బును క్యాష్ కౌంటింగ్ మిషన్ ద్వారా లెక్కిస్తున్న దృశ్యం




డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరంలో కోడికి కత్తికడుతున్న పందెంరాయుళ్లు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల బరి వద్ద రాత్రి విద్యుత్ వెలుగులో పందేలను వీక్షిస్తున్న ప్రేక్షకులు



పశ్చిమగోదావరి జిల్లా భీమవరం రూరల్ మండలం తాడేరు రోడ్డులో పందేలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్ల వద్ద బరికి తరలివచ్చిన వాహనాలు





విజయవాడలో బరిలో కోళ్ల కొట్లాట

విజయవాడలోని గుణదలలో ఏర్పాటు చేసిన కోడి పందేల బరి వద్ద బుధవారం కార్ల బారులు



ఏలూరు రూరల్ మండలం మాదేపల్లిలో లోపల బయట ఆట

బరుల వద్దకు తరలొచ్చిన 'తెలంగాణ'

ఏలూరు జిల్లా నూజివీడు రూరల్ మండలం మీర్జాపురంలో పదెకరాల బరిలో ఏర్పాటు చేసిన కోడి పందేలను తిలకించడానికి తెలంగాణ నుంచి పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు కార్లలో తరలివచ్చారు. వీరిలో తెలంగాణ ఇరిగేషన్ బోర్డు చైర్మన్ మువ్వ విజయ్‌బాబు, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య(ఇల్లెందు), జారే ఆదినారాయణ(అశ్వారావుపేట) తదితరులు ఉన్నారు. తొలిరోజు కోడి పందేలను తిలకించేందుకు 35 ఎంఎం ఎల్ఈడీ స్క్రీన్లు రెండు ఏర్పాటు చేశారు. బౌన్సర్లను నియమించారు. ఆరు టెంట్లు వేసి పేకాట శిబిరాలు నిర్వహించారు. నూజివీడులో నిర్వహించిన కోడి పందేల్లో సుమారు రూ.7 కోట్లు చేతులు మారినట్టు అంచనా. అలాగే, ఇక్కడ పేకాటల రూపంలో రూ.3 కోట్లకు పైనే చేతులు మారాయి. బారికేడ్లు, వీఐపీ గ్యాలరీలు, ఫ్లడ్‌లైట్లు, మైక్ అనౌన్స్‌మెంట్లు, స్టేజీలు తదితర సౌకర్యాలను కల్పించారు.

'కృష్ణా'లో పండగ కేక..

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లాలో తొలిరోజున రూ.150 కోట్ల వరకు బెట్టింగ్‌లు జరిగినట్టు అంచనా. బుధవారం ఉదయం 7గంటల నుంచే పందేలు ప్రారంభమయ్యాయి. జగ్గయ్యపేట నుంచి మచిలీపట్నం వరకు బరులన్నీ జనంతో నిండిపోయాయి. కోడి పందేల శిబిరాల్లోనే పేకాట, గుండాట నిర్వహించారు. జగ్గయ్యపేట, నందిగామ, తిరువూరు నియోజకవర్గాల్లో బరుల వద్ద తెలంగాణ వాసులు ఎక్కువగా కనిపించారు. విజయవాడ రూరల్ మండలం నుంచి మచిలీపట్నం, గుడివాడ, గన్నవరం నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన బరుల వద్దకు మహిళలు, ఎన్ఆర్ఐలు ఎక్కువగా హాజరయ్యారు. పలు బరుల వద్ద మహిళల సైతం పందేలు కట్టారు.

బరిలోకి.. బాపట్ల

బాపట్ల జిల్లావ్యాప్తంగా కోడి పందేల బరుల వద్ద భోగి రోజు దాదాపు రూ.70 కోట్లు చేతులు మారాయి. చెరుకుపల్లి మండల పరిధిలో దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన బరిలోనే దాదాపు రూ.30 కోట్ల పందేలు జరిగినట్లు సమాచారం. పిట్టలవానిపాలెం మండల పరిధిలో పూర్తి హంగులతో బరిని కొలువుదీర్చి భారీగా జూద క్రీడలు నిర్వహించారు. ఇక్కడ రూ.25 కోట్ల వరకూ పందేలు జరిగినట్లు సమాచారం. వేమూరు నియోజకవర్గ పరిధిలో కూడా పెద్దసంఖ్యలో బరులు ఏర్పాటు చేశారు. చెరుకుపల్లి మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ పాల్గొన్నారు. పందేల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చిన అతిథులకు ఆయనే స్వాగతం పలికారు.

బుల్లెట్ గెలుచుకున్న బాపట్ల ఎమ్మెల్యే..



బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండల పరిధిలో ఏర్పాటు చేసిన బరిలో ప్రత్యేక బహుమతి బుల్లెట్‌ను స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ గెలుచుకున్నారు. పది పందేలకు గాను వరుసగా ఆరుసార్లు ఆయనే విజయం సాధించారు. ఈ పందేల్లో నరేంద్రవర్మతో పాటు ఆయన కుమారుడు కూడా పాల్గొన్నారు. చీరాల ఎమ్మెల్యే కొండయ్య కుమారుడు కూడా ఈ బరి వద్దే కోడి పందేలను వీక్షించారు. ఇదే బరిలో ఇంకో బుల్లెట్‌ను కర్లపాలెం మండలానికి చెందిన ఓ వ్యక్తి గెలుచుకున్నారు. ఇక పల్నాడు జిల్లా రొంపిచర్ల మండలం కొనకంచివారి పాలెం సమీపంలో, నరసరావుపేట మండలం దొండపాడు వద్ద ఏర్పాటు చేసిన కోడి పందేల బరులు కిటకిటలాడుతున్నాయి. దొండపాడు బరికి ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు.



ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో పందేలను తిలకిస్తున్న జనం



జగన్ ఫొటో ఉన్న పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేస్తున్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా నాయకులు

జగన్ ఫొటో ఉన్న పాస్ పుస్తకాలు దహనం

బెజవాడలో భోగి మంటల్లో వేసిన టీడీపీ నేతలు

విజయవాడ సిటీ, జనవరి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో జగన్ ఫొటోతో రైతులకు జారీ చేసిన పాస్ పుస్తకాలను తెలుగుదేశం పార్టీ నాయకులు భోగి మంటల్లో వేసి దహనం చేశారు. విజయవాడలోని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో బుధవారం భోగి వేడుకలు నిర్వహించారు. ఎంపీ చిన్ని, ఆయన కుటుంబ సభ్యులు, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ, పార్టీ నాయకులు బొప్పన భవకుమార్, సీతారామయ్య, షేక్ ఆషా, చెన్నుపాటి ఉషారాణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగన్ ఫొటో ఉన్న పాస్ పుస్తకాలను నాయకులు భోగి మంటల్లో వేశారు. ఎంపీ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో తీసుకొచ్చిన విధానాలను ఇప్పుడు ఆ పార్టీ నేతలే భోగి మంటల్లో కాల్చుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల ఆస్తులపై జగన్ బొమ్మను ముద్రించడాన్ని తప్పుబట్టారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర రాజముద్రతో పాస్ పుస్తకాలను మంజూరు చేసినట్లు చెప్పారు. ప్రజా నిర్ణయాలకు వ్యతిరేకంగా జగన్ బొమ్మతో ముద్రించిన పాస్ పుస్తకాలను భోగి మంటల్లో వేసి కొత్త సంక్రాంతికి స్వాగతం పలుకుతున్నట్లు తెలిపారు.



పోలవరం పనులకు ఫైనల్ టచ్!

- 19న రానున్న విదేశీ నిపుణులు.. 3 రోజులు ప్రాజెక్టు వద్దే మకాం
- 21 దాకా పనుల పురోగతి పరిశీలన.. కేంద్రానికి సమగ్ర నివేదిక సమర్పణ

అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు ప్రధాన పనులకు 'ఫైనల్ టచ్' ఇచ్చేందుకు విదేశీ నిపుణులు ఈ నెల 19న రానున్నారు. డేవిడ్ బి.పాల్, గియాస్ ఫ్రాంకో డి.సిస్కో (అమెరికా), రిచర్డ్ డొనెల్లీ, సీస్ హిన్స్‌బెర్జర్ (కెనడా) మూడ్రోజులు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించి.. క్షేత్ర స్థాయిలో పనుల పురోగతిని, నాణ్యతను స్వయంగా పరిశీలిస్తారు. పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సమక్షంలో వారు 21వ తేదీ దాకా.. మూడ్రోజులపాటు అత్యంత కీలకమైన డయాఫ్రం వాల్, ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణ పనులను సమీక్షిస్తారు. తర్వాత ఢిల్లీ వెళ్లి.. భవిష్యత్‌లో చేపట్టాల్సిన పనులపై సూచనలతో కూడిన నివేదికను కేంద్ర జలసంఘానికి సమర్పిస్తారు. పోలవరం ప్రాజెక్టు పనులు దాదాపు 87.8 శాతం మేర పూర్తయ్యాయి. మరో 12.2 శాతమే మిగిలి ఉన్నాయి ఈ నిపుణుల బృందం ఇప్పటికే నాలుగు దఫాలు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించింది. డెబ్బతిన్న డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా కొత్త వాల్‌ను నిర్మించాలని వీరు 2023లోనే సూచించినా.. నాటి జగన్ ప్రభుత్వం వినిపించుకోలేదు. 2024లో కూటమి ప్రభుత్వం వచ్చాక.. నిపుణుల సూచనల మేరకు గత ఏడాది జనవరి 18వ తేదీన 1,350 మీటర్ల పొడవైన డయాఫ్రం వాల్ నిర్మాణ పనులను జల వనరుల శాఖ చేపట్టింది ఇందులో 1071 మీటర్ల వరకు పనులు పూర్తయ్యాయి. మరో 279 మీటర్ల పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇవి కూడా వచ్చే నెల 15వ తేదీ నాటికి పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా 359 ప్యానెల్స్‌కు గాను 277 పూర్తయ్యాయి. మరో 82 ప్యానెల్స్ పనులు మిగిలి ఉన్నాయి. 53.32 మీటర్ల ఎత్తులో ఈసీఆర్ఎఫ్ డ్యాం పనులు ఇప్పటికే నడుస్తున్నాయి. వీటిని వచ్చే ఏడాది మార్చినాటికి పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థ ధీమాగా చెబుతోంది. ఈ పనులన్నింటినీ విదేశీ నిపుణులు క్షుణ్ణంగా పరిశీలించి జల సంఘానికి నివేదిక ఇవ్వనున్నారు.

భార్య వలపు వల.. భర్త వీడియో రికార్డింగ్

- కరీంనగర్‌లో ఓ దంపతుల గలీజు దందా
- అర్ధనగ్న ఫొటోలు, వీడియోలతో ఇన్‌స్టాగ్రామ్‌లో భార్య ఎర
- నమ్మివచ్చిన వారితో రాసలీలలు
- గుట్టుచప్పుడు కాకుండా వీడియోలు తీసే ఆమె భర్త
- వాటితో బ్లాక్‌మెయిల్, లక్షలు వసూలు
- బాధితుల్లో వ్యాపారులు, వైద్యులు
- నిందితుల అరెస్టు

కరీంనగర్ క్రైం, జనవరి 14 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో అర్ధనగ్న ఫొటోలు, వీడియోలు పోస్టు చేసి వలపువల విసిరే ఓ మహిళ.. తన వలలో పడిన వారు డబ్బిస్తే వాళ్లతో ఏకాంతంగా గడిపేది. ఆ సమయంలో ఆమె భర్తే గుట్టుగా వీడియోలు తీసేవాడు. ఆపై దంపతులిద్దరూ ఆ వీడియోలను చూపి బెదిరింపులకు దిగి అందినకాడికి దోచుకునేవారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా రెండేళ్లుగా ఈ గలీజు దందాకు పాల్పడుతున్న కరీంనగర్‌కు చెందిన దంపతుల బాధితుల్లో వ్యాపారులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, పలువురు యువకులు ఉన్నారు. ఓ బాధితుడి ఫిర్యాదుతో దంపతుల గుట్టును బట్టబయలు చేసిన పోలీసులు.. నిందితులను కటకటాల్లోకి నెట్టారు. కరీంనగర్ రూరల్ సీఐ ఏ నిరంజన్‌రెడ్డి కథనం ప్రకారం.. మంచిర్యాల జిల్లాకు చెందిన దంపతులు పదేళ్లుగా కరీంనగర్‌లోని ఆరెపల్లిలో నివాసం ఉంటున్నారు. భర్త గ్రానైట్, ఇంటీరియర్ డిజైన్ వ్యాపారం చేయగా, భార్య యూట్యూబ్ చానల్ నిర్వహిస్తోంది. భర్త వ్యాపారంలో నష్టం పోగా.. సులువుగా డబ్బులు సంపాదించేందుకు ఇన్‌స్టాగ్రామ్ వేదికగా వలపు వల వేసేందుకు దంపతులు పథకం రచించారు. దంపతుల్లోని మహిళకు ఇన్‌స్టాగ్రామ్‌లో 1200 మందికిపైగా ఫాలోవర్స్ ఉండగా.. అర్ధనగ్న ఫొటోలు పోస్టు చేసేది. వాటిని చూసి ఆకర్షితులై తమ వద్దకు వచ్చిన వారిపై దంపతులిద్దరూ తమ పథకాన్ని అమలు చేసేవారు. డబ్బు తీసుకొని ఆ మహిళ వారితో ఏకాంతంగా గడుపుతుండగా భర్త గుట్టుగా వీడియోలు తీసేవాడు. ఆపై, ఆ వీడియోలను చూపి బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతుండేవారు. అడిగినంత డబ్బు ఇవ్వకుంటే వీడియోలు సామాజిక మాధ్యమాల్లో పెడతామంటూ వారు చేసిన బెదిరింపులకు భయపడి చాలా మంది వారికి డబ్బులు సమర్పించుకున్నారు. ఇలా వసూలు చేసిన డబ్బుతో ఆ దంపతులు రూ. 65 లక్షలతో ఒక ప్లాట్, ఖరీదైన ఫర్నిచర్, రూ.10 లక్షల విలువైన కారు కూడా కొనుగోలు చేశారు. తన ఫాలోయర్స్‌లో 100 మందితో ఆమెకు సంబంధం ఉన్నట్టు తెలిసింది. అయితే, ఏడాది క్రితం ఈ దంపతులకు పరిచయమైన కరీంనగర్‌కు చెందిన ఓ వ్యక్తి.. దంపతులతో బాగా చనువుగా ఉండేవాడు. ఆ దంపతులు అతడి నుంచి వివిధ రూపాల్లో రూ.14 లక్షల దాకా తీసుకున్నారు. చివరికి డబ్బు లేక ఆ వ్యక్తి కొద్ది రోజులుగా దంపతులకు దూరంగా ఉంటున్నాడు. దీంతో అతడికి ఫోన్ చేసిన దంపతులు.. తమకు రూ.5 లక్షలు ఇవ్వకుంటే నగ్న వీడియోలను బహిర్గతం చేస్తామని, చంపేస్తామని బెదిరించారు. దీంతో ఆ వ్యక్తి కరీంనగర్ శ్రీపురం కాలనీ వద్ద సదరు దంపతులకు మంగళవారం రూ.లక్ష ఇచ్చి మిగిలిన సొమ్మును రెండ్రోజుల్లో ఇస్తానని బతిమాలుకున్నాడు. చెప్పినట్టు డబ్బు ఇవ్వకుంటే వీడియోలు బయటపెట్టేస్తామని ఆ దంపతులు బెదిరించారు. దీంతో ఆ వ్యక్తి జరిగిన విషయాన్ని బంధువులు, మిత్రులకు చెప్పి వారి సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ ఫిర్యాదు, బాధితుడు సమర్పించిన ఆధారాల ప్రకారం కేసు నమోదు చేసిన కరీంనగర్ రూరల్ పోలీసులు నిందితులైన దంపతులను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల విచారణలో నిందితులు తమ నేరాన్ని అంగీకరించారు. నిందితుల నుంచి కారు, నగ్న వీడియోలు తీసిన మొబైల్ ఫోన్లు, నగదును, బాధితుడికి చెందిన చెక్కును స్వాధీనం చేసుకున్నారు.

వైద్య సేవల విస్తరణకు పీపీపీయే మేలు!

- రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం సూచన
- ఆరోగ్య కార్యదర్శికి కేంద్ర సంయుక్త కార్యదర్శి లేఖ
- మధ్య, చిన్న స్థాయి నగరాల్లో ఆరోగ్య సేవలు తక్కువ
- పీపీపీ విధానంలో వీటిని విస్తరించాలి
- న్యూక్లియర్ మెడిసిన్ ద్వారా క్యాన్సర్, కార్డియో, వాస్క్యులర్, నరాల వ్యాధులకు చికిత్స
- 27 పేజీలతో మార్గదర్శకాలు జారీ



అమరావతి, జనవరి 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో వైద్య, ఆరోగ్య సేవలను ప్రజలకు మరింత విస్తృత స్థాయిలో అందించడానికి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానమే అవలంబించాలని కేంద్ర ఆరోగ్యశాఖ మరోసారి రాష్ట్రప్రభుత్వానికి సూచించింది. దీనిపై ఓ వివరణాత్మకమైన లేఖను కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి విజయ్ నెహ్రా ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ఆరోగ్య కార్యదర్శి సౌరబ్ గౌర్‌కు రాశారు. దానితో పాటు పీపీపీ ద్వారా వివిధ సేవలను గరిష్ఠ స్థాయిలో అందించడానికి 27 పేజీలతో కూడిన మార్గదర్శకాలను కూడా పొందుపరిచారు. వైద్య విద్యను విస్తరించడానికి పీపీపీ అత్యంత అనుకూల సాధనమని కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా ఇటీవల రాష్ట్రానికి లేఖ రాయడాన్ని నెహ్రా ప్రస్తావించారు. దానికి అనుబంధంగా రెండో లేఖను రాస్తున్నామన్నారు. వైద్య సేవల డిమాండ్, లభ్యత మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూరించడానికి ఐదు అంశాల్లో.. న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్యశాలలు, దంత వైద్య శాలలు, రేడియాలజీ సేవలు, క్యాన్సర్ డే కేర్ సెంటర్లను విస్తరించడానికి పీపీపీ విధానం అమలుపై కేంద్ర ఆరోగ్యశాఖ సూచనలు చేసింది. పరికరాలు సమకూర్చడం, అమలు, నిర్వహణ ద్వారా సేవల లభ్యతను పెంచాలని పేర్కొంది. 5 నుంచి 10 ఏళ్ల వరకు ప్రైవేటు భాగస్వామి ఆయా సేవలందించడానికి అనుసరించాల్సిన విధానంపై కూడా మార్గదర్శకాలు జారీచేసింది. క్యాన్సర్, కార్డియో, వాస్క్యులర్, నరాల వ్యాధులకు ఉత్తమమైన సేవల్ని న్యూక్లియర్ మెడిసిన్ ద్వారా రోగులకు అందించవచ్చని, ఈ సేవల లభ్యత ప్రస్తుత అవసరాల మేరకు, ముఖ్యంగా మధ్య, చిన్న స్థాయి నగరాల్లో బాగా తక్కువగా ఉన్నాయని.. పీపీపీ విధానంలో వీటిని పెంచడానికి తగు చర్యలు చేపట్టాలని సూచించింది. క్యాన్సర్ వ్యాధి అతి శీఘ్రంగా విస్తరిస్తున్నందున సత్వరమే చర్యలు తీసుకోవాలని పేర్కొంది. పెట్, సిటీ, స్పెక్ట్ ఇమేజింగ్, రేడియోథెరపీ సేవలను గ్రామీణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావలసిన అవసరం ఉందని స్పష్టం చేసింది. 60 శాతం నుంచి 90 శాతం వరకు వివిధ వయస్కులు దంత సమస్యలతో బాధపడుతున్నా అవసరాల మేరకు వైద్య సేవలు లభించడం లేదని ఆందోళన వ్యక్తం చేసింది. సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో దంత వైద్య పరికరాలు, వైద్యుల లభ్యత తగు స్థాయిలో లేవని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పీపీపీ ద్వారా దంత వైద్య సేవలను పటిష్ఠం చేయాలని రాష్ట్ర ఆరోగ్యశాఖను కోరింది. వ్యాధి నిర్ధారణలో ఎంతగానో ఉపకరించే ఎక్స్‌రే, సిటీ స్కాన్, ఎంఆర్ఐ యంత్రాల లభ్యతను విస్తరించాలని.. అందుకు పీపీపీ విధానం ఉపయోగపడుతుందని తెలిపింది. ముందస్తు స్ర్కీనింగ్, వ్యాధి నిర్ధారణ కోసం క్యాన్సర్ డే కేర్ సెంటర్ల ఏర్పాటుకు కూడా ఈ పద్ధతి అనువైనదని పేర్కొంది. 2027-28లోగా దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో డే కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నదే కేంద్రం లక్ష్యమని, ఈ దిశగా 2025-26 సంవత్సరానికి ఆంధ్రప్రదేశ్‌కు 14 సెంటర్లు మంజూరు చేశామని కేంద్ర ఆరోగ్య శాఖ తన లేఖలో గుర్తుచేసింది. ఈ లేఖ వివరాలను కార్యదర్శి సౌరభ్ గౌర్ వైద్య ఆరోగ్య మంత్రి సత్యకుమార్‌కు వివరించారు. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్లాలని మంత్రి సూచించారు.

నేటి నుంచి 'వెస్ట్ బైపాస్'పై చలో చలో



గుంటూరు, జనవరి 14(ఆంధ్రజ్యోతి): విజయవాడ వెస్ట్ బైపాస్ సంక్రాంతి నుంచి అందుబాటులోకి రానుంది. అన్ని రకాల వాహనాలను ఒకవైపు అనుమతించేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) ఏర్పాట్లు చేస్తోంది. గుంటూరు జిల్లా కాజ, చినకాకాని జంక్షన్ నుంచి ఎన్టీఆర్ జిల్లా గొల్లపూడి మీదుగా చిన్న అవుటుపల్లి టోల్‌గేట్ జంక్షన్ వరకూ వెళ్లేందుకు వీలుగా ఒకవైపు రహదారిని ఎన్‌హెచ్ఏఐ సిద్ధం చేసింది. బుధవారం రహదారి పనులను క్షుణ్ణంగా ఎన్‌హెచ్ఏఐ అధికారులు పరిశీలించారు. గుంటూరు నుంచి అమరావతి, గొల్లపూడి, విజయవాడ, హైదరాబాద్, ఏలూరు, ఉత్తరాంధ్ర వైపు వెళ్లే వారికి వీలుగా 15 నుంచి రాకపోకలను అనుమతిస్తున్నట్లు తెలిపారు. ఆమేరకు కాజ టోల్ గేటు వద్ద ఎన్‌హెచ్- 16, వెస్ట్ బైపాస్ అనుసంధాన పనులు ఒకవైపు పూర్తయినట్లు జాతీయ రహదారుల సంస్థ స్పష్టం చేసింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.